శనివారం
15-11-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 54
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad, Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

బీహార్ ఎన్డీయేదే

- 203 స్థానాలతో సంపూర్ణ మెజారిటీ
- 34 సీట్లకే పరిమితమైన మహాగట్బంధన్
- 3 స్థానాల్లో వామపక్షాల గెలుపు
- 5 స్థానాల్లో మజ్లిస్ విజయఢంకా

పట్నా: దేశవ్యాప్తంగా రాజకీయ ఉత్కంఠను రేపిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించింది. శుక్రవారం ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి అధికార ఎన్డీయే కూటమి ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు మించి ఆధిపత్యం ప్రదర్శించింది. మొత్తంగా 243 స్థానాలు ఉన్న బీహార్ అసెంబ్లీలో మెజారిటీకి అవసరమైన సంఖ్య (మ్యాజిక్ ఫిగర్) 122 కాగా, ఏకంగా 203 స్థానాల్లో విజయం సాధించి 'డబుల్ సెంచరీ' రికార్డు నెలకొల్పింది. దీంతో బీహార్‌లో మళ్లీ నితీశ్‌కుమార్ నేతృత్వంలోనే ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు కానుంది. ఎన్డీయే కూటమిలోని ప్రధాన పక్షాలైన బీజేపీ 90 స్థానాల్లో విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది. జేడీయూ 85 స్థానాల్లో గెలుపొంది రెండో స్థానంలో నిలిచింది. ఇక ఎల్‌జేపీ (రాంవిలాస్) 19 స్థానాల్లో, హెచ్‌ఏఎం(ఎస్) 5 స్థానాల్లో, ఆర్ఎంఎల్ 4 స్థానాల్లో గెలుపొందాయి. ఇక ప్రతిపక్ష మహాగట్బంధన్ కూటమి కేవలం 34 స్థానాలకు పరిమితమైంది. ఇందులో ప్రధాన పార్టీలైన ఆర్జేడీ 24 స్థానాలు గెలుచుకోగా, కాంగ్రెస్ పార్టీ 6 స్థానాలకు పరిమితమై దారుణ పరాజయం మూట గట్టుకుంది. కాగా మహాగట్బంధన్‌లో భాగమైన వామపక్ష సీపీఐ (ఎంఎల్) రెండు స్థానాల్లో, సీపీఎం ఒక స్థానంలో విజయం సాధించాయి. ఐఐపీ ఒక స్థానం గెలుచుకుంది. కాగా, అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని మజ్లిస్ పార్టీ సత్తా చాటింది. ఐదు స్థానాల్లో విజయ ఢంకా మోగించింది. ఇక ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ స్థాపించిన జన్ సురాజ్ పార్టీ ఖాతా కూడా తెరవలేకపోయింది. ఈ ఎన్నికల్లో బీజేపీ, జేడీ(యూ)లు దాదాపు సమాన సంఖ్యలో ఆధిక్యం సాధించడంతో సంకీర్ణ ప్రభుత్వం స్థిరంగా కొనసాగేందుకు బలమైన మద్దతు లభించినట్లయింది. ప్రతిపక్ష మహాగట్బంధన్‌కు ఈ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కూటమి కేవలం 34 స్థానాల్లో మాత్రమే విజయం సాధించగలిగింది. 2020 ఎన్నికల్లో 114 స్థానాల్లో గెలుపొందిన ప్రతిపక్ష కూటమి... ఈసారి అందులో సగం కూడా దక్కించుకోలేకపోయింది. ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ కూడా రాఘోపూర్‌లో అతి కష్టంమీద గెలుపొందారు.

సుపరిపాలన, అభివృద్ధిదే గెలుపు: మోదీ

న్యూఢిల్లీ: బీహార్‌లో సుపరిపాలన, అభివృద్ధి గెలిచాయని ప్రధాని మోదీ అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి నూతన సంకల్పంతో పని చేసేందుకు ఈ విజయం మరింత శక్తినిస్తుందని ఎక్స్ మాధ్యమంగా వెల్లడించారు. బీజేపీ మిత్రపక్షాల నాయకులకు అభినందనలు - మిగతా 2 లో

సమన్వయ లోపానికి తప్పని మూల్యం

బీహార్ ఫలితాలపై డి.రాజా

బీహార్‌లో ఎన్డీయే విజయం సందేహాలభరితమని, ఎన్నికల ఫలితాలు ఆత్మ పరిశీలనను డిమాండ్ చేస్తున్నాయని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. 2 లో

కాంగ్రెస్‌కు పట్టం

24,729 ఓట్ల ఆధిక్యం సాధించిన నవీన్ యాదవ్

సీఎం వ్యూహం... ప్రతిపక్షానికి ప్రతిబంధకం

- అజహరుద్దీన్‌కు మంత్రి పదవిచ్చి మైనార్టీల్లో పట్టు
- జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ గల్లంతు

విశాలాంధ్ర - హైదరాబాద్: ఉత్కంఠభరితంగా సాగిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఎట్టకేలకు హైదరాబాద్ మహా నగరంలో ఆ పార్టీ బోణీ కొట్టింది. యూసఫ్‌గూడలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుతో ప్రక్రియ ప్రారంభం కాగా ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్ ఆధిక్యాన్ని ప్రదర్శించింది. తొలి రౌండ్‌లో ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థిపై 42 ఓట్ల ఆధిక్యం సాధించిన కాంగ్రెస్ ఆ తరువాత నుంచి వెనుకంజ వేయలేదు. రౌండ్‌రౌండ్‌కు ఆధిక్యాన్ని పెంచుకుంటూ 10 రౌండ్లలో మొత్తం 24,729 ఓట్ల ఆధిక్యంలో దూసుకుపోయింది. ఎగ్జిట్ అంచనాలను సైతం తలకిందులు చేసింది. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ జరిగింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు 98,988 ఓట్లు (50.83 శాతం) రాగా, బీఆర్ఎస్ అభ్యర్థిని మాగంటి సునీతకు 74,259 (38.13 శాతం), బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డికి 17,061 (8.76 శాతం) ఓట్లు వచ్చాయి. దీంతో 24,729 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి - మిగతా 2 లో

గెలుపు... బాధ్యత పెంచింది

- కిషన్‌రెడ్డి వైఖరి మార్చుకోవాలి
- కాంగ్రెస్‌పై పెరుగుతున్న ప్రజాదరణ
- అసత్య ప్రచారాలతో విషం కక్కిన బీఆర్ఎస్
- అసూయ, అహంకారం తగ్గించుకోవాలి: సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: జూబ్లీహిల్స్ గెలుపు కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యతను మరింతగా పెంచిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మా పై ఎంతో నమ్మకంతో ప్రజలు తమకు పట్టం కట్టారని పేర్కొన్నారు. ఉప ఎన్నికలో గెలుపు కోసం కృషి చేసిన అందరికీ అభినందనలు తెలిపారు. సహకరించిన తెలంగాణ సమాజానికి, పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలు చెప్పారు. ఉప ఎన్నిక ఫలితాలు వెల్లడి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో నెగ్గితే ఉప్పొంగడం... ఓడితే కుంగిపోవడం కాంగ్రెస్ కు తెలియదన్నారు. ప్రతిపక్షంలో ఉంటే ప్రజా సమస్యలపై పోరాడటం... అధికారంలో ఉంటే సమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ పార్టీకి తెలుసని అందుకే ప్రజల్లో కాంగ్రెస్ పై ఇప్పటికీ ఆదరణ తగ్గలేదని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో ప్రజలు విలక్షణ తీర్పు ఇచ్చారని, పోలైన ఓట్లలో 51 శాతం కాంగ్రెస్‌కు, 38 శాతం బీఆర్ఎస్‌కు, ఎనిమిది శాతం బీజేపీకి ఓటు వేశారన్నారు. మా రెండేళ్ల పాలనను ప్రజలు నిశితంగా గమనించి ఎన్నికల్లో తీర్పు ఇచ్చారని వివరించారు. నగరాన్ని అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని, మన పాత్రలు, వ్యవహార శైలిని ప్రజలు గమనిస్తున్నారని, అందుకే ఈ ఎన్నికల్లో ప్రజలు విస్పష్టంగా తీర్పు ఇచ్చారని అభిప్రాయపడ్డారు. ఇది బాధ్యతగా భావించి నగరాన్ని విశ్వ నగరంగా - మిగతా 2 లో

పరకామణి కేసు ఫిర్యాదుదారుడు సతీశ్‌కుమార్ అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర- తిరుపతి: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన పరకామణి చోరీ కేసు ఫిర్యాదుదారుడు, టీటీడీ మాజీ ఏవీఎస్ఓ సతీశ్‌కుమార్ మృతి మిస్టరీగా మారింది. అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని కోమలి దగ్గర రైల్వేట్రాక్‌పై మృతదేహం కనిపించింది. వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా... వారు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. సతీష్‌కుమార్‌ది ఆత్మహత్యా? హత్యా? అనేది స్పష్టత రావాల్సి ఉంది. పరకామణి చోరీ కేసులో ఈ నెల 6న సతీశ్‌కుమార్‌ను సీఐడీ అధికారులు ప్రశ్నించారు. మరోసారి విచారణకు రావాలని నోటీసులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం గుంతకల్లు రైల్వేలో జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. 2023 ఏప్రిల్‌లో సీనియర్ అసిస్టెంట్ రవికుమార్‌పై అప్పటి టీటీడీ ఏవీఎస్ఓ సతీశ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. టీటీడీ పరకామణిలో రవికుమార్ చోరీ చేస్తుండగా పట్టుకున్నారు. హుండీ సొమ్ము లెక్కింపు సమయంలో రవికుమార్ చోరీ చేసినట్లు సతీశ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. పరకామణి చోరీకేసును లోక్ అదాలత్‌లో రాజీచేసుకోవడాన్ని జర్నలిస్టు ఎం.శ్రీనివాసులు ఏపీ హైకోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దీనిపై దర్యాప్తు చేయాలని సీఐడీని హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. సతీశ్‌కుమార్ ఒకసారి విచారణకు హాజరయ్యారు. మరోసారి హాజరు కావాల్సి ఉండగా... ఇంతలోనే అనుమానాస్పద స్థితిలో చనిపోవడం కలకలం రేపింది.ఏపీ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌లో సతీశ్‌కుమార్ ప్రతివాదిగా ఉన్నారు. ఆయన గత నెలలో హైకోర్టులో ఓ అఫిడవిట్ వేశారు.

పాలనపై నమ్మకమిది

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయంపై కూనంనేని

- ప్రజాసమస్యల పరిష్కారంలో కిషన్‌రెడ్డి విఫలం
- కేంద్ర వివక్షకు ఈ గెలుపు నిదర్శనం

విశాలాంధ్ర- హైదరాబాద్: ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న కాంగ్రెస్ పాలనపై నమ్మకంతోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటర్లు కాంగ్రెస్‌కు ఘన విజయాన్ని కట్టబెట్టారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. విజ్ఞతతో ఓటు వేసిన ఓటర్లకు ఆయన అభినందనలు తెలియజేశారు. స్వయంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్ సభ నియోజకవర్గ పరిధిలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆయన సొంత పార్టీ అయిన బీజేపీ అభ్యర్థికి డిపాజిట్ గల్లంతయిందన్నారు. పదేళ్లుగా ఎంపీగా ఉన్నప్పటికీ ప్రజాసమస్యల పరిష్కారంలో వైఫల్యం చెందినట్టు రూఢీ అవుతుందన్నారు. హైదరాబాద్... తెలంగాణపై అన్ని రకాలుగా వివక్షత చూపుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ ప్రజలు విజయం కట్టబెట్టారన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం సమస్యలను తీర్చకపోవడం ఆ పార్టీ ఓటమికి ప్రధాన కారణమని, సానుభూతి పనిచేయలేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మరింత బాధ్యతగా సమస్యల పరిష్కారం, హామీల అమలుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఎన్నికలలో విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఉప ఎన్నికలలో తమ పార్టీ కాంగ్రెస్‌కు మద్దతు తెలపడమే గాకుండా ప్రచారం చేసిందని గుర్తుచేశారు.

బీహార్‌లో ఎన్నికల కమిషన్‌దే విజయం

బీహార్ శాసనసభ ఎన్నికల్లో విజయం ఎన్‌డీయే కూటమిది కాదని, ఎన్నికల సంఘానిదని కూనంనేని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు ఆ రాష్ట్రంలో 75 లక్షల మంది మహిళల బ్యాంక్ ఖాతాలలో నితీశ్‌కుమార్ ప్రభుత్వం రూ. 10 వేలు నగదు బదిలీ చేసినా ఎన్నికల సంఘం ఏమాత్రం - మిగతా 2 లో

వృక్షమాత తిమ్మక్క కన్నుమూత

బెంగళూరు: ప్రకృతితో ఐక్యంగా జీవితాన్ని మార్చుకున్న కర్నాటకకు చెందిన ప్రకృతి పరిరక్షకులు, ప్రముఖ పర్యావరణవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత సాలుమరద తిమ్మక్క (114) కన్నుమూశారు. గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 1911, జూన్ 30న తుమకూరు జిల్లాలోని గుబ్బి తాలూకాలో తిమ్మక్క జన్మించారు. గ్రామీణ ప్రాంతాలను సస్యశ్యామలం చేయడంలో ఎంతో కృషి చేసి - మిగతా 2 లో

కూలిన ఐఏఎఫ్ శిక్షణ విమానం

చెన్నై: భారత వైమానిక దళానికి చెందిన శిక్షణా విమానం ప్రమాదానికి గురైంది. సింగిల్ సీటర్ ట్రైనర్ విమానం చెన్నైలోని తాంబరం ఎయిర్ బేస్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం కుప్పకూలింది. గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పైలట్‌ను రక్షించారు. ప్రమాదం గురించి అధికారులకు సమాచారం ఇచ్చారు. సాధారణ శిక్షణా సమయంలో ప్రమాదవశాత్తూ కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. అయితే, అదృష్టవశాత్తూ పైలట్ సురక్షితంగా ప్రాణాలతో బయట పడ్డారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ చేస్తున్నారు.

అనిల్ అంబానీకి ఈడీ తాజా సమన్లు

న్యూఢిల్లీ: ఫెమా కేసులో నవంబరు 17న తమ ముందు హాజరుకావాలని రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా సమన్లు జారీ చేసింది. షెడ్యూల్ ప్రకారం అనిల్ అంబానీ శుక్రవారం హాజరుకావాల్సి ఉన్నప్పటికీ ఆయన గైర్హాజరయ్యారు. 'వర్చువల్ మార్గాల ద్వారా' సాక్ష్యం చెప్పాలనే అంబానీ ప్రతిపాదనను దర్యాప్తు సంస్థ తిరస్కరించిందని ఈడీ వర్గాలు తెలిపాయి. దర్యాప్తులో 'పూర్తి సహకారం' అందిస్తామని హామీ ఇస్తూ దర్యాప్తు సంస్థ లేఖ రాసినట్లు 66 ఏళ్ల వ్యాపార వేత్త ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం అంబానీని స్వయంగా హాజరు కావాలని, విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) - మిగతా 2 లో

ఇదీ లోకం!



సీఐఐ భాగస్వామ్య సదస్సుకు

అనూహ్య స్పందన

75 ఎంవోయూలు... రూ.7,14,780 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: పెట్టుబడులే లక్ష్యంగా విశాఖలో నిర్వహిస్తున్న సీఐఐ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో గత రెండు రోజులుగా ఒప్పందాలు జోరందుకున్నాయి. సదస్సుకు ముందు రోజే రూ.3.65 లక్షల కోట్ల మేర ఒప్పందాలు జరగగా, గురువారం పెట్టుబడి దారుల సదస్సు ప్రారంభం రోజే మరో మూడు - మిగతా 2 లో

వైజ్ఞానిక తెలంగాణ నిర్మిస్తాం

- సైంటిఫిక్ టెంపర్‌మెంట్‌కు నెహ్రూ పునాదులు
- దార్శనికత లేని పాలన సమాజానికి శాపం: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: వైజ్ఞానిక తెలంగాణ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విజ్ఞాన దర్శిని అధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలో దివంగత ప్రధాని నెహ్రూ 80వ సైంటిఫిక్ టెంపర్ మెంట్ ఉత్సవాలు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన భట్టి మాట్లాడుతూ... వైజ్ఞానిక అభివృద్ధికి ప్రయోగశాలగా తెలంగాణ రాష్ట్రాన్ని మార్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పండిట్ నెహ్రూ దేశానికి తొలి ప్రధాని కావడంతో కేవలం సైన్స్ మాత్రమే కాదు ప్రజాస్వామ్యంలోనూ ప్రపంచంతో పోటీ పడేందుకు కారణం అయింది అన్నారు. స్వాతంత్ర్యం సాధించిన నాడు భారతదేశం అనేక సవాళ్లను ఎదుర్కొందన్నారు. నాటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ వైజ్ఞానిక ఆలోచనతో సైంటిఫిక్ టెంపర్మెంట్ పునాదులు వేయకపోతే ఈరోజు దేశ ప్రజలు చాలాఇబ్బంది పడేవారు అన్నారు. నెహ్రూ పంచవర్ష ప్రణాళికలు రూపొందించి అందులో ఏ అంశంపై దృష్టి పెట్టాలి అనేది మేధావులతో చర్చించి ఖరారు చేశారని పేర్కొన్నారు. వ్యవసాయం, పారిశ్రామిక రంగాలపై దృష్టి పెట్టి మిశ్రమ ఆర్థిక విధానాలు రూపొందించారన్నారు. దేశంలో సోషలిజం ఆలోచనను విస్తృతం చేశారని డిప్యూటీ సీఎం వివరించారు. సోషలిజం, ప్రజాస్వామ్యం అనే ఆలోచనలతో భారత రాజ్యాంగంలో మేళవించి ముందుకు తీసుకు వెళ్లారని తెలిపారు. దార్శనికత లేని వారు పరిపాలన సాగిస్తే అది సమాజానికి శాపంగా మారుతుందన్నారు. భారతదేశం బలంగా ఎదగాలని సైన్స్ రీసెర్చ్ జరగాలని హోమిబాబా, విక్రమ్ సారా బాయ్ వంటి ప్రముఖులను ఆహ్వానించి ఐఐటీలను స్థాపించారని వివరించారు. సైన్స్, టెక్నాలజీ, డిఫెన్స్ రంగాల్లో హైదరాబాదును కేంద్రంగా ఎంచుకొని నెహ్రూ ఇందిరా, గాంధీలు - మిగతా 2 లో

తప్పు జరిగింది క్షమించండి: బీబీసీ

లండన్: ప్రఖ్యాత మీడియా సంస్థ బీబీసీ క్షమాపణలు చెప్పింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్ బిలియన్ డాలర్ల నష్టపరిహారం డిమాండు వ్యవహారంలో స్పందించింది. తమ ప్రోగ్రామ్‌తో ట్రంప్ పేరుప్రఖ్యాతలకు నష్టం కలిగేలా ప్రవర్తించలేదని బీబీసీ వెల్లడించింది. ట్రంప్ ప్రసంగాన్ని తప్పుగా ఎడిట్ చేయడంపై ఆరోపణలను తోసిపుచ్చింది. అయితే 2021 జనవరి 6వ తేదీన ఆయన చేసిన ప్రసంగాన్ని బీబీసీ ఛానల్‌లో ప్రసారం చేయడం వల్లే క్యాపిటల్ హిల్‌లో అల్లర్లు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో బీబీసీ ఉన్నత అధికారులు ఇద్దరు రాజీనామా కూడా చేశారు. బీబీసీ చైర్మెన్ సమిర్ షా ఈ వ్యవహారంలో శ్వేతసౌధానికి ప్రత్యేకంగా లేఖ రాశారు. ట్రంప్ ప్రసంగం ఎడిటింగ్ వ్యవహారంలో సంస్థ తరపున క్షమాపణ కోరారు.

వివాదాస్పద డాక్యుమెంటరీని మళ్లీ ప్రసారం చేయమని బీబీసీ స్పష్టంచేసింది. ఎడిట్ చేసిన ట్రంప్ ప్రసంగం తప్పుదోవ పట్టించేదిగా ఉన్నట్లు అంగీకరించింది. క్షమాపణ చెప్పకపోతే బిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాలంటూ ట్రంప్ తరపున బీబీసీకి ఇటీవల నోటీసు అందిన విషయం తెలిసిందే.

క్షేమంగా భువికి షెంజౌ 20 క్రూ

జ్యుక్వాన్: చైనాకు చెందిన షెంజౌ 21 వ్యోమనౌక రిటర్న్ క్యాప్సూల్ భూమికి చేరుకుంది. షెంజౌ 20 వ్యోమగాములను క్షేమంగా తీసుకొచ్చింది. ఉత్తర చైనా మంగోలియా అటానమస్ ప్రాంతంలోని డాంగ్‌ఫెంగ్ లాండింగ్ స్థలిలో ఈ వ్యోమనౌక శుక్రవారం ఉదయం 11.14 (స్థానిక కాలమానం) దిగింది. ఈ మేరకు చైనా మ్యాన్డ్ స్పేస్ ఏజన్సీ (సీఎంఎస్ఎ) ప్రకటించింది. షెంజౌ-20 వ్యోమగాములు షెంజౌ-21 నౌకలో భూమికి తిరిగి వచ్చినట్లు తెలిపింది. భవిష్యత్తులో తగిన సమయంలో షెంజౌ-22 అంతరిక్ష నౌకను ప్రయోగిస్తామని పేర్కొంది. గతవారం అంతరిక్ష శకలాలు షెంజౌ-20 నౌకను ఢీకొనడంతో ముగ్గురు వ్యోమగాములు భూమికి చేరుకోవడం ఆలస్యమైనట్లు వెల్లడించింది.

కీవ్‌పై రష్యా భీకర దాడి

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా భీకర దాడి చేసింది. అర్ధరాత్రి డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. రాజధాని పరిధిలోని ప్రతి జిల్లాలో శుక్రవారం ఉదయం దాడులు జరిగినట్లు నగర మేయర్ విటలీ క్లిట్ష్కో వెల్లడించారు. సిటీ సెంటర్‌లో పేలుళ్లు సంభవించినట్లు వార్తాలు వచ్చాయి. కాగా, కీవ్‌లోని మౌలిక రంగాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా రష్యా క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసిందని కీవ్ ప్రాంతీయ సైన్యాధికారి మైకోలా కలాష్నిక్ వెల్లడించారు. 'ఈ దాడుల్లో ఒకరు మరణించగా, 15 మందికి గాయాలయ్యాయి. ఓ గర్భిణితో పాటు మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. 40 మంది ప్రాణాలు కాపాడాం ' అని అత్యవసర సేవల సిబ్బంది వెల్లడించారు. హీటింగ్ నెట్‌వర్కులు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. డెస్నియాన్స్కి జిల్లాలో కొన్ని భవనాలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. కీవ్‌లో విద్యుత్, నీటి సరఫరాకు అంతరాయం కలిగిందని చెప్పారు. నివాస ప్రాంతాల్లో, నివాస భవనాలే లక్ష్యంగా రష్యా దాడులు చేస్తోందని వెల్లడించారు. ఎత్తైన భవనాలు ఎక్కువగా దెబ్బతిన్నాయని సైన్యాధికారి తైమూర్ ట్కాచెంకో తెలిపారు. 2022 నుంచి ఉక్రెయిన్-రష్యాకు మధ్య పోరు కొనసాగుతున్న విషయం విదితమే.

'ఎస్కపేడ్' మార్స్ మిషన్ విజయవంతం

న్యూయార్క్: అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మార్స్ మిషన్ 'ఎస్కపేడ్' ప్రయోగం విజయవంతమైంది. బ్లూ ఆర్జిన్‌కు చెందిన జంబో రాకెట్ అంతరిక్ష నౌక నింగిలోకి దూసుకెళ్లింది. అనంతరం రాకెట్ విజయవంతంగా భూమిని చేరింది. వాతావరణ సమస్యలు, సౌర తుపాను కారణాలతో కొన్ని రోజులుగా వాయిదా పడిన 'ఎస్కపేడ్' మిషన్ అంగారకుడి యాత్ర ప్రారంభించింది. ఫ్లోరిడా తీరంలోని కేప్ కెనవెరల్ స్పేస్ స్టేషన్ నుంచి 'న్యూ గ్లెన్' రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగంతో 321 అడుగుల భారీ రాకెట్ 'న్యూ గ్లెన్' రోబోటిక్ మార్స్ సైన్స్, భారీ వాణిజ్య రాకెట్లకు సంబంధించి కొత్త శకానికి నాంది పలికింది. అంగారక గ్రహం ఎలా తన వాతావరణాన్ని కోల్పోయిందో ఇది పరిశోధిస్తుంది. మార్స్ పరిణామం, నివాసయోగ్యతను అధ్యయనం చేస్తుంది. మార్స్‌పై అయస్కాంత క్షేత్రం, ప్లాస్మా వాతావరణాన్ని ఈ మిషన్ శోధించనున్నది. బిలియన్ల ఏళ్ల నిగూఢ డేటాను సేకరించనుంది. 'ఎస్కపేడ్' ఏడాది పాటు భూకక్ష్యలో తిరుగుతూ 2027 నాటికి అంగారకుడి కక్ష్యలోకి చేరుతుంది. ఒకసారి మార్స్ కక్ష్యలోకి ప్రవేశించగానే బ్లూ, గోల్డ్ ఉపగ్రహాలు పనిచేయడం ప్రారంభిస్తాయి.

నితీశే బీహార్ సీఎం: చిరాగ్

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే గెలుపుతో లోక్ జనశక్తి పార్టీ (రాంవికాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ అధికార కూటమిలో పట్టు పెంచుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ కొనసాగుతారన్నారు. తేజస్వీ యాదవ్, రాహుల్ గాంధీ నేతృత్వ ప్రతిపక్ష కూటమి అహంకారమే ఎన్డీయే ఘన విజయానికి కారణమని చిరాగ్ వ్యాఖ్యానించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో నితీశ్ డబుల్ ఇంజిన్ ప్రభుత్వ బలానికి ఈ విజయం స్పష్టమైన సంకేతమని అన్నారు.

వృక్షమాత తిమ్మక్క కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. పిల్లలు కలగకపోవడంతో మొక్కల్నే పిల్లలుగా భావించి, పచ్చదనం, పర్యావరణం కోసం ఆమె పనిచేస్తున్నారు. తిమ్మక్క అందించిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 2019లో పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. అంతేకాదు, బీబీసీ ఎంపిక చేసిన 100 మంది ప్రభావశీల మహిళల జాబితాలో తిమ్మక్క ఒకరిగా నిలిచారు.

పాలనపై నమ్మకమిది

(మొదటిపేజీ తరువాయి)

పట్టించుకోలేదని అన్నారు. అలాగే ఎస్ఐఆర్ పేరిట 65 లక్షల ఓట్లు తొలగించారని గుర్తుచేశారు. ఇవన్నీ ఎన్డీయే కూటమి విజయానికి దోహదం చేశాయని అన్నారు. అదే సమయంలో విపక్ష మహా ఘట్‌బంధన్ సైతం ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత కూడా సీట్ల సర్దుబాటు పూర్తి చేసుకోకపోవడంతో ప్రజలలో కూటమిపై నెలకొన్న సానుకూలతను ఉపయోగించుకోలేకపోయిందని అన్నారు. భవిష్యత్‌లో దీనిని ఒక పాఠంగా తీసుకొని సాధ్యమైనంత త్వరగా సర్దుబాటు చేసుకోవాలని ఈ ఎన్నికలు సూచిస్తున్నాయని అన్నారు.

ఎన్డీయే గెలుపుతో కార్మిక వర్గానికి కష్టాలు

బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గెలవడంతో కార్మిక వర్గానికి భవిష్యత్‌లో కష్టాలు వస్తాయని, కార్మికవర్గం పటిష్టంగా ఉండి పోరాటాలకు సిద్ధం కావాలని కూనంనేని పిలుపిచ్చారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘాల సమావేశం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఎం.డి.యూసఫ్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, రాష్ట్ర నాయకులు ఎం.నరసింహ, ప్రేంపావని, బాబు, కరుణ వేదికపై ఆశీనులయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అందుకు కార్మిక లోకం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ నూరు వసంతాల పండుగ ఖమ్మంలో జరుగుతున్నదని, ఈ శత వార్షికోత్సవ సభకు కార్మిక వర్గం అధిక సంఖ్యలో విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

వైజ్ఞానిక తెలంగాణ నిర్మిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అనేక కేంద్ర సంస్థలను స్థాపించారని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం లో ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నాం అన్నారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నాం అని అన్నారు. ఫ్యూచర్ సిటీ లో సైంటిఫిక్ టెంపర్‌ను కొనసాగిం చేందుకు స్కిల్ యూనివర్సిటీ పనులు వేగంగా చేపట్టాం అన్నారు. హై స్కూల్స్, కళాశాలలో విజ్ఞాన ప్రదర్శనలు ప్రారంభించండి ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సౌకర్యాలు అందిస్తాం అని డిప్యూటీ సీఎం తెలిపారు. దీన్ని సమన్వయం చేయాలని ట్రై కార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ను కోరారు. నెహ్రూ ఆలోచన ప్రజాస్వామ్య భారత దేశం భవిష్యత్‌కు పునాది అని డిప్యూటీ సీఎం అన్నారు.

అనిల్ అంబానీకి ఈడీ తాజా సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

కింద ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకోవాలని ఈడీ కోరినట్లు వివరించింది. ఈ దర్యాప్తు జైపూర్-రీంగస్ హైవే ప్రాజెక్టుకు సంబంధించినది. తన గ్రూప్ కంపెనీలపై జరిగిన రూ.17 వేల కోట్ల విలువైన బ్యాంకు మోసానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో వ్యాపారవేత్తను ఒకసారి ఈడీ ప్రశ్నించింది.

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- ఏపీలో పెట్టుబడులకు అపార అవకాశాలు
- నవభారత్ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి కార్యాచరణ
- సంపద సృష్టితోనే పేదరిక నిర్మూలన
- సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

విశాలాంధ్ర -సచివాలయం/విశాఖపట్నం: భారత్ మూడేళ్లలో మూడోవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తెలిపారు. శుక్రవారం విశాఖ పట్నం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్స్‌లో 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సును ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రారంభించారు. అనంతరం ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ..ప్రధాని మోదీ నేతృత్వంలో ఆర్థికంగా సుసంపన్న దేశంగా భారత్ ఎదుగుతోందన్నారు. సంపద సృష్టిస్తేనే ప్రపంచంలో పేదరిక నిర్మూలన సాధ్యం అవుతుందన్నారు. ఏపీలో సుపరిపాలన, అత్యుత్తమ విధానాలనే ప్రభుత్వం ఆచరిస్తోందన్నారు. అభివృద్ధికి, సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు రోల్ మోడల్ గా నిలుస్తున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దారని, రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏపీని అభివృద్ధి చేయడానికి అంతే శ్రద్ధ చూపిస్తున్నారని చంద్రబాబును కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు సాధించడానికి చంద్రబాబు పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులను ఒప్పిస్తున్నారన్నారు. విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడుల సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. దేశం, రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, బ్లూ, అగ్రి ఎకనామి రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఏపీలో ఉన్నాయని తెలిపారు.

దేశంలోనూ, ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. అతిపెద్ద స్టార్టప్ ఎకో సిస్టమ్ గా భారత్ ఎదుగుతోందన్నారు. ప్రతీ దేశంతోనూ భారత్ మైత్రినే కోరుకుంటుందని అంతా కలిసి ఎదుగుదామని,ఇతరులకు నష్టం కలిగించటం కాదు, ప్రయోజనం కల్పించటం ద్వారా అభివృద్ధి సాధించాలనేది భారత్ నినాదమని ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ తెలిపారు.

గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ...30వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు వరుసగా 8వ సారి ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇస్తోందని, దేశ విదేశాలకు చెందిన ప్రతినిధులు హాజరైన ఈ సదస్సు ప్రపంచ వాణిజ్యాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ఫ్యూచర్ రెడీ ఇన్నోవేషన్ రాష్ట్రంగా ఏపీని ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్చిదిద్దుతున్నారన్నారు. ఈ సదస్సు ద్వారా ప్రతీ ఆలోచనా, ప్రతీ పెట్టుబడి భవిష్యత్ తరాలకు సంపదగా మారాలని ఆకాంక్షించారు.

కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ మాట్లాడుతూ... 2047 స్వర్ణాంధ్ర విజన్‌తో ఏపీ సాంకేతికంగా, ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు సుసంపన్న దేశంగా భారత్ అవతరిస్తుందన్నారు. టెక్నాలజీ ద్వారా ఇది సాధ్యమన్నారు. 30 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులతో సెమీ కండక్టర్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ఆ దిశగా పనిచేస్తున్నామని, ఇంజినీరింగ్ నైపుణ్యాలు ఉన్న భారత యువత ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తున్నారన్నారు. ప్రపంచవ్యాప్తంగా భిన్నమైన పరిస్థితులు ఉన్నా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెద్దఎత్తున భారత్ ఆకర్షిస్తూనే ఉందని తెలిపారు. అత్యంత పారదర్శకమైన విధానంలో వాణిజ్యం ఉండాలని మేం కోరుకుంటున్నామని, సీఐఐ సదస్సులతో సరికొత్త పెట్టుబడులు, ఆలోచనలు, ఆవిష్కరణలు రావటం అభినందనీయమని కొనియాడారు. వాణిజ్య ప్రదర్శనలకు, ఎగ్జిబిషన్లు, సదస్సులకు వీలుగా దిల్లీలో భారత్ మండపం ఉన్నట్టే ఆంధ్రా మండపం నిర్మించడానికి మేం సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ... వన్ మిషన్, వన్ విజన్ తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటు తోపాటు అతిపెద్ద మార్కెట్‌కు పారిశ్రామికవేత్తలను, కంపెనీలను చేరువ చేస్తుందని, వివిధ రంగాల్లోని పెట్టుబడులకు నమ్మకమైన భాగస్వామిగా ఏపీ నిలువనుందని పేర్కొన్నారు. అగ్రికల్చర్ నుంచి ఏరో స్పేస్ వరకూ వివిధ రంగాల్లో పెట్టుబడులు, యూనిట్లు ఏపీ వస్తున్నాయని తెలియజేశారు.

కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తోందన్నారు. గత కొన్ని నెలలుగా ఏపీలో కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందని... పోర్టులు, ఎయిర్ పోర్టులు అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం అవుతున్నాయని,ఏరోస్పేస్, ఎయిర్ క్రాఫ్ట్ తయారీని కూడా ఏపీకి తీసుకువస్తామని తెలిపారు. ఈ భాగస్వామ్య సదస్సుకు కేంద్ర మంత్రులు పీయూష్ గోయెల్, రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్ రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్,నాదెండ్ల మనోహర్, సీఎస్ విజయానంద్, సీఐఐ అధ్యక్షుడు రాజీవ్ మెమానీ, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, విశిష్ట అతిథులుగా కరణ్ అదానీ, యూసఫ్ అలీ, బాబా కల్యాణి తదితర దిగ్గజ పారిశ్రామిక వేత్తలు, దేశవిదేశాలకు చెందిన ప్రతినిధులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు , పెట్టుబడిదారులు హాజరయ్యారు.

సమన్వయ లోపానికి తప్పని మూల్యం

న్యూదిల్లీ: బీహార్‌లో ఎన్డీయే ఎన్డీయే విజయం సందేహాలభరితమని, ఎన్నికల ఫలితాలు ఆత్మ పరిశీలనను డిమాండ్ చేస్తున్నాయని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఎస్ఐఆర్‌లో భాగంగా 65 లక్షల ఓటర్ల పేర్లు తొలగించడం, ఓటర్ల అసలు సంఖ్య కంటే మూడు లక్షలకుపైగా ఓటర్లు ఉండటం అనేక ప్రశ్నలకు తావిస్తున్నదన్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలపై డి.రాజా శుక్రవారం ఎక్స్ మాధ్యమంగా స్పందించారు. ఎన్నికల సంఘం లెక్కలపై అనుమానాలు వ్యక్తంచేశారు. ఇండియా ఐక్య సంఘటనలో సీట్ల సర్దుబాటు సమయంలో సమన్వయ లోపానికి భారీ మూల్యం చెల్లించుకోవల్సి వచ్చిందన్నారు. ఈ పరిణామం పరస్పర సహకారానికి, ఐక్య కార్యాచరణకు, సైద్ధాంతిక సంఘీభావానికి పిలుపునిస్తోందని రాజా అన్నారు. అతిస్పష్టమైన ఉమ్మడి కార్యా చరణతో... విశ్వసనీయ సైద్ధాంతిక ప్రత్యామ్నాయంగా ప్రజల్లోకి వెళ్లడం ఎంత ముఖ్యమో ఈ ఫలితం నేర్పిందని రాజా వ్యాఖ్యానించారు. బీహార్‌లో సీపీఐ అభ్యర్థులకు మద్దతిచ్చిన ప్రతి ఒక్కరికి, వారి గెలుపు కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామిక, న్యాయమైన, సుసంపన్నమైన బీహార్ కోసం ఎన్ని ఆటంకాలు వచ్చినాగానీ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని, స్వాతంత్ర్యం రాకముందు నుంచి ప్రజల పక్షాన పోరాడటానికి సీపీఐ పూర్తిగా కట్టుబడి ఉన్నదని డి.రాజా వెల్లడించారు.

చారిత్రక విజయానికి ధన్యవాదాలు: నితీశ్

పట్నా: అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేకు చారిత్రక విజయాన్ని అందించిన బీహార్ ప్రజలకు సీఎం నితీశ్ కుమార్ శుక్రవారం ఎక్స్‌లో కృతజ్ఞతలు తెలిపారు. 'మమ్మల్ని నమ్మి మళ్లీ పట్టంకట్టారు. చారిత్రక విజయాన్ని అందించారు. ఇందుకోసం రాష్ట్ర ఓటర్లకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. హృదయపూర్వకంగా ధన్యవాదాలు చెబుతున్నా' అని ఆయన పోస్టు పెట్టారు. 'రాష్ట్ర పాలనకు నిరంతరం సహకరించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు. ఎన్డీయే భాగస్వాములకూ ధన్యవాదాలు. బీహార్ భవిష్యత్‌లో మరింత ప్రగతి సాధిస్తుంది. దేశంలోని అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఒకటిగా నిలుస్తుంది' అని నితీశ్ పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు పట్టం

(మొదటిపేజీ తరువాయి)

గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు. ప్రతి రౌండ్లోను కాంగ్రెస్ ఆధిక్యతను ప్రదర్శించింది. ఏ ఒక్క రౌండ్ లోను మాగంటి సునీత అధిక్యం దక్కించుకోలేక పోయారు. ఈ గెలుపు సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌కు... కాంగ్రెస్ శ్రేణులకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. గాంధీభవన్ వద్ద కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ సిట్టింగ్ స్థానాన్ని కోల్పోగా బీజేపీ డిపాజిట్ గల్లంతయింది. ఫలితాలు కాంగ్రెస్ కు అనుకూలంగా వస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఇంటికి భారీగా కార్యకర్తలు చేరుకోవడం తో కోలాహలం నెలకొంది. దీంతో ఆయన ఇంటి వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విజయంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు విజయోత్సవాలు జరుపుకున్నారు. భారీ ర్యాలీలు, బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలోనే ఇది అత్యధిక మెజార్టీ. బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులకు 2023 ఎన్నికల కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. సీఎం రేవంత్ ఛాలెంజ్ చేసినట్టుగానే బీజేపీకి డిపాజిట్ గల్లంతైంది. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ విజయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం వరకు దగ్గరుండి పర్యవేక్షించారు. డివిజన్ల వారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించి సమ న్వయం చేశారు. క్షేత్రస్థాయిలో నేతలు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి శ్రేణుల్లో జోష్ నింపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేలా సీఎం చర్యలు చేపట్టారు. మైనార్టీల్లో మరింత పట్టుకోసం పోలింగ్‌కు కొద్దిరోజుల ముందే అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టారు.

ఓటములే విజయసోపానాలుగా...

ఓటములనే విజయసోపానాలుగా మార్చుకున్నారు నవీన్ యాదవ్. 2009లో యూసుఫ్‌గూడ డివిజన్ ఎంఐఎం పార్టీ నుంచి కార్పొరేటర్‌గా నిలిచి టీడీపీ అభ్యర్థి మురళీగౌడ్ చేతిలో ఓటమిపాలయ్యారు. 2014లో ఎంఐఎం తరపున జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోటీ చేసి 41,656 ఓట్లు (25.19శాతం) సాధించి రెండో స్థానంలో నిలిచారు. 2015లో ఎంఐఎం అభ్యర్థిగా రహ్మత్‌నగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా పోటీచేసి ఓడిపోయారు. 2018లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 18,817 ఓట్లు సాధించారు. 2023 , నవంబరు 15న అప్పటి పీసీసీ అధ్యక్షుడైన రేవంత్‌రెడ్డి సమక్షంలో నవీన్ యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలిచి విజ యం సాధించి చరిత్ర సృష్టించారు. ఆర్కిటెక్ట్, స్థిరాస్తి వ్యాపారం వృత్తిగా ఎంచుకున్న నవీన్ నవ యువ ఫౌండేషన్‌ను స్థాపించి నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వల్లాల చిన్నశ్రీశైలంయాదవ్ కుమారుడైన నవీన్ యాదవ్... 1983, నవంబర్‌లో జన్మించారు. ఆయనకు భార్య వర్షయాదవ్, కుమారుడు అన్షయాదవ్. స్వస్థలం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ. సేవాతత్పరుడుగా మంచి పేరు తెచ్చుకున్నారు. విమర్శలను సైతం ఓట్లుగా మలుచుకుని రికార్డుస్థాయిలో మెజార్టీని కొల్లగొట్టారు.

ఉప ఎన్నిక పోటీ అభ్యర్థి మృతి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లెక్కింపు వేళ విషాదం చోటు చేసుకుంది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహమ్మద్ అన్వర్ (40) గురువారం రాత్రి గుండె పోటుతో మరణించారు. ఎర్రగడ్డ నివాసి అయిన ఆయన అక్టోబరు 22న నామినేషన్ వేశారు. ఫలితాలకు ఒక్కరోజు ముందు మహమ్మద్ అన్వర్ మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులు విషాదంలో మునిగి పోయారు.

గెలుపు... బాధ్యత పెంచింది

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి చేయాలని సంకల్పించామని పేర్కొన్నారు. మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్లు, మూసీ పునరుజ్జీవం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, గోదావరి జలాల తరలింపు వంటి కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలతో ప్రభుత్వంపై బీఆర్ఎస్ విషం చిమ్మిందని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షం అభివృద్ధికి సహకరించకపోగా ప్రతీ సందర్భంలో అవహేళన చేసే ప్రయత్నం చేసిందని విమర్శించారు. హైడ్రా, మూసీ విషయంలో ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకునే ప్రయత్నం చేశారని, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకో కుండా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సహాయ నిరాకరణ చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కిషన్ రెడ్డే అభ్యర్థిగా మారి పనిచేస్తే 17 వేల ఓట్లు వచ్చాయని ఎద్దేవా చేశారు. ఈ ఫలితాల తరువాతైనా కిషన్ రెడ్డి తన వ్యవహార శైలి మార్చుకోవాలని హితవు పలికారు. ఫలితాలు విశ్లేషించుకుని తెలంగాణ అభివృద్ధికి సహకరించాలన్నారు. కిషన్ రెడ్డిని సచివాలయానికి సాదరంగా ఆహ్వానిస్తున్నామని, కేంద్రం వద్ద పెండింగ్ అనుమతులు, నిధులపై చర్చిద్దామన్నారు. కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్ అనుమతులు, నిధులకు సంబంధించి సమీక్ష పెట్టి నివేదిక రూపంలో ఎంపీలకు ఇవ్వాలని ఉపముఖ్యమంత్రికి సూచన చేస్తున్నా అన్నారు. హరీశ్ రావు ...మీ అసూయను తగ్గించుకోండి, కేటీఆర్... మీ అహంకారాన్ని తగ్గించుకోండని సూచించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చి కాంగ్రెస్ కు అధికారం ఇచ్చారన్నారు. 65 అసెంబ్లీ స్థానాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో మాకు ఖచ్చితమైన మెజారిటీ ఇచ్చారని అన్నారు. జూబ్లీహిల్స్ లో 51 శాతం ఓట్లతో ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారని, బీఆర్ఎస్, బీజేపీ ఓట్లు కలిపినా అన్ని ఓట్లు రాలేదన్నారు. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్లు ఉంది... రెండేళ్లు అభివృద్ధికి సహకరించాలన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయండి... సమస్యలు ఉంటే ప్రశ్నించండి, ధర్నాలు చేయండి అని హితువు పలికారు. మీ సోషల్ మీడియాలో మీరు చెప్పిందే రాస్తారు.. అదే నిజమని మీరు భ్రమల్లోకి వెళితే ఎలా అని ప్రశ్నించారు. వ్యాపార దృక్పథంతో కొన్ని మీడియా సంస్థలు తప్పుడు సమాచారం వ్యాపింపజేస్తున్నారని, కాంగ్రెస్ కు స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తున్నా కొన్ని ఛానళ్లు బీఆర్ఎస్ హవా మొదలైందని వార్తలు వేశాయన్నారు. దయచేసి మీ విశ్వసనీయత కోల్పోకండి... మాపై మీకు వ్యతిరేకత ఉంటే ఇంకో రకంగా చూపించాలని మీడియాకు సూచించారు. ఈ ఫలితాలపై విశ్లేషణ చేయండి... అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ ఓటు బ్యాంకు పెరుగుతూ వస్తోందన్నారు. 2023 ఎన్నికల్లో 39.5 శాతం ఓట్లు కాంగ్రెస్ కు వచ్చాయి, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 41 శాతం ఓట్లు , ఇప్పుడు 51 శాతం ఓట్లు ప్రజలు ఇచ్చారని అన్నారు.

సీఐఐ భాగస్వామ్య సదస్సుకు అనూహ్య స్పందన

(మొదటిపేజీ తరువాయి)

లక్షల 49 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఉత్సాహభరిత వాతావరణం లో విశాఖలో ప్రారంభమైన పెట్టుబడిదారుల సదస్సులో వివిధ సంస్థలతో ఒప్పందాలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక రాయితీలతో కూడిన ఆఫర్లను తెలియజేయడంతో దేశ, విదేశాల నుంచి విచ్చేసిన అనేకమంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు తరలివచ్చారు. విశాఖ విమానాశ్రయం ప్రత్యేక విమానాలతో నిండిపోయింది. విశాఖ ఎయిర్‌పోర్టు పార్కింగ్ బేస్ మొత్తం 16 విమానాలకు ఉండగా, అంతకుమించి రద్దీ ఏర్పడడంతో రాజమండ్రి విమానాశ్రయంలో 6 విమానాలు దిగాల్సి వచ్చింది. సీఐఐ భాగస్వామ్య సదస్సు తొలి రోజు వివిధ సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం నిన్నటి తరహాలోనే శుక్రవారం కూడా భారీ ఎత్తున పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకుంది. సదస్సు ప్రారంభానికి ముందురోజే మొత్తంగా 40 కంపెనీలతో రూ. 3,49,476 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందాల ద్వారా 4,15,890 ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని అధికారులుతెలిపారు. శుక్రవారం 35 ఒప్పందాల ద్వారా రూ. 3,65,304 కోట్ల పెట్టుబడులు, 1,26, 471 ఉద్యోగాలు వస్తాయని అంచనా వేశారు. రెండు రోజులు కలిపి 75 ఎంఓయూల ద్వారా రూ.7,14,780 కోట్ల పెట్టుబడులు, 5,42,361 ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇవి కాకుండా మరిన్ని ఒప్పందాలు మంత్రి నారా లోకేశ్ సహా వివిధ శాఖల మంత్రులు చేస్తున్నట్లు తెలిసింది.

ఏపీలో స్టీల్ రంగంలో పెట్టుబడులకు జపాన్ కంపెనీల ఆసక్తి

ఆంధ్రప్రదేశ్‌లో స్టీల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ ఆసక్తిగా ఉందని ఆ దేశ రాయబారి ఓనో కేయిచ్చి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఓనో కేయిచ్చి భేటీ సందర్భంగా స్టీల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు తమ దేశంలోని పారిశ్రామిక వేత్తలు ఆసక్తిగా ఉన్నారని తెలిపారు. జపాన్ ఫార్మా రాజధాని కొయామా మాదిరిగానే ఏపీని ఔషధ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు జపాన్ సహకారం అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమిట్‌లో 20కి పైగా జపాన్ కంపెనీలు పాల్గొనడం పట్ల ముఖ్యమంత్రి ఆనందం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతిలో భవన నిర్మాణాల్లో జపాన్, సింగపూర్ ప్రతినిధులను ఆహ్వానించిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. శ్రీ సిటీలో ఇప్పటికే అనేక జపాన్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని సీఎ చంద్రబాబు కేయిచ్చికి తెలిపారు.

విశాఖలో లులూ మాల్, రాయలసీమలో లాజిస్టిక్ ప్రొక్యూర్మెంట్ ఎక్స్‌పోర్ట్ కేంద్రం

రాష్ట్రంలో చేపట్టే వివిధ ప్రాజెక్టులకు సంబంధించి లులూ ఇంటర్నేషనల్ గ్రూప్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లులూ గ్రూప్ చైర్మన్, ఎండీ యుసుఫ్ అలీ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఆ సంస్థ ప్రతినిధులు అంగీకార పత్రాలు మార్చుకు న్నారు. అలాగే ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోనూ లులూ సంస్థ ఒప్పందాలు చేసింది. మామిడి, జామ పల్ప్‌తొ పాటు మసాలా దినుసులు రాష్ట్రం నుంచి సేకరించి ఎగుమతి చేస్తామని లులూ సంస్థ వెల్లడించింది. వచ్చే జనవరి నుంచి ఏపీ నుంచి ఎగుమతులు ప్రారంభిస్తామని స్పష్టం చేసింది. త్వరలోనే లాజిస్టిక్ ప్రొక్యూర్మెంట్ ఎక్స్‌పోర్ట్ కేంద్రాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయనున్నట్టు లులూ గ్రూప్ చైర్మన్, ఎండీ యుసుఫ్ అలీ ప్రకటించారు. విశాఖలో లులూ సంస్థ 13.83 ఎకరాలు, 13.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.1,066 కోట్లతో నిర్మించే ఇంటిగ్రేటెడ్ వరల్డ్ క్లాస్ మాల్‌తో 5 వేల మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. ప్రస్తుతం విశాఖ లో నిర్మించనున్న మాల్ దేశంలో భారత్ లో తొమ్మిదవదని రాష్ట్రంలో మొట్టమొదటిదని లులూ సంస్థ వెల్లడించింది.

ఏఎం గ్రీన్ సంస్థతో ఎంవోయూ

ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో గ్రీన్ అల్యూమినియం కాంప్లెక్స్ నిర్మాణంపై ఏఎం గ్రీన్ ఒప్పందం చేసుకుంది. 1 మిలియన్ టన్నుల గ్రీన్ అల్యూమినియమ్ కాంప్లెక్స్ నిర్మాణంపై జరిగిన ఈ ఎంవోయూ ప్రకారం సుమారు రూ. 40 వేల కోట్లతో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడలో ఏఎం గ్రీన్ పరిశ్రమ పెట్టనుంది. ఇప్పటికే ఏపీలో రూ.50 వేల కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టిన ఈ సంస్థ, బయోమాస్ నుంచి వివిధ రకాల హైడ్రోకార్బన్స్ ఉత్పత్తి చేసే పరిశ్రమ ఏర్పాటుపై మరో ఒప్పందం చేసుకుంది. మరో రూ.10 వేల కోట్లతో సస్టెయినబుల్ ఏవియేషన్ ఫ్యుయల్ తయారీ యూనిట్‌ను పెట్టనుంది. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో సెకండ్ జనరేషన్ ఇథనాల్ బయో రిఫైనరీ పరిశ్రమలు ఏర్పాటు చేయనుంది.

ఇన్నోవేటివ్ ప్రాజెక్టుల్లో సింగపూర్ కంపెనీలతో ఒప్పందం

ముఖ్యమంత్రి చంద్రబాబు, సింగపూర్ హోం శాఖామంత్రి షణ్ముగం సమక్షంలో సింగపూర్ ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు మంత్రి నారా లోకేష్-సింగపూర్ విదేశీ వ్యవహారాలు, ట్రేడ్ ఇండస్ట్రీ మంత్రి గాన్ సో హాంగ్ ఒప్పంద పత్రాలను ఇచ్చి పుచ్చుకున్నారు. అర్బన్ గవర్నెన్సు, రియల్ టైమ్, డిజిటల్ గవర్నెన్సు ట్రాన్సఫర్మేషన్, సుస్థిరాభివృద్ధి అంశాలపై అవగాహనా ఒప్పందం కుదిరింది.

సుపరిపాలన, అభివృద్ధిదే గెలుపు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. 'బీహార్‌లోని నా కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఎన్డీయేను మళ్లీ అశీర్వదించి చారిత్రక విజయాన్ని అందించారు' అని మోదీ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బీహార్‌ను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళతామని, రాష్ట్రంలో మౌలిక వసతులు, సంస్కృతికి కొత్త గుర్తింపు కల్పిస్తామని, యువశక్తికి, స్త్రీశక్తికి అవకాశాలు పెంపొందిస్తామని, సుసంపన్న జీవితాలు గడిపేలా చూస్తామని మోదీ హామీలు ఇచ్చారు.

తహసీల్దార్ కార్యాలయానికి శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరు నిర్మల్ జిల్లా : ఖానాపూర్ మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యేలు కార్యాలయ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కార్యాలయ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి, నిర్దిత గడువులోగా పనులు పూర్తి చేసి, ప్రజలకు సేవలు అందించడానికి కార్యాలయాన్ని అందుబాటులోకి తేవాలని అన్నారు. నూతన కార్యాలయ భవన నిర్మాణం పూర్తయ్యేలోపు అధికారులు విధులు నిర్వహించడానికి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసిల్దార్ సుజాత, మండల ప్రత్యేక అధికారి జీవరత్నం, ఈఈ పిఆర్ చందు జాదవ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు .

ఓసి ఫేజ్-2 ప్రాజెక్టు కుటుంబాలకు నష్టపరిహారం ఇప్పించండి

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా పరిధిలోని రామకృష్ణాపూర్ సింగరేణి ఓపెన్ కాస్ట్ మైన్ రెండో ఫేజ్ పర్యావరణ అనుమతి కోసం డిసెంబర్ 3న పబ్లిక్ హియరింగ్ నిర్వహించనున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ సభ ఏర్పాటుకు ముందే క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నాలుగోవ వార్డు ఆర్ కె ఫోర్ గడ్డ, శాంతి నగర్‌లో నివాసముంటున్న కాలనీ వాసులు ఆ వార్డు మాజీ కౌన్సిలర్ రెవెల్లి ఓదెలు ఆధ్వర్యంలో ఓపెన్ కాస్ట్ ఫేజ్ -2 ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలకు సరైన నష్ట పరిహారం, గృహ నిర్మాణ స్థలాలతో కూడిన పునరావాసం కల్పించవలసిందిగా మంచిర్యాల జిల్లా కలెక్టర్, ఆర్డీవో, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్, మందమర్రి ఏరియా జీఎంలకు కాలనీవాసులందరి సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసారు. అనంతరం మాజీ కౌన్సిలర్ రెవెల్లి ఓదెలు మాట్లాడుతూ ఫేజ్-1 ప్రాజెక్టు 2014 సంవత్సరంలో ప్రారంభమైన సమయంలో అనేక కుటుంబాలు తమ ఇళ్లను, భూములను కోల్పోయారు. గాలి, నీరు కాలుష్యం వలన కాలనీవాసులకు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. కొందరు ప్రాణాలు సైతం కోల్పోయారు. కొందరి ఆర్థిక పరిస్థితులు దయనీయంగా ఉండటంతో, చాలామంది కుటుంబాలు ఈ ప్రమాదకర పరిస్థితుల మధ్యే నివసించవలసి వచ్చింది. ఇప్పుడు ఫేజ్-2 ప్రాజెక్టు ప్రారంభమైతే ఈ ప్రాంతం మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది కాబట్టి సంబంధిత అధికారులు ఓపెన్ కాస్ట్ ఫేజ్-2 ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలకు నష్ట పరిహారం, గృహ నిర్మాణ స్థలాలతో కూడిన పునరావాసం ఏర్పాటు చేయాలన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా హెచ్చరించారు. శుక్రవారం గోదావరి ఖని మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ అనే ఆలోచన విద్యార్థులలో లేకుండా పూర్తిగా నిరోధించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్ గోదావరిఖని లోని సింగరేణి మెడికల్ కళాశాలలో విద్యార్థులకు గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, పెద్దపల్లి జోన్ షీ టీమ్ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిపి మాట్లాడుతూ ర్యాగింగ్‌కి పాల్పడడం అనేది ఏ రూపంలోనైనా నేరం అని,అలాంటి వారిపై కేసులు నమోదు చేసి,జైలుశిక్ష, కళాశాల నుండి తొలగింపు వరకూ చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని సీపీ అన్నారు. ఎవరైనా ర్యాగింగ్‌కు గురైతే ఆత్మస్థైర్యం కోల్పోవడం, తరగతులకు రావడానికి భయపడడం, మానసికంగా కృంగిపోయి బాధపడకుండా ధైర్యంగా ఎటువంటి భయం లేకుండా వెంటనే పోలీసులకు, యాంటీ ర్యాగింగ్ కమిటీకి సమాచారం ఇవ్వాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏ సి పి ఎం రమేష్, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి నాగేంద్ర గౌడ్ , మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ , గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, సునీత,ఎన్. జి ఓ, ఎస్సై అనూష, పెద్దపల్లి జోన్ షీ టీమ్ ఇన్చార్జి ఎస్ ఐ లావణ్య, షీ టీమ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, మెడికల్ కళాశాల ప్రొఫెసర్స్,విద్యార్థులు 500 మంది పాల్గొన్నారు.

పురుగుమందు తాగి యువతి మృతి

విశాలాంధ్ర కారేపల్లి :పురుగుమందు త్రాగి యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన కారేపల్లి మండల పరిధిలోని రేలకాయలపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. రేలకాయలపల్లికి చెందిన జర్పల సందీప్తి(20)ఖమ్మంలో ఉంటూ చదువుకుంటుంది. ఏన్కూర్ మండలానికి చెందిన నామ నరేష్ రేలకాయలపల్లిలో ఆర్‌ఎంపీగా పని చేస్తున్నాడు.ఆర్‌ఎంపీ నరేష్ కొంతకాలంగా సందీప్తిని ప్రేమిస్తున్నాని,ఆమె ఉంటున్న ఖమ్మం వెళ్ళి సరదాగా పోటోలు దిగాడు.వీరి ప్రేమ విషయం తెలిసిన సందీప్తి తల్లిదండ్రులు బాలికను చదువు మాన్పించి ఇంటివద్దనే ఉంచారు.ఈక్రమంలో నరేష్ తాము ఇద్దరు దిగినపోటోలను సోషల్‌మీడియా ద్వారా ప్రచారం చేయటంతో ఈ విషయమై యువతి తల్లిదండ్రులు నరేష్ వేధింపులకు గురిచేస్తున్నారని ఈనెల 6వ తేదిన నరేష్ పై కారేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.ఈక్రమంలో యువతి గురువారం పురుగు మందు సేవించగా గమనించిన తల్లిదండ్రులు ఆమెను ఆసుపత్రికితరలించి చికిత్స నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. ఆర్‌ఎంపీ నరేష్ వేధింపులతోనే తమ బిడ్డ ఆత్మహత్యకు పాల్పడిందని యువతి తల్లిదండ్రులు ఆరోపించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..

విశాలాంధ్ర - దమ్మపేట : దేశ దివంగత ప్రధాని చాచా జవహర్లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా పాఠశాలల్లో బాలల దినోత్సవం పండుగను తలపించేలా నిర్వహించారు. గోపాలపురం గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయుల్లా వేశధారణ చేసి తోటి విద్యార్థులకు బోధించిన తీరు ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పిల్లల హక్కులు, అభివృద్ధి, సృజనాత్మకతపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. విద్యార్థులు పాటలు, కథలు, క్విజ్‌లలో తమ ప్రతిభను చూపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొని చిన్నారులను అభినందించారు.

ఏజెన్సీలో వలసలు నివారించాలి

విశాలాంధ్ర - గుండాల : ఏజెన్సీ మండలమైన గుండాలలో రాజ్యాంగం ప్రసాదించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు విసి దొర డిమాండ్ చేసారు. శుక్రవారం మండల కేంద్రంలో సంఘం నేత పూనెం రమణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దొర మాట్లాడుతూ గుండాల మండల కేంద్రం 1970 నుంచి ఇప్పటికి విచ్చలవిడిగా గిరిజనేతరుల వలసలు అధికమైయ్యాయని తెలిపారు. గిరిజన ఇతరులు రంగాల్లో విస్తరించి ఆధిపత్యం చేస్తుండటం వల్ల తరాల నుంచి స్థానికంగా ఉన్న ఆదివాసీల ఉనికికి ప్రమాదం ఏర్పడిందన్నారు. ఈ వలసలు ఇక్కడే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఆదివాసి ముఖ్య గ్రామాల్లో అధికమయ్యాయని ఫలితంగా ఆదివాసీలు అన్నివిధాలా నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వున్నప్పుడు సరిహద్దు ప్రాంతాల గిరిజనేతరులు పెద్దఎత్తున వలసలు వచ్చారని, నేడు తెలంగాణలోని మైదన ప్రాంతాల నుంచి గిరిజనేతరుల తోపాటు లంబాడీలు గుండాలకు విచ్చలవిడిగా వలస వచ్చారని తెలిపారు. 1/70 చట్టానికి విరుద్ధంగా వలసలు వచ్చిన వారు ఏదేచ్ఛగా అధిక ధరలు వెచ్చించి ఆదివాసీల ఇళ్ల స్థలాలు, భూములు కొని బహుళ అంతస్తులు నిర్మించుకొన్నారని విమర్శించారు. వడ్డీ వ్యాపారాలు యదేచ్ఛగా చేస్తు ఆదివాసీలను వ్యూహాత్మకంగా రుణగ్రస్తులుగా చేస్తూ ఇళ్లలో సాగుభూవులను లాక్కుంటున్నారని ఆరోపించారు. పంచాయితీ, మండల రెవిన్యూ అధికారులు కూడా వారికే అండగా ఉంటున్నారని ఆరోపించారు. ఈ పరిణామాలపై ఆదివాసి యువత, పెద్దలు ఏకమై ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. వచ్చే నెల డిసెంబర్ 2న గుండాల తహసీల్దార్ కార్యాలయం ముట్టడి చేయాలి సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో నాయకులు పెండెకట్ల మహేష్ , గొగ్గేలా సుధాకర్, పూనెం వసంత్, జబ్బ సుధాకర్, తాటి పాపారావు, తెల్లం కిరణ్, ప్రశాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డీసీసీబీ 72వ వారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : భారత జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ 72వ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఖమ్మం డిసిసి బ్యాంకు ఆవరణలో ఖమ్మం డిసిసిబి అధ్యక్షులు దొండపాటి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. చైర్మన్ జెండా ఆవిష్కరణతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భం గా బ్యాంకు ఉద్యోగులు అందరూ సహకార వ్యవస్థ బలోపేతం కోసం అందరూ పట్టుదలతో పని చేయాలని దొండపాటి పిలుపునిచ్చారు. బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తామని డిసిసిబి జిల్లా పాలకమండలి సభ్యులు డైరెక్టర్లతోపాటుగా బ్యాంకు ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమం లో కాకతీయ సహకార శిక్షణ కేంద్రం.. వరంగల్ వైస్ ప్రిన్సిపాల్ . రాజయ్య , ఖమ్మం జిల్లా కేంద్ర సహకార అధికారి గంగాధర్ ,బ్యాంకు సీఈఓ వెంకట ఆదిత్య , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహకార అధికారి . శ్రీనివాసరావు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి ఉత్తమ పౌరులు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : నేటి బాలలే రేపటి ఉత్తమ పౌరులని వీరే దేశానికి నిజమైన సంపదని దివంగత దేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ చాలా దూరదృష్టతో అన్నారని రాష్ట్ర మైనార్టీ నాయకులు, ఉర్దూగర్ చైర్మన్ డాక్టర్. నయీమ్ ఖురేషి అన్నారు. శుక్రవారం బాలల దినోత్సవం పురస్కరించుకొని ఆయన బాలలతో గడిపారు. నెహ్రూకు చిన్నపిల్లలంటే చాలా ఇష్టమన్నారు. వీరిని దేశ భవిష్యత్తుగా భావించే వారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జవాబుదరిగా విద్యను పిల్లల హక్కు గా పరిగణించాలన్నారు. విద్యార్థుల విద్య,సంక్షేమం గురించి నెహ్రూ చాలా కృషి చేశారని గుర్తు చేసారు. తాను పిల్లతో కొద్దిసేపు గడపడం చాలా సంతోషం కలిగించిందని ఖురేషి అన్నారు.

భయంకర రుగ్మతగా మారిన డ్రగ్స్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : వర్తమాన సమాజంలో డ్రగ్స్ మత్తుమందు భయంకరమైన రుగ్మతగా మారిందని ముఖ్యంగా యువతరాన్ని అన్ని విధాలుగా నిర్వీర్యం చేస్తున్నట్లు కొత్తగూడెం జామియా మస్జిద్ మౌలానా ముఫ్తి యాకూబ్ అన్నారు. ఇస్లాం ధర్మంలొ 1400 ఏళ్ళ క్రితమే సమాజంలో ఎలాంటి మత్తుపదార్థాలు వాడకూడదని మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నిషేధించినట్లు వెల్లడించారు. శుక్రవారం మాస్జిద్ లొ ప్రత్యేక ప్రార్థనలకు ముందు ఆయన డ్రగ్స్ విషయంలో విస్తృతంగా మాట్లాడారు. నేటి తరం డ్రగ్స్, మద్యానికి బానిసవ్వడం వల్ల సమాజంలొ నేర ప్రవృత్తి పెరిగిపోతుందన్నారు. మత్తు పదార్థాల వాడకానికి తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వలేదని ఈ మధ్యకాలంలో తెలుగు రాష్ట్రంలో జరిగిన హత్యోదంతాలను వివరించారు. ఈ మత్తు మందు వల్ల శారీరకంగా మానసికంగా కుటుంబాలు ఆర్థికంగాను పతనమవుతున్నట్లు అనేక ఉదాహరణలు వివరించారు. ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఈ మహమ్మారిని నివారించటం ఎవరివల్లా కాదన్నారు. డ్రగ్స్‌పై యుద్ధంలో ప్రతి ముస్లిం బాధ్యతగా పాల్గొని మనం నివసించే ప్రజల మధ్య డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ నివారణపై జిల్లా పోలీసులు చేస్తున్న కృషిని ఆయన ఒక సందర్భంలో కొనియాడారు. భూమి మీద మనిషి జీవితానికి విశిష్టమైన స్థానం ఉందని అందులోనూ ఆరోగ్యం, వివేకం, సామరస్యం, ఆచరణాత్మక శాంతిస్థాపనకు ఇస్లాం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. " మీ చేతులతో మీరే మీ జీవితాలను నాశనం వైపు నెట్టుకోవద్దు "అని దివ్య ఖురాన్ ఆ.నెం (195) బోధిస్తుందన్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్.సి.బి) డేటా ప్రకారం దేశంలో సుమారు 10 కోట్ల మంది డ్రక్స్ కు బానిసలైనట్లు లెక్కలు చెప్తున్నాయన్నారు.

ఎస్‌డిఆర్ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని, అభివృద్ధి విషయంలో అన్ని శాఖలతో పాటు పోలీసుల సహకారం అందడం గొప్ప విషయమని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. శుక్రవారం గోవిందరావుపేట మండలం చల్వాయి లోని తెలంగాణ స్పెషల్ పోలీస్ ఐదవ బెటాలియన్ లో నూతన జిమ్, ఓపెన్ ఏరియా జిమ్ ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ ములుగు జిల్లా లాంటి ప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగుల పని చేయడం సాహసం చేయడం లాంటిదేనని, ఏ పని చేసిన ప్రజల మన్ననలు పొందడానికి కృషి చేయాలని అన్నారు. విపత్కర పరిస్థితులలో ఎస్ డి ఆర్ ఎఫ్ చేసిన సేవలు ప్రశంసనీయమని, ములుగు జిల్లాలోని కాకుండా వరంగల్ జిల్లాలో సైతం వారి సేవలను అందించడం హర్షించ దగ్గ విషయమని అన్నారు. బెటాలియన్లు కావలసిన సౌకర్యాల ఏర్పాటుకు అనుకూలం కృషి చేస్తానని హామీ ఇస్తూ నూతన రోడ్డు ఏర్పాటు కోసం అంచనాలు తయారు చేసి సమర్పించాలని తెలిపారు. ములుగు జిల్లాలో పోలీస్ శాఖ చేస్తున్న సేవలు గొప్పగాని రానున్న రోజులలో వారి సేవలు ఇలాగే కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా బెటాలియన్ లో కలెక్టర్ మొక్కను నాటారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బి. సీతారాం, అసిస్టెంట్ కమాండెంట్ - అనిల్ కుమార్, వరను గోపాల్ రెడ్డి , రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓపై ఉపాధ్యాయుడు దాడి...

విశాలాంధ్ర - ఇల్లందు : విధులు సక్రమంగా ఎందుకు నిర్వహించడం లేదని మండల విద్యాశాఖ అధికారి ఉమాశంకర్ ప్రశ్నించినందుకు ఉపాధ్యాయుడు శంకర్ కర్రతో దాడి చేసిన సంఘటన వివాదస్పదమైంది. పిల్లలకు బుద్దులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే తనపై అధికారిని కర్రతో తీవ్రంగా దండించడం సధికార, ఉపాధ్యాయ వర్గాల్లో విమర్శలకు దారితీసింది. ఈ ఘటన శుక్రవారం ఇల్లందు పట్టణంలో చోటుచేసుకుంది. ఉపాధ్యాయుడు శంకర్ నిబంధనలకు విరుద్ధంగా హాజరు రిజిస్టర్లో మధ్యాహ్నం సంతకం ఉదయాన్నే చేయడంతో గమనించిన ఎంఈఓ ఇదేం పద్ధతి అని ప్రశ్నించారు. ఇలా ఇష్టానుసారంగా సంతకాలు చేయడం సరికాదని వారించారు. నేరుగా తన బుద్ధి బయటపడటంతో ఆగ్రహించిన ఉపాధ్యాయుడు ఏం.. కుంటావో... అని తన పై అధికారి అని చూడకుండా బూతులు తిట్టుకుంటూ ఎంఈఓ పై దాడికి దిగాడని చెప్పున్నారు. కర్రతో దాడి చేయడం వల్ల ఎం ఈ ఓ కుడి చేతికి తీవ్ర గాయామై చర్మం పగిలి రక్తం వచ్చింది. దీంతో కింద పడిపోయిన ఎంఈఓ పై మరల దాడికి ప్రయత్నించడంతో అక్కడే ఉన్న ఉపాధ్యాయులంతా వచ్చి నిలువరించారు. వెంటనే ఎంఈఓ ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. ఎంఈఓ ఉమాశంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ పరిణామం సోషల్ మీడియాలో ఘుప్పుమంది. ఉపాధ్యాయుడి రౌడీయిజం పై అనేక విమర్శలు వస్తున్నాయి.

ముందు జాగ్రత్తలతో మధుమేహం నివారణ

విశాలాంధ్ర - భద్రాచలం : ఆధునిక జీవనశైలిలో శ్రమ తగ్గి అనేక మార్పులు రావడం వల్ల మధువేహం విస్తరిస్తుందని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధువరన్ అన్నారు. ప్రపంచ డయాబైటిస్ దినోత్సవం సందర్భంగా దుమ్ముగూడెం మండలంలోని నర్సాపురం పి హెచ్ సి లొ శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ వ్యాధి చిన్న పెద్ద తేడా లేకుండా మన దేశంలో విస్తరిస్తున్నట్టు చెప్పారు. సమాజంలో జీవన శైలి పూర్తిగా మారడం వల్ల శరీరంలో ఉత్పత్తి కాబడే ఇన్సులిన్ హస్తవ్యస్తంగా మారిందన్నారు. దింతో మధుమేహం ఏర్పడుతుందన్నారు. ముఖ్యంగా టైప్ వన్ చిన్న పిల్లలకు నుంచి 25 ఏళ్ళ లోపు, టైపు టు ఆపై పడిన వయసు వారికి, గర్భిణీ స్త్రీలకు కూడా ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోవడం వల్ల సంక్రమిస్తుందన్నారు. అత్యధికంగా మూత్రం రావడం, విపరీతంగా ఆకలి, దాహం వేయడం చిన్న చిన్న గాయాలు కూడా మానకపోవడం, కంటి చూపు తగ్గడం లాంటి సమస్యలు ఏర్పడతాయన్నారు. ప్రతిరోజు వ్యాయామం చాలా ముఖ్యమన్నారు. ఈ అవగాహనా సదస్సులు హ్యాండ్స్ ఇన్ హాండ్స్, ఐటీసీ మిషన్ బంగారు భవిషత్, సహకారంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా. సుభాష్, ఎన్జీవో మేనేజర్ సునీల్, కోఆర్డినేటర్ హరికిషన్, డబ్యూ హెచ్ ఓ కన్సల్టెంట్ బీ. శ్రీకాంత్, ఏఎన్ఎం లు ఆశా వర్కర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: చిన్న శంకరంపేట మండలం మిర్జాపల్లి తండాలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇళ్లను మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభోత్సవాలు చేశారు. ప్రభుత్వ తోడ్పాటుతో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులను అభినందిస్తూ, వారిచే గృహ ప్రవేశాలు చేయించారు. తమ సొంతింటి కలను సాకారం చేసిన ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపిడిఓ దామోదర్, డిఈ యాదగిరి తదితరులు పాల్గొన్నారు. మిర్జాపల్లి గ్రామ చెరువులో, గజ గట్లపల్లిలో ఉచిత చేప పిల్లల పంపిణీ చేశారు. మత్స్యకారుల సంక్షేమంలో భాగంగా వారికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. ప్రభుత్వం చేపట్టినటువంటి 100% రాయితీతో చేపపిల్లల పంపిణీ చేస్తుందన్నారు.

ఘనంగా నెహ్రూ జయంతి

విశాలాంధ్ర గూడూరు: గూడూరు మండలం మచ్చర్ల గ్రామపంచాయతీ లోని జీపిఎస్ బేతంచర్ల పాఠశాల, గూడూరు మండల కేంద్రం లోని పడమర అంగన్వాడిలలో జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పూలమాలతో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముయ్యబోయిన వెంకన్న మాట్లాడుతూ నెహ్రూ జననం 1889 నవంబరు 14న ఉత్తరప్రదేశ్లోని అలహాబాదులో జన్మించారు.ఈయన తల్లిదండ్రులు మోతిలాల్ స్వరూప రాణి 1964 మే 27న మరణించారు. ఆయనకు అనేక బిరుదులు లభించాయి. పండిట్, చాచా , నవభారత నిర్మాత నెహ్రూ ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు ఈయన తొలిభారత ప్రధానమంత్రి సుదీర్ఘంగా 17 సంవత్సరాలు పాటు భారత ప్రధాన మంత్రిగా పని చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుంచ లక్ష్మయ్య రేగ సాంబయ్య, అంగన్వాడి ఉపాధ్యాయురాలు పోలపాక రామక్క,ఆశ కార్యకర్త,నాగేల్లి గీత,అంగన్వాడీ ఆయా కొట్టెం పూలమ్మ లు పాల్గొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డా వసంత్‌రావు

విశాలాంధ్ర బ్యూరో,సంగారెడ్డి : జిల్లాలోని వైద్య సిబ్బంది అందరూ అహర్నిశలు పనిచేసి వైద్య ఆరోగ్య శాఖకు మంచి పేరు తేవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా వసంత్ రావుకోరారు. శుక్రవారం వసంత్‌రావు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ మినిస్టర్ దామోదర్ రాజనర్సింహ జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య ఆదేశాలతో సంగారెడ్డి జిల్లా ఆరోగ్య శాఖను ప్రగతి పథంలో తీసుకుని వెళ్తానని తెలిపారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు

విశాలాంధ్ర- కొండమల్లేపల్లి : జూబ్లీహిల్స్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలుపొందడంతో కొండమల్లేపల్లి మండల పార్టీ అధ్యక్షులు ఉట్కూరు వేమన్ రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాలుస్తూ, పరస్పరం స్వీట్లు పంచుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వేమన్‌రెడ్డి మాట్లాడుతూ నవీన్ యాదవ్ గెలుపుతో కాంగ్రెస్ ప్రజల గుండెల్లో మరోసారి చోటు సంపాదించిందన్నారు. మల్లేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, యువత తదితరులు పాల్గొన్నారు

తాగునీటిని అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, కొమరం భీమ్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆర్.ఓ. ప్లాంట్ ను ఆసుపత్రి పర్యవేక్షకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ ఆసుపత్రికి రోజు వైద్య చికిత్స కొరకు ప్రజలు వస్తుంటారని, వారికి స్వచ్ఛమైన తాగునీటిని అందించడం కోసం ఏర్పాట్లు చేయడం జరిగిందని . ఆసుపత్రి సిబ్బంది ఆర్.ఓ. ప్లాంట్ నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, ప్రజలు ఆర్.ఓ. ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సహకార సంఘం బలోపేతానికి కృషి

విశాలాంధ్ర-తుంగతుర్తి : సహకార సంఘం బలోపేతానికి కృషి చేస్తామని డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. శుక్రవారం తుంగతుర్తిలో రైతు సేవా సహకార సంఘం కార్యాలయం ముందు సహకారసంఘం వారోత్సవాల సందర్భంగా సంఘం జెండాను ఎగరవేసి మాట్లాడారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు మోడెం శ్రీలత, యనగందుల రామచంద్రు, కేతిరెడ్డి రవీందర్ రెడ్డి, పెండెం యాదగిరి, కాకులారాపు బిక్షం రెడ్డి, రామనర్సమ్మ, బందగొర్ల ఈదప్ప, సీఈవో శేర్ల యాదగిరి, సిబ్బంది గౌడిచర్ల మహేష్, తుమ్మ ఉమేష్ పాల్గొన్నారు.

బీసీ సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-నేరేడు చర్ల: ఈనెల 15న కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీసీ ఆక్రోశసభ జరగనున్నదని, ఈ సభకు ఈ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో బీసీలు హాజరై విజయవంతం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు, ధర్మ సమాజపార్టీ నాయకులు ఆవిరేండ్ల నాగేంద్రబాబు బీసీ జేఏసీ కన్వీనర్ బొడ్డుపల్లి సుందరయ్య బీసీ నాయకులు గుర్రం మార్కండేయ చిలకరాజు శ్రీను, పిల్లలమర్రి పుల్లారావు కొమ్రరాజు వెంకట్ పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రంలో బీసీ ఆక్రోశ సభ కరపత్రాలు విడుదల చేసిన సందర్భంగా వారు మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్లను షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చకుండా బీజేపీ చేస్తున్న మోసాన్ని, బీసీల పట్ల నిర్లక్ష్య వైఖరి వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ వైఖరిని నిరసిస్తూ ఈ సభ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. స్వాతంత్రం వచ్చి 8 దశాబ్దాలు కావస్తున్నా బీసీలు ప్రతి రంగంలోనూ అణచివేతకు గురౌవుతూనే ఉన్నారని, ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా విద్యా పరంగా వ్యాపార పరంగా జనాభా నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం లభించడం లేదని, తెలంగాణ రాష్ట్రంలో వివిధ రూపాల్లో బీసీలు ఉద్యమాలు ఆందోళనలు చేపట్టడం వల్ల తెలంగాణ ప్రభుత్వం దిగివచ్చి కులగణన చేపట్టి రాష్ట్ర శాసనసభలో బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ ఇవ్వాలని బిల్లు ఆమోదింపజేసి కేంద్రానికి పంపితే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ అట్టి బిల్లును ఆమోదిం చకుండా అడ్డుపడి బీసీలను నిలువునా మోసం చేసిందని అందుకు నిరసనగా జరిగే ఈ సభా కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా బీసీ సోదరి సోదరులు పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాపర్తి శ్రీను, ముషం నరసింహ, కొప్పు లక్ష్మీనారాయణగౌడ్ కీత భద్రయ్య చంద్రమౌళి బత్తిని శ్రీనివాస్ గౌడ్ గోపిశెట్టి సతీష్,వీరాచారి కొండా బాలకృష్ణ పాల్గొన్నారు

ఘనంగా బాలల దినోత్సవం

విశాలాంధ్ర- నల్లగొండ బ్యూరో : బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆమె నల్లగొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువు ప్రధాన లక్ష్యంగా ఉండాలని స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితేనే బలమైన భవిష్యత్తు నిర్మించుకోవచ్చుని, చిన్న వయసులోనే క్రమశిక్షణ, సమయపాలన అలవర్చుకోవాలన్నారు. రోజుకు నిర్దిష్ట సమయం చదువుకుకేటాయించాలని, సోషల్ మీడియా మొబైల్ ఫోన్ ఇన్‌స్టాగ్రామ్‌ల వినియోగాన్ని పరిమితం చేయాలని, పుస్తక పఠనం ద్వారా నైపుణ్యాభివృద్ధి ఉన్నత లక్ష్యాలు నిర్ణయించి వాటిని సాధించే దిశగా ప్రతిరోజు కృషి చేయాలన్నారు. ఆడపిల్లలు మగ పిల్లల కంటే తక్కువ కాదని, భయపడాల్సిన అవసరం లేదని, ధైర్యంగా ఉండాలని అన్నారు. చదువుకుంటే డాక్టర్లు, కలెక్టర్లుగా, తయారు కావచ్చుని, మనసులో ఏది బలంగా అనుకుంటే ఆ విధంగా తయారవ్వవచ్చుని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వై అశోక్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, కళాశాల ప్రిన్సిపల్ సుధారాణి. సి డబ్ల్యుసి చైర్మన్ చింత కృష్ణ ,చైల్డ్ వెల్ఫేర్ సంస్థ నాగ సేన రెడ్డి ,డి సి పి ఓ గణేష్,సరిత, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు తనిఖీ

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: రోడ్డు ప్రమాదాల నివారణకు తక్షణమే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిశోర్ ఝా, మంచిర్యాల డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఏ. భాస్కర్ ఆదేశాల మేరకు, బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ పర్యవేక్షణలో మందమర్రి సర్కిల్ పోలీసులు కార్యాచరణను ప్రారంభించారు. ఈ ప్రయత్నంలో భాగంగా మందమర్రి సర్కిల్ పరిధిలో గతంలో ప్రమాదాలు అధికంగా జరిగిన ప్రాంతాలు శ్రీనివాస గార్డెన్ నుండి క్యాతనపల్లి ఎక్స్ రోడ్ వరకు (బ్లాక్ స్పాట్‌లు) గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించి, స్థానిక అధికారులతో కలిసి సంయుక్త తనిఖీ నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమం లో మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, ఆర్ అండ్ బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో: 2025:26 విద్యా సంవత్సరానికి 9వ, 10వ తరగతుల్లో చదువుతున్న బీసీ, ఈబీసీ డే స్కాలర్ విద్యార్థులు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూర్యాపేట జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయం ప్రకటించింది. విద్యార్థులు ePASS వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, హార్డ్ కాపీలను జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న అర్హులైన విద్యార్థులకు ఒక్కరికి రూ.4,000 స్కాలర్‌షిప్ మంజూరు చేయబడుతుంది. ఆధార్ కార్డు, ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం ,గ్రామీణ ప్రాంతం: రూ.1,50,000 లోపు, పట్టణ ప్రాంతం: రూ.2,00,000 లోపు,పాస్‌పోర్ట్ సైజు ఫోటో,బ్యాంక్ పాస్‌బుక్ కాపీ,స్టడీ సర్టిఫికేట్‌అన్ని పత్రాలు స్కూల్ ప్రిన్సిపాల్ ధృవీకరణతో సమర్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.విద్యార్థులు గడువు తేదీకి ముందే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సంపాదకీయం

మహా పరాజయం

ఎన్నికల కమిషన్‌తో పాటు సకల సాధన సంపత్తిని గుప్పెట్లో పెట్టుకున్న వారు రాజ్యం ఏలుతున్నప్పుడు ఆ పక్షం ఎన్ని పొరపాట్లు చేసినా ఓడించడం సాధ్యం కాదని బీహార్ శాసన సభ ఎన్నికలు నిరూపించాయి. ఈ ఎన్నికల ఫలితాలు నిరాశ కలిగించాయి. అయితే ఎన్నికలకు మూడు నెలల ముందు నుంచి జరిగిన పరిణామాలను చూస్తే ఇందులో ఆశ్చర్యం కలిగించేది ఏమీ లేదు. శుక్రవారం సాయంత్రానికి వచ్చిన వివిధ పక్షాలు సాధించిన ఆధిక్యతను చూస్తే బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే 204 సీట్లు గెలిచే అవకాశం ఉంది. అంటే 2020 నాటికన్నా 80 స్థానాలు ఎక్కువగా సంపాదించే సూచన ఉంది. తేజస్వీ యాదవ్ నాయకత్వంలోని మహాఘట్బంధన్ కిందటి సారి 114 స్థానాలు సంపాదించగలిగితే ఇప్పుడు 33 సీట్లలోనే ఆధిక్యత సంపాదించగలిగింది. అంటే 2020 కన్నా 80 నియోజక వర్గాలలో వెనుకబడింది. ఈ సారి బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వానికి వీడ్కోలు తప్పదన్న అంచనాలన్నీ తలకిందు లైనాయి. అవినీతి, నిరుద్యోగం, అధికధరల వంటి సామాన్యులను వేధించే సమస్యలేవీ ఈ ఎన్నికల్లో చర్చనీయాంశాలు కాలేదు. కిందటి సారి 43 సీట్లకే పరిమితమైన నితీశ్ కుమార్ నాయకత్వంలోని జనతా దళ్(యు) ఇప్పుడు 85 సీట్లలో ఆధిక్యంలో ఉంది. బీజేపీకి కిందటి సారి 24 సీట్లే దక్కాయి. కానీ ఇప్పుడు 90 చోట్ల ఆధిక్యంలో ఉంది. అలాగే 2020 లో 75 స్థానాలు సంపాదించి అతి పెద్ద పార్టీగా ఉన్న రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ) ఇప్పుడు కేవలం 30 సీట్ల కన్నా తక్కువే సాధించింది. ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న నియోజకవర్గాలలోనూ బీజేపీ మంచి ఫలితాలు సాధించింది. దాదాపు రెండేళ్ల పాటు బీహార్‌లోని ప్రతి చోటా పర్యటించిన ప్రశాంత్‌కిశోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీ అడ్రసే లేకుండా పోయింది. ఈసారి నితీశ్ కుమార్‌ను ముఖ్యమంత్రిని చేయకూడదని బీజేపీ భావించింది. కానీ ఆయన పార్టీకి గతంలో కన్నా 39 స్థానాలు ఎక్కువ వచ్చాయి. అందువల్ల బీజేపీ నితీశ్ కుమార్‌ను ముఖ్యమంత్రి చేయకూడదన్న ఆలోచనను మార్చుకోవలసి రావొచ్చు. 18 వ తేదీన ప్రమాణం స్వీకారం చేస్తానన్న తేజస్వీ యాదవ్ ముఖంలో ఇక విషాద ఛాయలే కనిపిస్తాయి. ఈ ఎన్నికల ఫలితాలు పూర్తిగా ఏకపక్షంగా తయారయ్యాయి. విజయం సాధించడానికి బీజేపీ, నితీశ్ కుమార్ ప్రభుత్వం తొక్కని అడ్డదారి లేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తరవాత మహిళల ఉపాధి పథకం ప్రకటించి నితీశ్ ప్రభుత్వం కోటి మంది మహిళల ఖాతాలో పదేసి వేల రూపాయలు జమ చేసింది. ఎన్నికల్లో గెలవడానికి ప్రభుత్వ ధనం ఉపయోగించుకున్నారు. ఎన్నికల కమిషన్ గుడ్లప్పగించి చూస్తూ ఉండి పోయింది. గత ఆరు నెలల కాలంలో నితీశ్ కుమార్ ప్రభుత్వం రూ. 55,000 కోట్లు పంచి పెట్టింది. దీనికి విరుగుడుగా మహాఘట్బంధన్ చేసింది ఏమీ లేదు. ప్రతి కుటుంబానికి ఒక ప్రభుత్వోద్యోగం ఇప్పిస్తామని తేజస్వీ యాదవ్ హామీని జనం పట్టించుకున్న దాఖలాలే లేవు. కేవలం హైదరాబాద్‌లో మాత్రమే బలం ఉన్న అసదుద్దీన్ నాయకత్వంలోని మజ్లిస్ ఉత్తరప్రదేశ్, బీహార్ లాంటి చోట్ల పోటీ చేసి ప్రతిపక్ష విజయానికి గండి కొట్టడం పరిపాటి అయిపోయింది. మజ్లిస్ 2020 లో బీహార్‌లో అయిదు సీట్లలో గెలిచింది. అందులోంచి నలుగురు ఆర్‌జేడీలో చేరారు. కానీ ప్రతిపక్షాల ఓట్లు చీల్చడానికి మజ్లిస్ పోటీ ఉపయోగపడ్తోంది. ఈ సారి నితీశ్ పార్టీ, చిరాగ్ పాశ్వాన్ పార్టీ పంట పండింది.

సీట్ల పంపిణీలో ఎన్డీయేలోనూ లుకలుకలు కనిపించాయి. అయితే ఎన్డీయే ఆ వివాదాలను త్వరగా పరిష్కరించుకోగలిగింది. మహాఘట్బంధన్‌లో మాత్రం చివరి దాకా పేచీలు కొనసాగాయి. కాంగ్రెస్ అధిష్టానం పంపిన పరిశీలకుడు పరిష్కరించడం కన్నా కలతలు పెంచడానికే పరిమితమయ్యారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రిని బీహార్‌కు పరిశీలకుడిగా పంపితే తప్ప కాంగ్రెస్‌లోనూ, కాంగ్రెస్ పెట్టిన పేచీలూ కొలిక్కి రాలేదు. "ఇండియా" ఐక్య సంఘటన సీట్ల పంపిణీలో అంతా అస్తవ్యస్తతే. జార్ఖండ్ ముక్తి మోర్చాకు మహాఘట్బంధన్ ఒక్క సీటూ కేటాయించలేదు. జార్ఖండ్ ఎన్నికలలో మాత్రం శిబూ సొరేన్ ఆర్‌జేడీకి ఒక సీటు కేటాయించారు. గెలిచిన ఆర్‌జేడీ అభ్యర్థి జార్ఖండ్‌లో మంత్రి కూడా అయిపోయారు. ఇది మహాఘట్బంధన్‌లో ఐక్యతారాహిత్యానికి తార్కాణం. ఈ వైఖరి ఆదివాసీ ప్రాంతాలలో కచ్చితంగా ప్రతికూల ప్రభావం చూపి ఉంటుంది. మహాఘట్బంధన్‌లో సీట్ల పంపిణీ పేచీలు చివరి దాకా తేలనే లేదు. అంతిమంగా ఏడు చోట్ల మహాఘట్బంధన్‌లోని పార్టీలే పరస్పరం పోటీ చేయవలసి వచ్చింది. వీటిని ముద్దుగా స్నేహపూర్వక పోటీ అన్నప్పటికీ నష్టం మాత్రం తప్పలేదు. నితీశ్ కుమార్‌ను ముఖ్యమంత్రిని చేయకూడదని బీజేపీ అనుకుంది. కానీ మహాఘట్బంధన్ గెలిస్తే తేజస్వీ యాదవ్ ముఖ్యమంత్రి అవుతారన్న విషయంలో అనుమానమే లేదు. కానీ ఆయన పేరు ప్రకటించడానికి అనవసర తాత్సారం జరిగింది. దీనికి బాధ్యత కాంగ్రెస్‌దే. గెలిచే అవకాశం లేకపోయినా గతంలోలాగే ఈసారి కూడా కాంగ్రెస్ ఎక్కువ సీట్లలో పోటీ చేసి మహాఘట్బంధన్ విజయావకాశాలను బాగా దెబ్బ తీసింది. సంక్షేమ కార్యక్రమాల పేరిట మహిళలకు పందేరాలు పంచడంతో అనుకున్నట్టే మహిళలు నితీశ్ పార్టీకి అధిక సంఖ్యలో మద్దతిచ్చారు. అంతకు ముందే నితీశ్ ఏలుబడిలో చదువుకునే అమ్మాయిలకు సైకిళ్లు పంపిణీ చేయడం, మద్య నిషేధం విధించడంతో మహిళలు కృతజ్ఞతా భావంతో వ్యవహరించారు. బీహార్‌లో ప్రత్యేక, సునిశిత ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) వివాదాస్పదమైంది. ముందున్న దానికన్నా ఓటర్లు పెరగడానికి బదులు తగ్గడం ఎన్నికల కమిషన్ చలవే. ఎస్ఐఆర్ వ్యవహారం సుప్రీంకోర్టుకెక్కింది. అయినా ఫలితం సంతృప్తికరంగా లేదు. ఇంతగా రచ్చ అయిన ఎస్ఐఆర్‌ను బీహార్ ఓటర్లు ఓటు వేసేటప్పుడు గమనంలోకి తీసుకున్న ఛాయలే లేవు. పోనీ తమ రోజువారీ సమస్యల మీదన్నా దృష్టి పెట్టారా అంటే అదీ లేదు. తాయిలాలు తీసుకుని కృతజ్ఞత ప్రకటించారు. ఇలాంటి అంశాలెన్నింటినైనా ఏకరువు పెట్టొచ్చు. మొత్తం మీద బీజేపీ పన్నిన తంత్రాలను ఓటర్లు పట్టించుకోక పోవడం వల్ల మహాఘట్బంధన్ కుప్పకూలి పోయింది. బీజేపీ ఆగడాలను నిరోధించాలన్న లక్ష్యం నెరవేరనే లేదు. ఓటర్ల జాబితానే తారుమారు చేసినా జనం పట్టించుకోలేదు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు ఉన్న స్ట్రాంగ్ రూముల్లో సీసీకెమెరాలను నిలిపివేసినా, అర్ధరాత్రుళ్లు అక్కడికి ఏవో వాహనాలు వచ్చాయన్నా జనం స్పందించనే లేదు. బీజేపీ పనుపున ఎన్నికల కమిషన్ ఆగడాలను జనం లెక్కలోకి తీసుకోలేదు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడాన్ని నిరోధించాలనుకోలేదు. మహాఘట్బంధన్‌కు మిగిలింది మహా పరాజయమే.

మాయమైపోయాడంటారేంటి...! మనతోనే ఉంటే...!

ఇక్కడ చేయాల్సింది చాలానే ఉన్నా... అక్కడ... ఆ పైన ఇంకా ఉందనుకున్నాడేమో...! ఇక్కడి నుంచి అందుకే వెళ్లిపోయాడేమో...! పిట్టనో... పురుగునో... చేనునో... చెలకనో... చెలిమనో...నీటినో... మంటనో... బడి గంటనో... మనిషినో చూస్తే చాలు అతగాడే కనిపిస్తున్నాడు. స్థల, కాలాల గురించే మాట్లాడుకునే వాళ్లకు అతను మాయమయ్యాడు. స్థలాతీత, కాలాతీత వ్యక్తి కదా ఆ అందెశ్రీ. అందుకే, ఇందుకే "ఇందుగలడందు లేడను సందేహము వలదు. అందెశ్రీ... ఎందెందు వెదికినా అందందే కలడు" అని నాకనిపిస్తుంది. పాటకు గొంతు అవసరమై అందెశ్రీగా పుట్టాడనిపిస్తుంది. గుండెకు మరో ఆదరణ కావాల్సి వచ్చి అందెశ్రీగా అవతరించాడనిపిస్తుంది. పల్లె కన్నీటిని తుడిచే అవకాశం ఇవ్వాలని పల్లవి ప్రణమిల్లితే ఇదిగో ఈ అందెశ్రీ కరుణించాడనిపిస్తుంది. చరణాలకు శరణుచొచ్చాలనిపించి అందెశ్రీ ముందు చేయి చాచాయనిపిస్తుంది. "ఎందుకు పుట్టావు... ఎక్కి ఎక్కి ఏడ్వావు" అనుకునే లోకంలోకి మరమ్మతుల సాఫీతో వచ్చాడు ఈ తాపీమేస్త్రీ. గొర్రెల మందలం కదా మనమంతా. వాటిని అదుపుచేసే... ఆకలి తీర్చే గానమై ప్రవేశించాడు ఈ గొర్రెల మందలోకి అందెశ్రీ అనే కాపరి. ఇలా వచ్చాక ఇలాగే చేయచ్చు. ఇంకేదైనా చేయచ్చు. అసలేదీ చేయకపోవచ్చు.

చేయాలనుకున్నది తొలి చేస్తున్నప్పుడు...

చేయాలనుకున్నది వేధిస్తున్నప్పుడు...

చేయాలనుకున్నది కుదిపేస్తున్నప్పుడు... మాటలు తప్ప అక్షరాలు నేర్వని పసివాడి పాటలాగా వచ్చాడు అందెశ్రీ. ఓ సారి నేను అన్నాను... "నిరక్షరాస్యపు మహాకవి అందెశ్రీ" అని. ఎంత మురిసిపోయాడు. ఎంత సంబురపడ్డాడు. నను కౌగలించుకుని కన్నీటి పర్యంతమయ్యాడు నా చక్రి నాన్న అంటూ. అవును... అందెశ్రీ అక్షరారణ్యంలో తిరుగుతూ జింకల్ని వేటాడే పులిలాంటి వాడు కాదు. అమాయకపు ఆకలి కేకల మధ్య నిలబడి

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

మానవత్వ మూలాలను శోధించిన వాడు. అతడు మనిషితనానికి జెండాగా ఎగిరిన వాడు. మనమున్న మానవారణ్యంలో హైనాలా నవ్వుతూ తన దగ్గరకు వచ్చిన వారిని అమాంతం మింగేసే వారున్న లోకంలోకి ఓ శాంతి కపోతంలా వచ్చాడు. అందెశ్రీ పోకడ గురించి నాకు తెలీదు. అతని రాకడ గురించి మాత్రం సంపూర్ణంగా తెలుసు.

అందెశ్రీ ఎలా వచ్చాడో నెల నెలా వెన్నెలను విరగకాయించిన సీవీ కృష్ణారావుకు తెలుసు. అతను ఏం చేయకపోయినా ఎలా ఉంటుందనే రహస్యం వాద్రేవు చిన వీరభద్రుడికి తెలుసు. భుజాన వేల్లాడుతున్న బతుకు సంచీలోంచి ఏ పాట బాంబును తీసి పాలకులపై విసురుతాడో మంచి కవి సుమనశ్రీకి తెలుసు. అందెశ్రీకి ఏమీ తెలియదు. అక్షరాలను పాటల మాలగా మార్చడం మాత్రమే తెలుసు.

కుళ్లు... కుతంత్రము... పగ... పన్నాగమూ... కసి... కార్పణ్యమూ... అబద్ధమూ... అసత్యమూ... అపార్థమూ... ఇవేవీ అతగాడికి తెలియదు. తెలిసిందల్లా గుప్పెడు అక్షరాలను గంపెడు పాటలుగా అల్లడమే తెలుసు...! మానవ నరాలకు పాటల ఆక్సిజన్ అందించడమే అతనికి తెలుసు...

"చీకటి రోజుల గురించి గానాలుండవా" అని బెర్టోల్డ్ బ్రెహ్ట్ బాబాయ్ చెప్పాడు కానీ... ఆ చీకటి గానాలను వినిపించింది మాత్రం అందెశ్రీ అన్నాయ్. అదిగో ఆ గానమే "మాయమైపోతున్నడమ్మా... మనిషన్న వాడు" పాటైంది. విన్నాం. పాడుకున్నాం. మాట్లాడుకున్నాం. కలబోసుకున్నాం. కలత చెందాం. కన్నీరయ్యాం. ఇంతా చేసి చివరాఖర్న మనుషులం కాలేకపోయాం. కాలేకపోతున్నాం.

జీవ ధర్మాన్ని అనుసరించి వెళ్లిపోతారు కానీ... మానవ ధర్మాన్ని అనుసరించి మిగిలిపోతారు కదా కొందరు అందెశ్రీలా. గుప్పెడు మెతుకులు దొరకకపోవడం కంటే రవ్వంత మానవత్వం కూడా కానకుండా వెళ్లిపోవడమే నిజమైన మరణం. అతడు చేసిందదే. చెప్పిందీ అదే. మీరు మాయం కాకండి అని గొంతెత్తాడు. మీరు మనుషులురా అని అరిచాడు. మీరు జీవమున్నా లేకుండా పోతున్నార్రా అని ఆక్రోశించాడు. ఆగ్రహించాడు. మనం అతను పాడింది పాట అనుకున్నాం. అతను రాసింది కవిత్వమనుకున్నాం. నిజానికి అతను పాడింది మనందరి జీవితాలను. అతడు రాసింది మనందరి జీవన రేఖలను. అర్థం కాక.. అర్థం చేసుకోలేక ఆ పాటల్నీ పాడుకుని, విని, పరవశించిపోతున్నాం. రాత్రి విన్న అతగాడి పాటలతో నిద్రించి... ఉదయాన్నే స్నానించి... మధ్యాహ్నం లంచించి... రాత్రికి డిన్నరించి.. త్రేన్చి... తిరిగి ఉదయాన్నే ఎఫ్‌బీ పోస్టులవుతున్నాం. మనుషులు కాలేకపోతున్నాం. బహుశా ఇలా కాలేకపోవడానికి మనుషులం కాదేమో... మనుషులుగా మనగలగడం లేదేమో... మనుషులుగా మిగలడం లేదేమో... అతగాడు... ఆ అందెశ్రీ చెప్పింది... కోరింది... వాంఛించింది ఇలా మిగిలుతున్న మనల్ని కాదేమో...!

శ్మశానస్థలి వంటి ఈ భూమిపై కాలుతున్నది మనందరి శరీరాలేనేమో... మనిషితనం మాయమవుతోంది అన్నది అందుకేనేమో... అతడు... ఆ అందెశ్రీ సశ్శరీర మనీషి కదా... ! మాయమెందుకవుతాడు. అనాథను అక్కున చేర్చుకున్న వారందరి పేర్లు అందెశ్రీ. అన్యాయపుటంథ యుగంలో కనిపించని కథలన్నింటినీ వెలికి తీస్తున్న ఒకానొక మానవుడి పేరు అందెశ్రీ. కొన్ని శరీరాలు హఠాత్తుగా రోడ్లపై మటుమాయం కాకుండా కాపాడుతున్న వారందరి పేర్లు అందెశ్రీ. అతగాడూరేగిన ప్రపంచ నదీ జలాల్లోని సమస్త జల చరాలన్నింటి పేర్లు అందెశ్రీ. మాయం కావడానికి అతను మనిషి కాదు. అతడు అందెశ్రీ.

- సీనియర్ జర్నలిస్ట్, 99120 19929

ప్రైవేటు చేతుల్లోకి విద్యుత్



జగ్‌మోహన్ థాకెన్

రైతు, వినియోగదారుల, ఉద్యోగ వ్యతిరేక బిల్లుగా పేర్కొంటున్న విద్యుత్ (సవరణ) బిల్లు 2025కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనగళం వినిపించడం మొదలైనది. విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్లు, రైతులు, వినియోగదారులు దీనిని వ్యతిరేకించడానికి ఒకే దగ్గరకు రావడం ప్రారంభించారు. ఈ నెల 3న ముంబైలో జరిగిన విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్ల జాతీయ సమన్వయ కమిటీ (ఎన్‌సీసీఓఈఈఈ) సమావేశంలో భారత ప్రభుత్వం తమ గొంతు వినకపోతే, దేశవ్యాప్తంగా 27 లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్లు విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు ఉద్దేశించిన ఈ విద్యుత్ (సవరణ) బిల్లు 2025కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యుత్ ఉద్యోగులు, సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత కార్మిక సంఘాలు, సాధారణ వినియోగదారుల నాయకులతో ఐక్య ఫ్రంట్ ఏర్పాటు అవుతుందని విద్యుత్ (సవరణ) బిల్లు 2025కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధం చేసిన వ్యూహం పేర్కొంది.

ప్రైవేటీకరణ, విద్యుత్ (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యోగులు, ఇంజినీర్లను సమీకరించడానికి నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో అన్ని రాష్ట్రాలలో ఎన్‌సీసీఓఈఈఈ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉమ్మడి సమావేశాలు నిర్వహిస్తారు. 2026 జనవరి 30న 'చలో దిల్లీ'కి పిలుపు ఇస్తారు.జాతీయ కమిటీ నిర్ణయాలకు కట్టుబడి ఆల్ హర్యానా పవర్ కార్పొరేషన్స్ వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో నవంబర్ 5 న రోహ్‌తక్‌లో విద్యుత్ (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించింది. విద్యుత్ కార్పొరేషన్ యాజమాన్యం ఉద్యోగుల డిమాండ్లను విస్మరించి ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తోందని పేర్కొంటూ నవంబర్ 26న పంచ్‌కుల ప్రధాన కార్యాలయం ఏసీఎస్ పవర్ వద్ద నిరసన తెలియజేస్తామని ప్రకటించింది. విద్యుత్ బిల్లును ఎన్‌సీసీఓఈఈఈ ఎందుకు వ్యతిరేకిస్తోంది? ఈ బిల్లు ప్రస్తుత పరిస్థితిని ఎలా ప్రభావితం చేస్తుంది? అనే ప్రశ్నలు ఇప్పుడు తలెత్తాయి. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం దేశంలోని మొత్తం ఇంధన రంగాన్ని ప్రైవేటీకరించాలని కోరుకుంటోందని ఎన్‌సీసీఓఈఈఈ నాయకులు ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని కన్వీనర్ సుదీప్ దత్తా ఈ నెల 4వ తేదీన విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ (సవరణ) బిల్లు 2025 దుష్ప్రభావాలను ఆ ప్రకటనలో వివరించారు, ప్రైవేటీకరణ తర్వాత, విద్యుత్ ధరలు భారీగా పెరిగి రైతులకు, సాధారణ వినియోగదారులకు అందుబాటులో ఉండవు. ఎన్‌సీసీఓఈఈఈ నాయకులు శైలేంద్ర దూబే, మోహన్ శర్మ, కన్వీనర్ సుదీప్ దత్తా, కృష్ణ భోయార్, రత్నాకర్ రావు, సంజయ్ ఠాకూర్, లక్ష్మణ్ రాథోడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిల్లు ఎలా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందో వివరించారు. సవరణ బిల్లులోని సెక్షన్లు 14, 42, 43 ద్వారా విద్యుత్ సరఫరా చేయడానికి ప్రైవేట్ కంపెనీలకు ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థల నెట్‌వర్క్‌ను ఉపయోగించుకునే హక్కు ఇస్తున్నాయి. ప్రతిగా, వారు ప్రభుత్వ డిస్కామ్‌లకు నామమాత్రపు సీలింగ్ ఛార్జీలను మాత్రమే చెల్లిస్తారు. ఇది ప్రభుత్వ రంగంలో విద్యుత్ పంపిణీ ముగింపునకు నాంది పలుకుతుంది అని ఎన్‌సీసీఓఈఈఈ ఆందోళన వ్యక్తంచేస్తోంది. ఈ నెట్‌వర్క్ నిర్వహణ, బలోపేతం పూర్తి బాధ్యత ప్రభుత్వ పంపిణీ సంస్థలదేనని కమిటీ వివరించింది. దీని ఆర్థిక భారం ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థలపైనే పడుతుంది. అయితే ప్రైవేట్ కంపెనీలకు ఈ నెట్‌వర్క్ ద్వారా డబ్బు సంపాదించే స్వేచ్ఛ ఇస్తారు. ఈ సవరణ బిల్లు ప్రకారం, ప్రైవేట్ కంపెనీలకు నిరంతర విద్యుత్ సరఫరా బాధ్యత ఉండదు. దీని ప్రతికూల పరిణామం ఏమిటంటే, ప్రైవేట్ కంపెనీలు లాభదాయకమైన పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేయడానికి ప్రభుత్వ కంపెనీ నెట్‌వర్క్‌ను ఉపయోగిస్తాయి. అయితే రైతులకు,పేద గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసే బాధ్యత ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థలదే. ఫలితంగా, ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థలు దివాళా తీస్తాయి. వాటి వద్ద విద్యుత్ కొనుగోలు చేయడానికి లేదా వారి ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి కూడా డబ్బు ఉండదు.

రాబోయే ఐదు సంవత్సరాలలో క్రాస్ సబ్సిడీని తొలగించడానికి సవరణ బిల్లు సెక్షన్ 61(జీ)ని సవరించాలని ప్రతిపాదిస్తున్నట్లు ఎన్‌సీసీఓఈఈఈ పేర్కొంది. దీనితో పాటు, విద్యుత్ ఛార్జీలు ఖర్చును ప్రతిబింబించేలా ఉండాలని బిల్లు ప్రతిపాదిస్తోంది. అంటే ఏ వినియోగదారునికి ఖర్చు కంటే తక్కువ ధరకు విద్యుత్ సరఫరా చేయకూడదు. అనగా, వ్యవసాయానికి 6.5 హార్స్‌పవర్ పంపు రోజుకు ఆరు గంటలు పనిచేస్తే రైతుకు నెలకు రూ.12,000 విద్యుత్ బిల్లు వస్తుంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వినియోగదారులకు విద్యుత్ ఛార్జి యూనిట్‌కు కనీసం రూ. 10 పెరుగుతుంది. ఇంకా, వర్చువల్ పవర్ మార్కెట్లు, మార్కెట్ ఆధారిత వాణిజ్య వ్యవస్థలను ప్రోత్సహించాలని బిల్లు ప్రతిపాదిస్తోంది. ఇది దీర్ఘకాలిక ఒప్పందాలను అస్థిరపరుస్తుంది, విద్యుత్ ఖర్చును మరింత అస్థిరంగా మారుస్తుంది. ఈ బిల్లు దేశ సమాఖ్య నిర్మాణానికి విరుద్ధమా? ప్రస్తుతం విద్యుత్తు రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లో ఉమ్మడి జాబితాలో ఉందని, అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విద్యుత్ విషయాలలో సమాన హక్కులు ఉన్నాయని ఎన్‌సీసీఓఈఈఈ హెచ్చరిస్తోంది. కానీ ఈ సవరణ బిల్లు ద్వారా, కేంద్ర ప్రభుత్వం విద్యుత్ విషయాలలో రాష్ట్రాల హక్కులను లాక్కుంటోంది. విద్యుత్ పంపిణీ, టారిఫ్ నిర్ణయంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్ష జోక్యం చేసుకుంటోంది. ఇది సమాఖ్య నిర్మాణం, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.

ఈ విద్యుత్ బిల్లును వ్యతిరేకిస్తూ రైతు సంఘాలు కూడా రంగంలోకి దిగాయి. హర్యానాలోని రోహతక్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు ఇంద్రజిత్ సింగ్ మాట్లాడుతూ విద్యుత్‌ను ప్రైవేటీకరించేందుకు తీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లును, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తారని ప్రకటించారు. భారతీయ కిసాన్ యూనియన్ ఏక్తా దకౌండ, పంజాబ్ కూడా విద్యుత్ బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళనకు మద్దతు ఇవ్వడానికి ముందుకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తూ విద్యుత్ సవరణ బిల్లు తీసుకువస్తోందని, ఇది విద్యుత్ పంపిణీ రంగంలో ప్రైవేటీకరణను అమలు చేయడానికి ఒక కుట్ర అని కిసాన్ యూనియన్ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించినట్లు రాష్ట్ర ప్రెస్ సెక్రటరీ అంగ్రేజ్ సింగ్ భదౌర్ ఐపీఏ ప్రతినిధికి తెలిపారు. కాబట్టి విద్యుత్ సవరణ బిల్లు 2025ను పూర్తి శక్తితో వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు.

సంయుక్త కిసాన్ మోర్చా నవంబర్ 26న చండీగఢ్ వైపు కవాతు చేయనుందని, ఈ ప్రదర్శన కోసం నిర్దిష్ట ప్రణాళికలను రూపొందించడానికి నవంబర్ 17న చండీగఢ్‌లోని కిసాన్ భవన్‌లో సమావేశం నిర్వహిస్తామని భదౌర్ తెలిపారు. ఆ మార్చ్ ప్రధాన డిమాండ్లలో విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలనే డిమాండ్ ఉంటుంది. ఇటువంటి సున్నితమైన అంశాలపై నిర్ణయం తీసుకునే సమయంలో ప్రభుత్వం మొండిగా, కఠినంగా వ్యవహరించకూడదు. మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలల పాటు రైతులు చేసిన ఆందోళనలో 700 మందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోయారని, చివరికి కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాలను రద్దు చేయాల్సి వచ్చిందని ఎల్లవేళలా గుర్తుంచుకోవాలి.

ఆత్మ నిర్భర భారత్‌కు సాధకాలుగా సహకారం

నీలం నాగేశ్వరరావు

భారతదేశం అంటేనే గ్రామాల సముదాయం. కాబట్టి గ్రామీణాభివృద్ధి సహకార సంఘాల ద్వారా సాధించగలమనే దృఢమైన నమ్మకం, ఉద్యమంపై పూర్తి విశ్వాసం గల భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ప్రధాని పదవిలో ఉన్నంతకాలం అన్ని పంచవర్ష ప్రణాళికల్లోనూ సహకార సంఘాల ద్వారా గ్రామీణాభివృద్ధి జరిగేందుకు ఎంతగానో ప్రాముఖ్యత ఇచ్చారు. భారతదేశ వార్షిక బడ్జెట్లో వ్యవసాయ రంగానికి 51% ఇచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఈ విధంగా సహకార రంగానికి ఇచ్చిన ప్రోత్సాహానికి గుర్తింపుగా నవంబర్ 14 నుంచి 20 వరకు ఈ వారోత్సవాలు భారతదేశ వ్యాప్తంగా 71 సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నారు. జాతీయ సహకార యూనియన్ (ఎన్సీయూఐ) ప్రతి సంవత్సరం ఈ వారం రోజుల కార్యక్రమాన్ని అన్ని రాష్ట్రాలలో ఏ రకంగా జరుపుకోవాలనేది నిర్ణయిస్తూ రాష్ట్ర సహకార యూనియన్ల ద్వారా అన్ని సహకార సంఘాలకు తెలియపరుస్తుంది. దీనితో పాటు ప్రతి సంవత్సరం ఒక సహకార నినాదాన్ని కూడా రూపొందిస్తుంది. 72వ అఖిలభారత సహకార వారోత్సవాల సందర్భంగా ఈ సంవత్సరం "ఆత్మనిర్భర భారత్ సాధకాలుగా సహకారం" అనే నినాదంతో జరుగుతున్నాయి.

సహకారరంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటు:

కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటై జులై ఆరుకు నాలుగేళ్లు పూర్తయ్యాయి. గతంలో కేంద్ర ఆర్థిక శాఖ సవతి తల్లి ప్రేమ చూపుతో పాటు అనేక విధానపరమైన పాలనాపరమైన సమస్యల వల్ల దేశంలో సహకారంతో కూనారిల్లుతోందని ఈ స్థితికి సంబంధిత ప్రభుత్వం, సంస్థలన్నీ కారణభూతం కాగా భారతీయ సహకారరంగ పునర్జీవనం తద్వారా దేశ వ్యవసాయరంగ అభ్యున్నతికి అంతర్వేదంగా ఆధారపడాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రిత్వ శాఖ ఏర్పాటు ముఖ్యోద్దేశం. భారతీయ సహకార రంగం, వ్యవసాయ రంగంపురోభివృద్ధి పరస్పరాధారితంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇవి రెండూ వేర్వేరు కాదని అంటూ సహకార, వ్యవసాయ రంగాలను ఏకకాలంలో పునరుజ్జీవింప జేయడానికి ప్రభుత్వం అనేక చర్యలతో పాటు తొలుత జాతీయ సహకార విధానాన్ని రూపొందించి అమల్లోకి తీసుకురావాలన్న దృక్పథంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటు అయినప్పటికీ కూడా ఆ దిశలో పూర్తిస్థాయిలో పనిచేయటం లేదు. దేశవ్యాప్తంగా

సహకార వ్యవస్థలో కొంతవరకు అవినీతిని నిర్మూలించడానికి డిజిటలైజేషన్ ఆడిట్ విధానాన్ని ప్రవేశపెట్టి సహకార వ్యవస్థలో జవాబు దారితనం , పారదర్శకత పెంపొందించి కేంద్ర మంత్రిత్వ శాఖ సఫలీకృతం అయిందనటంలో సందేహం లేదు. మన దేశంలో 16 రకాల సహకార సంఘాలు అస్తిత్వంలో ఉన్నాయి. భారతీయ రిజర్వు బ్యాంకు నాబార్డు పర్యవేక్షణలో దేశవ్యాప్తంగా విస్తరించిన సహకార రంగంలో ఈ ఏడాది మార్చి 31 నాటికి స్వల్పకాలిక రుణాలు ఇచ్చే స్టేట్ కోపరేటివ్ బ్యాంకులు 34 (శాఖలు 2001) జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు 351 (శాఖలు 13,992) ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘా (పీఏసీఎస్)లు



1,02,559 ఉన్నాయి. వీటితోపాటు దీర్ఘకాలిక సహకార రుణాలు ఇచ్చే ఎస్‌సీఏఆర్డీ బ్యాంకులు 13 (శాఖలు 624), పీసీఏఆర్‌డీ బ్యాంకులు 578 (శాఖలు 393) ఉన్నాయి. మొత్తంగా కోఆపరేటివ్ అవుట్లెట్లు 1,20,543 దేశ ప్రగతి కొరకు పనిచేస్తున్నాయి.

ఇదిలా ఉండగా, వాణిజ్య బ్యాంకులు 91 (శాఖలు: మెట్రోపాలిటన్ 31,325, అర్బన్ 30,641, సెమీ అర్బన్ 43,632, గ్రామీణ శాఖలు 52,745), రీజినల్ రూరల్ బ్యాంకులు 45 (శాఖలు: మెట్రోపాలిటన్ 192, అర్బన్ 1,087, సెమీ అర్బన్ 3,381, గ్రామీణ శాఖలు 12,904) ఉన్నాయి. మొత్తంగా జాతీయ బ్యాంకులు, ప్రైవేటు బ్యాంకులు, విదేశీ బ్యాంకులు, రీజినల్ రూరల్ బ్యాంకులన్నీ

ప్రభుత్వం అనేక చర్యలతో పాటు తొలుత జాతీయ సహకార విధానాన్ని రూపొందించి అమల్లోకి తీసుకురావాలన్న దృక్పథంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటు అయినప్పటికీ కూడా ఆ దిశలో పూర్తిస్థాయిలో పనిచేయటం లేదు. దేశవ్యాప్తంగా సహకార వ్యవస్థలో కొంతవరకు అవినీతిని నిర్మూలించడానికి డిజిటలైజేషన్ ఆడిట్ విధానాన్ని ప్రవేశపెట్టి సహకార వ్యవస్థలో జవాబు దారితనం , పారదర్శకత పెంపొందించి కేంద్ర మంత్రిత్వ శాఖ సఫలీకృతం అయిందనటంలో సందేహం లేదు.

కలిపి 1,76,043 అవుట్లెట్లు ఉన్నాయి.

అచంచలమైన గ్రామీణ వ్యవస్థ భారత దేశంలో ఉన్నప్పటికీ కూడా ఒక్క సహకార రంగం మాత్రమే 98% గ్రామాలకు విస్తరించింది. ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రతి పదిమందిలో ఎనిమిది మంది సహకార రంగం ద్వారా లబ్ధిపొందుతున్నారు. సహకార సంఘాలు, సహకార బ్యాంకులు 38.40% వ్యవసాయ రుణాలను అందిస్తున్నాయి, 32 కోట్లకు పైగా సహకారులు లబ్ధి పొందుతున్నారు. దేశానికి వెన్నెముక రైతు. రైతుకు వెన్నెముక సహకార వ్యవస్థ. 121 సంవత్సరాలు చరిత్ర కలిగిన సహకార వ్యవస్థపై నాబార్డు (జాతీయ గ్రామీణ వ్యవసాయ అభివృద్ధి బ్యాంక్) కృత్రిమ మేధా యుగంలో తన నిర్వచనాన్ని మార్చుకుంటుంది.

1982, జులై 12, నాబార్డ్ ఏర్పడక ముందు రిజర్వ్ బ్యాంకు రాష్ట్ర సహకార పరపతి సంస్థల మధ్య సంబంధాలు రైతు శ్రేయస్సుని దృష్టిలో పెట్టుకుని సహకారరంగ అభివృద్ధికి పనిచేశాయి. 1994 అక్టోబర్‌లో అడ్మినిస్టర్డ్ వడ్డీ రేట్ల స్వరూపం మారింది. ఆ అధికారాలను నాబార్డుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అప్పగించడంతో తన బాధ్యతల నిర్వహణలో సహకారం పట్ల, వ్యవసాయ రంగం పట్లవివక్షత గురిచేసి విఫలమైందేనే విమర్శలు సహకార మేధావుల నుంచి బహిరంగంగానే వెల్లువెత్తాయి. నాబార్డ్ ఈ బాధ్యతల నిర్వహణలో 2022 మార్చి 31 నాటికి రూ.757,472 కోట్ల వనరుల కలిగిన నాబార్డ్ రూ.61019 కోట్ల మూలధనంతో రూ.5081 కోట్ల నికర లాభం ఆర్జించింది. సహకార రంగాన్ని బలపరచడం పోయి లాభార్జనతో పనిచేయటం వల్ల ఇదంతా జరిగిందని చెప్పకనే చెప్పవచ్చు. నాబార్డు వ్యాపార దృక్పథం పెరిగి వ్యవసాయ రంగానికి సహకారంగానికి తన చేయూతను విస్మరించి కేంద్ర ఆర్థిక శాఖ వడ్డీరేట్ల ప్రకటన దగ్గర్నుంచి సహకార సంఘాల పట్ల ప్రతికూల దృష్టితో వ్యవహరిస్తోంది. ఈ విధానం విడనాడే విధంగా కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కృషి చేయాలి. అప్పుడే ఆత్మనిర్భర భారత్ సాధకాలుగా సహకార సంఘాలు అనే పదానికి సరైన నిర్వచనం ఏర్పడుతుంది.

- సహకార రంగ నిపుణులు

ప్రజా తీర్పును గౌరవిస్తాం: సిద్ధరామయ్య

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవిస్తామని కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ జయంతిని పురస్కరించుకుని ఆయనకు నివాళులు అర్పించిన తిరిగివెళు న్న ఆయనను మీడియా పలకరించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళిని గుర్తుచేసింది. దీంతో ప్రజా తీర్పును తాము గౌరవిస్తామని ఆయన చెప్పారు. అనంతరం నెహ్రూ గురించి మాట్లాడుతూ... దేశం కోసం ఆయన ఎన్నో త్యాగాలు చేశారని అన్నారు. నెహ్రూ పంచవర్ష ప్రణాళికలను రూపొందించి దేశాభివృద్ధి కోసం కృషిచేశారని సిద్దరామయ్య చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడంలోనూ నెహ్రూ చేసిన కృషిని మరువలేమని అన్నారు.

ఓటమికి ఆత్మ పరిశీలన ముఖ్యం

కాంగ్రెస్ సీనియర్ నేత థరూర్

తిరువనంతపురం : కాంగ్రెస్ తన ఓటమికి గల కారణాలను ఆత్మ పరిశీలన చేసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు. బీహార్ వంటి రాష్ట్రంలో పార్టీ పనితీరు మొత్తం పనితీరును పరిశీలించడం చాలా ముఖ్యమని, ఎన్నికలు అనేక అంశాలకు సంబంధించినవని తెలిపారు. 'వారు (ఎన్డీయే కూటమి) భారీ వ్యత్యాసంతో ఆధిక్యంలో ఉన్నారు. ఫలితాలు వచ్చేవరకు వేచిచూద్దాం. కారణాలు వివరంగా అధ్యయనం చేయాల్సిన బాధ్యత పార్టీపై ఉంది. అయితే విపక్ష కూటమిలో మేం సీనియర్ భాగస్వామి కాదు. ఆర్జేడీ కూడా తన ప్రదర్శనను పరిశీలించుకోవాలి. ఇలాంటి విషయాల్లో మొత్తం కూటమి పనితీరుని పరిశీలించడం చాలా ముఖ్యం. బీహార్ ఫలితాలు తీవ్రంగా నిరాశ పరిచాయి. తప్పు ఎక్కడ జరిగిందో అధ్యయనం చేయాలి. బీహార్‌లో ఎన్నికల ప్రచారానికి నన్ను ఆహ్వానించలేదు' అని శశిథరూర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రకటనకు ముందే రాష్ట్రంలోని మహిళలకు కొన్ని ప్రోత్సాహకాలు అందాయని ఆయన ఆరోపించారు. ఇలాంటివి గతంలో మహారాష్ట్రతో సహా అనేక ప్రాంతాల్లో జరిగాయని అన్నారు.

ఇది మోదీ-నితీశ్ విజయం

ఎన్డీయే పనితీరును ప్రశంసించిన బీజేపీ

న్యూఢిల్లీ: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ పని తీరును బీజేపీ శుక్రవారం 'చారిత్రకమని' ప్రశంసించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'అభివృద్ధి-కేంద్రీకృత' రాజకీయాలపై ప్రజలు మరోసారి తమ నమ్మకాన్ని వ్యక్తం చేశారని పేర్కొంది. బీజేపీ సీనియర్ నాయకుడు రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ కులం, సమాజానికి అతీతంగా అభివృద్ధి, సుపరిపాలన కోసం ప్రజలు ఓటు వేశారని అన్నారు. కేంద్ర మాజీ మంత్రి ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ బీహార్ ప్రజలు ఆర్జేడీ పాలనలో 'లాలూ ప్రసాద్ జంగిల్ రాజ్' ను, ఎన్డీఏ పదవీ కాలంలో రాష్ట్రంలో జరిగిన మార్పును చూశారని ప్రసాద్ అన్నారు. ప్రజలు మోదీజీ, బీజేపీ, ఎన్డీఏపై విశ్వాసం చూపించారు. మన బీహార్ నేడు అభివృద్ధిలో కొత్త మార్గంలో పయనించడానికి సిద్ధంగా ఉందని నేను గర్విస్తున్నాను' అని తెలిపారు. బీజేపీ జాతీయ ప్రతినిధి గౌరవ్ భాటియా మాట్లాడుతూ రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రతిపక్ష పార్టీ తన వారసత్వాన్ని కోల్పోవడమే కాకుండా ఆయన నాయకత్వంలో విశ్వసనీయతను కూడా కోల్పోయిందని అన్నారు.

కొత్త వ్యూహాలు అవసరం: డీకే



బెంగళూరు: బీహార్ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ, ఇండియా ఐక్య సంఘటన కోసం కొత్త వ్యూహాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శుక్రవారం అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ కర్నాటక అధ్యక్షుడు కూడా అయిన శివకుమార్ ఈ ఫలితాలను తన పార్టీకి, దాని మిత్రపక్షాలకు 'పాఠం' గా అభివర్ణించారు. 'ప్రజలు ఈ ఆదేశాన్ని ఇచ్చారు. ఇది మాకు ఒక పాఠం. భవిష్యత్‌లో మేము కాంగ్రెస్ పార్టీకి, ఇండియా ఐక్య సంఘటనకు కొత్త వ్యూహాన్ని రూపొందిస్తాము' అని శివకుమార్ పీటీఐతో వీడియోలో మాట్లాడుతూ అన్నారు.

తమిళనాట మెగా కూటమి తప్పదు: ప్రేమలత

చెన్నై: వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మెగా కూటమి ఏర్పాటు చేస్తానని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ప్రకటించారు. కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా నేతల సమావేశంలో ఆమె ప్రసంగించారు. అన్ని పార్టీలకంటే ముందుగా తమ పార్టీ ప్రచార కార్యక్రమాలను ప్రారంభించిందని, తన పర్యటనకు లక్షలాదిమంది ప్రజలు హాజరువుతుండటంతో ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామనే నమ్మకం కలుగుతోందన్నారు. రాష్ట్రంలో డీఎంకే, అన్నాడీఎంకే పార్టీల తర్వాత బలమైన మూడో పార్టీగా డీఎండీకే ఉందని, ఏయే పార్టీలను కలుపుకుని కూటమి ఏర్పాటు చేయాలనే విషయంపై త్వరలో నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. 84 మంది జిల్లా శాఖ కార్యదర్శులకుగాను 74 మంది హాజరయ్యారు. డీఎండీకే ప్రిసీడియం చైర్మన్ డాక్టర్ ఇలంగోవన్, కోశాధికారి ఎల్కే సుదీష్, ప్రధాన కార్యాలయం కార్యదర్శి పార్థసారథి పాల్గొన్నారు.

ఆర్జేడీని ముంచిన కుటుంబ కలహాలు!

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధించింది. ప్రతిపక్ష మహాగట్బంధన్ అనూహ్య ఓటమి చవిచూసింది. ప్రతిపక్ష కూటమి అధికారానికి దూరం కావడానికి అనేక కారణాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి బీహార్ ఎన్నికల్లో తేజస్వీ యాదవ్ పార్టీ ఆర్జేడీ ఓటమికి ప్రధాన కారణాల్లో కుటుంబ కలహాలు కీలకమైనవిగా విశ్లేషకులు చెబుతున్నారు. ఎన్నికలకు ముందు అన్నాదమ్ములు తేజస్వీ యాదవ్, తేజ్ ప్రతాప్ యాదవ్ మధ్య పెద్ద యుద్ధమే జరిగిందంటున్నారు. ఇది ఎన్నికల ఫలితాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపిందని అంచనా వేస్తున్నారు. బీహార్‌లో ఆర్జేడీ పార్టీలాగానే ఒకప్పుడు ఉత్తరప్రదేశ్‌లో అఖిలేశ్ యాదవ్ పార్టీ సమాజ్‌వాదీది ఇలాగే ఉండేది. కానీ ఆయన తర్వాత కాలంలో బలంగా తిరిగి పుంజుకున్నారు. కానీ 2017లో సమాజ్ వాదీ పార్టీ అధికారాన్ని కోల్పోవడానికి కుటుంబ కలహాలు ప్రధాన కారణంగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అనంతర కాలంలో పార్టీలో శివపాల్ సింగ్ యాదవ్‌ను పక్కనపెట్టి అఖిలేశ్ సమాజ్ వాదీ పార్టీపై తిరిగి పట్టు సాధించారు. కానీ అధికారం కోల్పోయారు. అనంతర కాలంలో రాష్ట్రంలో అఖిలేశ్ యాదవ్ రాజకీయంగా త్వరగా కోలుకున్నారు. అఖిలేశ్ పరిస్థితి లాగానే బీహార్‌లో తేజస్వి పరిస్థితి మారింది. కానీ ఉత్తరప్రదేశ్‌లో అఖిలేశ్ కోలుకున్నంత త్వరగా బీహార్‌లో తేజస్వి కోలుకోలేకపోయారు.

లాలు కంచుకోటకు బీటలు

మహువా నుంచి పోటీలో ఉన్న తేజ్ ప్రతాప్ యాదవ్ తన స్థానంపై ఎలాంటి ఆశలు పెట్టుకుని ఉండకపోవచ్చు, కానీ లాలూ-రాబ్డీదేవి బలమైన కోట రాఘోపూర్‌లో తేజస్వి అతికష్టం మీద విజయం సాధించారు. ఇది లాలూ యాదవ్ కుటుంబానికి పెద్ద ఇబ్బందిగా మారింది. దానాపూర్‌లో రిత్లాల్ యాదవ్ ఓటమి ముఖ్యం కాకపోవచ్చు... కానీ అది కచ్చితంగా లాలూ యాదవ్ జనాకర్షణ గురించి ప్రశ్నలు లేవనెత్తుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. లాలూ యాదవ్ ఒకే ఒక రోడ్ షో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో తేజ్ ప్రతాప్ యాదవ్ కోల్పోయేది ఏమీ లేదని, ఎందుకంటే ఆయనకు తన కుటుంబం నుంచి ఎలాంటి మద్దతు లేదని, తండ్రి వారసత్వం, పార్టీ చిహ్నం లాంటివి ఏవీ లేవని చెబుతున్నారు. కానీ ఈ ఎన్నికల్లో తేజస్వి భారీ కుదుపునకు లోనయ్యాడని వెల్లడించారు.

ప్రజల తిరస్కరణకు లాలూ యాదవ్ కుటుంబం ఒక కారణంగా పేర్కొంటున్నారు. తన వ్యక్తిగత ఫొటోలు ఎలా, ఎందుకు లీక్ అయ్యాయో తేజ్ ప్రతాప్ యాదవ్ స్వయంగా వివరించారు. తన అకౌంట్ హ్యాక్ అయి ఫొటోలు లీక్ అయ్యాయని ఆయన పేర్కొన్నారు. అయితే ఆ ఫొటోలు నకిలీవని ఆయన ఎప్పుడూ చెప్పలేదు. తేజ్ ప్రతాప్ అప్పుడు అలాంటి ప్రకటన జారీ చేసి ఉంటే, మరిన్ని ఇబ్బందులను నివారించగలిగేవాడని విశ్లేషకులు చెబుతున్నారు. లాలూ యాదవ్ వెంటనే చర్య తీసుకుని తేజ్ ప్రతాప్ యాదవ్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. తేజ్ ప్రతాప్‌ను తన రాజకీయ వారసత్వం నుంచే బహిష్కరించారు. ఈ ఘటన తర్వాత ఆయనను ఆర్జేడీ పార్టీ, తన కుటుంబం నుంచి కూడా బహిష్కరించారు. తేజస్వి ఇప్పటికే పార్టీలో నాయకుడిగా ఉన్నారు. ఈ సంఘటనలన్నీ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గణనీయమైన ప్రభావాన్ని చూపించాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి ఈ ఎన్నికల్లో సోదరులిద్దరూ బద్ధ శత్రువులుగా కనిపించారు. ఇది ఎన్నికలపై గణనీయమైన ప్రభావం చూపించిందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఎన్డీయేకు కలిసొచ్చిన లాలూ ఇంటి గొడవ

వాస్తవానికి ఈ ఎన్నికల్లో ఎన్డీయే లాలూ కుటుంబ గొడవను సద్వినియోగం చేసుకుందనే కథనాలు వస్తున్నాయి. ఇదే సమయంలో ఎన్నికల చివరి దశలో తేజ్ ప్రతాప్ యాదవ్ ఆర్జేడీ వైపు మొగ్గు చూపుతున్నారని పుకార్లు వచ్చాయి. అలాగే ఆయన కొన్ని షరతులతో తాను ఎవరికైనా మద్దతు ఇస్తానని ప్రకటించడం ఈ పుకార్లకు మరింత బలం చేకూర్చాయి. ఇదే సమయంలో తేజ్ ప్రతాప్ యాదవ్‌కు వై కేటగిరీ భద్రత కూడా అందించారు. ఈ అన్ని పరిణామాలకు కారణం తేజస్వి, లాలూ యాదవ్ కలిసి చేసిన రాజకీయ తప్పిదమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తాజా ఎన్నికల ఫలితం కేవలం కుటుంబ కలహాల ఫలితమా అనే చర్చలు జరుగుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

ఎన్డీయేలో సంబరం... ఆర్‌జేడీలో నైరాశ్యం

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల విడుదల తర్వాత శుక్రవారం రాష్ట్ర రాజధాని పట్నా నగర రాజకీయ ధమని అయిన వీర్‌చంద్ పటేల్ మార్గ్ రెండు విభిన్న ప్రపంచాలుగా విడిపోయింది. ఒక వైపు బీజేపీ, జేడీ(యూ) కార్యాలయాలు భారీ గెలుపుతో డ్రమ్స్, బాణసంచా, తాజా లడ్డూల వాసనతో సంబరాల్లో మునిగిపోయాయి. మరో వైపు, ఆర్‌జేడీ ప్రధాన కార్యాలయం ఆవరణలో ఆ పార్టీ శ్రేణులన్నీ నైరాశ్యంలో కూరుకుపోయాయి. ఎన్డీఏ ఘన విజయంతో బీజేపీ ప్రధాన కార్యాలయంలో సంబరాలు మిన్నంటాయి. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరాగా... పార్టీ కార్యాలయం ప్రాంగణం బాణసంచా మోతలతో ఆనందోత్సాహాల్లో మునిగితేలారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మాస్కులు ధరించిన కార్యకర్తలు... కార్యాలయం వరండా పైన అమర్చిన పెద్ద ఎల్ఈడీ స్క్రీన్‌లపై తమ కూటమి ఆధిక్యం పెరుగుతుండటాన్ని వీక్షిస్తూ కేరింతలు కొట్టారు. 'మోదీ కా పరివార్!' వారు ప్రధాని చిన్న ప్లకార్డులను ఊపుతూ నినదించారు. సమీపంలో కాషాయ చీరలు ధరించిన మహిళా కార్యకర్తలు కండువాలు ధరించి 'నరేంద్ర మోదీ జిందాబాద్!, 'నితీశ్ కుమార్ జిందాబాద్!' అని నినాదాలు చేస్తూ డ్రమ్స్ మోగించారు. 'ఏకపక్ష ఆధిక్యంతో ఎన్డీఏ అజేయంగా కనిపిస్తోంది! ప్రజలు అబద్ధాలు, దోపిడీ, భ్రాంతి రాజకీయాలను తిరస్కరించారు' అని పూర్నియాకు చెందిన ఒక మహిళా కార్యకర్త అన్నారు. ఇక కార్యాలయం లోపల కూర్చున్న సీనియర్ నాయకులు తమ ఆనందాన్ని పార్టీ శ్రేణులతో పంచుకున్నారు. '2005 నుంచి నేటి వరకు వాస్తవానికి ఎవరు పరిపాలిస్తున్నారో, ఎవరు దానిని విమర్శిస్తున్నారో ప్రజలకు తెలుసు' అని నలందకు చెందిన రమేష్ యాదవ్ ఒక వార్తా ఛానెల్‌తో మాట్లాడుతూ అన్నాడు. జేడీ(యూ) నాయకుడు నితీశ్ తొలి విజయం సాధించినప్పటి నుంచి ప్రతి విజయోత్సవ వేడుకకు తాను హాజరయ్యానని చెప్పాడు. జేడీ(యూ) చిహ్నామైన ఒక పెద్ద ఆకుపచ్చ థర్మోకోల్ బాణంతో ఒక యువ బృందం 'తీర్ చలేగా, బీహార్ బడేగా' అని నినాదాలు చేస్తూ ముందుకు సాగింది. ఇక ఆర్‌జేడీ కార్యాలయం గేటు వెలుపల, మహిళల బృందం ఆర్‌జేడీ నాయకుడి కీలక వాగ్దానాలలో ఒకటైన 'మై బహన్ యోజన'ను ప్రస్తావిస్తూ స్వయంగా రాసిన పాటలు పాడింది. అయితే వారిలో ఒకరు నిరాశ వ్యక్తం చేస్తూ... 'విజయం, ఓటమి ఒకే నాణేనికి రెండు వైపులా ఉంటాయి. కొన్నిసార్లు విద్యార్థులు బాగా సిద్ధమవుతారు. కానీ పరీక్షను చెడుగా రాస్తారు' అని వ్యాఖ్యానించారు.

ఇక బెంగాల్ వంతు: కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్

న్యూఢిల్లీ: బీహార్ శాసనసభ ఎన్నికల్లో ఎన్డీయే విజయంపై కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ హర్షం ప్రకటించారు. తమ కూటమి బీహార్‌లో విజయం సాధించిందని, తర్వాత బెంగాల్‌లోనూ అధికారం చేపడతామని వ్యాఖ్యానించారు. బీహార్‌లోని బెగుసరాయ్ లోక్‌సభ నియోజకవర్గానికి గిరిరాజ్ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. శుక్రవారం ఆయన ఓ మీడియాతో మాట్లాడుతూ ఇక బెంగాల్‌నూ చేజిక్కించుకుంటామని చెప్పారు. 'బీహార్‌ను అర్థం చేసుకున్న వారికి తెలుసు... రాష్ట్ర ప్రజలు అరాచకాన్ని కోరుకోరని. ఇక్కడి ప్రజలు అవినీతి పరులైన నాయకులకు అధికారం అప్పగించాలను కోలేదు. బీజేపీ కార్యకర్తగా చెబుతున్నా... బీహార్‌లో ఎన్డీయే విజయం ఖాయమైంది. ఇక బెంగాల్ వంతు. అక్కడ జరిగే ఎన్నికల్లో కూడా మాదే గెలుపు. ప్రస్తుతం అక్కడ ఉన్నది అరాచక ప్రభుత్వం' అని గిరిరాజ్ విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ఎన్నికల ఫలితాలు చూస్తే అక్కడి ప్రజలు అన్యాయాన్ని వద్దనుకుంటున్నారన్నారు. ఎన్డీయే అభివృద్ధి అజెండాకు పట్టం కట్టాలనే ఓటర్లు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోందన్నారు.

ప్రముఖ బాలీవుడ్ నటి కన్నుమూత

ముంబై: ప్రముఖ బాలీవుడ్ నటి కామిని కౌశల్ (98) కన్నుమూశారు. దీంతో బాలీవుడ్‌లో ఒక శకం ముగిసింది అంటూ బాలీవుడ్ పెద్దలు సంతాపం వెలిబుచ్చారు. బాలీవుడ్ స్వర్ణయుగం నాటి మిగిలిన చివరితారల్లో కామిని కౌశల్ ఒకరంటూ గుర్తు చేసుకున్నారు. ఈ కష్టసమయంలో తమ గోప్యతను గౌరవించాలని కామిని కౌశల్ కుటుంబం విజ్ఞప్తి చేసింది. కామిని కౌశల్ 1927, ఫిబ్రవరి 24న జన్మించారు. 1946లో 'నీచా నగర్' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టారు. ఈ మూవీ మొదటి కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ చిత్ర అవార్డును గెలుచుకుంది. పామ్ డి ఓర్‌ను గెలుచుకున్న ఏకైక భారతీయ చిత్రంగా మిగిలిపోయింది. అంతేకాదు ఇదే చిత్రానికి కామిని కౌశల్ మాంట్రియల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డును గెలుచుకున్నారు. చాలా తక్కువ సమయంలోనే మంచి పేరు తెచ్చుకుని, పాపులర్ నటిగా ఎదిగారు. 1946-1963 వరకు అనేక చిత్రాల్లో నటించి తన ప్రతిభను చాటుకున్నారు.

ఎస్ఐఆర్ కుట్ర బహిర్గతం: అఖిలేశ్

లక్నో: ఆర్జేడీ కూటమి ఓటమి, బీజేపీ కూటమి విజయంపై ఇండియా ఐక్యసంఘటనలోని ప్రధాన భాగస్వామి సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ స్పందించారు. పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ గేమ్ పనిచేయదని అన్నారు. 'బీహార్‌లో ఎస్ఐఆర్ ఆడే ఆట ఇకపై పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ లేదా ఇతర చోట్ల సాధ్యం కాదు. ఎందుకంటే ఈ ఎన్నికల కుట్ర ఇప్పుడు బహిర్గతమైంది' అని అఖిలేష్ యాదవ్ ఎక్స్‌లో తెలిపారు. 'మేము వారిని ఈ ఆట ఆడనివ్వము. మేము అప్రమత్తంగా ఉండి బీజేపీ ప్రణాళికల్ని అడ్డుకుంటాము.

బీజేపీ ఒక పార్టీ కాదు, మోసగాడు' అని ఆరోపించారు. బీజేపీ గెలవలేక ఈసీని ఉపయోగించుకుని గందరగోళం సృష్టిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే ఇండియా ఐక్యసంఘటన నేతలు ఈ ఎన్నికల ఫలితాలపై ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు బీహార్‌లో ఎన్నికల సంఘం 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)' నిర్వహించింది. దీంట్లో ఈసీ అనేక ఓట్లను తొలగించిందని, అవన్నీ ప్రతిపక్ష ఓట్లే అని వారు ఆరోపిస్తున్నారు.

ఫ్లిప్‌కార్ట్‌కు కుచ్చు టోపీ

తిరువనంతపురం: ఫ్లిప్‌కార్ట్‌కు నకిలీ కస్టమర్లు కుచ్చుటోపీ పెట్టారు. రూ.1.6 కోట్ల విలువైన 332 మొబైల్ ఫోన్లు చోరీ చేశారు. కేరళలోని ఎర్నాకుళం జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఈ మోసాన్ని గ్రహించిన ఫ్లిప్‌కార్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది ఆగస్టు ఎనిమిదో తేదీ నుంచి అక్టోబరు 10 మధ్య నకిలీ చిరునామాలు, వేర్వేరు మొబైల్ నంబర్ల నుంచి రూ. 1.61 కోట్ల విలువైన 332 మొబైల్ ఫోన్లు ఫ్లిప్‌కార్ట్‌లో నిందితులు ఆర్డర్ చేశారు. ఖరీదైన ఆపిల్ ఐఫోన్, శామ్‌సంగ్ గెలాక్సీ, వివో, ఐక్యూవోవో మోడల్స్ ఇందులో ఉన్నాయి. కాగా, ఎర్నాకుళం జిల్లాలోని కంజూర్, కురుప్పంపడి, మెక్కడ్, మువట్టుపుళలోని ఫ్లిప్‌కార్ట్ డెలివరీ హబ్స్ నుంచి 332 మొబైల్ ఫోన్స్ డెలివరీ అయ్యాయి. కంజూర్ హబ్ నుంచి రూ. 18.14 లక్షల విలువైన 38 ఫోన్లు, కురుప్పంపడి హబ్ నుంచి రూ. 40.97 లక్షల విలువైన 87 ఫోన్లు, మెక్కడ్ హబ్ నుంచి రూ. 48.66 లక్షల విలువైన 101 ఫోన్లు, మువట్టుపుళ హబ్ నుంచి రూ. 53.41 లక్షల విలువైన 106 ఫోన్ ఆర్డర్లు వచ్చాయి. అయితే డెలివరీ కేంద్రాలకు చేరుకున్న తర్వాత ఆ మొబైల్ ఫోన్లు మాయమయ్యాయి. ఫ్లిప్‌కార్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఈ మోసాన్ని గ్రహించారు. రూ.1.61 కోట్ల విలువైన 332 మొబైల్ ఫోన్‌లు మాయమైనట్టు ఎర్నాకుళం రూరల్ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కంజూర్, కురుప్పంపడి, మెక్కడ్, మువట్టుపుళ ఫ్లిప్‌కార్ట్ హబ్‌లకు ఇంచార్జిగా ఉన్న సిద్ధిక్ కే అలియార్, జాస్సిమ్ దిలీప్, హరిస్ పీఏ, మహిన్ నౌషాద్‌లపై పోలీసులు చీటింగ్, ఫోర్జరీ, ఐటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ మోసంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

పట్టు పెంచుకున్న చిరాగ్ పాశ్వాన్

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే భాగస్వామి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్జేపీ (రాంవిలాస్ పాశ్వాన్) మంచి ఫలితాలు సాధించింది. ఈ ఎన్నికల్లో 75 శాతం స్ట్రైక్ రేటు సాధించింది. గత ఎన్నికల్లో ఒకేఒక్క స్థానానికే పరిమితమైన ఆ పార్టీ.. ఇప్పుడు కూటమి విజయంలో కీలక భూమిక పోషించింది. ఒకప్పుడు తండ్రిని, తండ్రి నెలకొల్పిన పార్టీని సైతం కోల్పోయిన చిరాగ్.., వరుస ఎన్నికల్లో సత్తా చాటారు. తండ్రి వారసత్వాన్ని నిలబెట్టారు. 2020 ఎన్నికల్లో నితీశ్ నాయకత్వాన్ని చిరాగ్ పాశ్వాన్ వ్యతిరేకించారు. ఎన్డీయేలోని బీజేపీకి మద్దతిస్తూనే 137 సీట్లకు తమ పార్టీ తరపున అభ్యర్థులను నిలబెట్టారు. ఆ ఎన్నికల్లో కేవలం ఒక్క సీటుకు మాత్రమే పార్టీ పరిమితమైంది. ఆ ఎన్నికల్లో జేడీయూ ఓట్లకు గండి కొట్టడంలో కీలక భూమిక పోషించింది. 2015లో 71 సీట్లు సాధించిన జేడీయూ... ఆ ఎన్నికల్లో కేవలం 43 స్థానాలకే పరిమితమైంది. ఆ తర్వాత బాబాయి పశుపతి కుమార్ పరాస్‌తో చిరాగ్‌కు విభేదాలు నెలకొన్నాయి. ఆ పార్టీ ఎంపీలు ప్లేటు ఫిరాయించడంతో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఎన్నికల సంఘం పార్టీ గుర్తును నిలిపివేసింది. దీంతో 2021లో ఎల్జేపీ (రాం విలాస్) పేరిట కొత్త పార్టీ నెలకొల్పారు. బాబాయి నుంచి గట్టి ఎదురుదెబ్బతిన్న చిరాగ్ పాశ్వాన్ తనను తాను నిరూపించుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు.

'యువ బీహారీ' అంటూ ప్రజలకు చేరువయ్యారు. తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న తనను దళిత నాయకుడిగా మలచుకున్నారు. అదే బీహార్‌లో మళ్లీ ఎన్డీయేతో కలిసి 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన ఐదు స్థానాల్లోనూ విజయం సాధించారు. 100 శాతం స్ట్రైక్‌రేటు సాధించడమే కాకుండా... కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తాజా ఎన్నికల్లో 29 చోట్ల పోటీ చేసిన చిరాగ్ నేతృత్వంలోని ఎల్‌జేపీ 22 స్థానాల్లో విజయం సాధించారు.

నెరవేరని ప్రియా చౌదరి శపథం

పట్నా: ప్లూరల్స్ పార్టీ అధ్యక్షురాలు పుష్పమ్ ప్రియాచౌదరీ శపథం నెరవేరలేదు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేవరకు మాస్క్ తీయనని ఆమె ఎన్నికల ముందు ప్రకటించారు. ఎన్నికల సమయమంతా ఆమె మాస్క్‌తోనే ప్రచారం చేశారు. చివరికి పరాజయం పాలయ్యారు. దర్భంగా నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి ఓడిపోయిన ఆమె ఎనిమిదో స్థానానికి పరిమితమయ్యారు. కులమత రాజకీయాలకు అతీతంగా బీహార్‌కు కొత్త బ్రాండ్ తీసుకువచ్చే లక్ష్యంతో 2020లో 'ద ప్లూరల్స్ పార్టీ'ని ప్రియ స్థాపించారు. విజిల్ గుర్తుపై మొత్తం 243 స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను బరిలో నిలిపారు. ఎప్పుడూ నల్లటి దుస్తులు, మాస్క్ ధరించి బయట కనిపించే ఆమె... ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాతే మాస్క్ తీస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఆమె తండ్రి వినోద్ కుమార్ చౌదరీ... జేడీయూ పార్టీ నేత. చట్టసభ మాజీ సభ్యుడు. ఆమె తాత ప్రొఫెసర్ ఉమాకాంత్ చౌదరీ... బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు అత్యంత సన్నిహితులు. ఆమె మామ వినయ్ కుమార్ జేడీయూలోనే ఉన్నారు. ప్రియ... యూనివర్సిటీ ఆఫ్ ససెక్స్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి మాస్టర్స్ పూర్తి చేశారు. రాజకీయాల్లోకి రాకముందు... బీహార్ పర్యాటక, వైద్య విభాగంలో కన్సల్టెంట్‌గా తన వృత్తి ప్రారంభించారు. 2020 ఎన్నికల్లోనూ ఆమె పార్టీ 148 స్థానాల్లో పోటీ చేసి... ఓటమిని చవిచూసింది.

ఓటముల అవార్డు రాహుల్‌కే: బీజేపీ

న్యూఢిల్లీ: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాగట్బంధన్ ఓటమి చెందడంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ నేతలు సెటైర్లు వేస్తున్నారు. గత రెండు దశాబ్దాలలో జరిగిన ఎన్నికల్లో రాహుల్‌గాంధీ 95 సార్లు ఓడిపోయారని బీజేపీ నేత అమిత్ మాలవీయ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలో రాహుల్‌గాంధీ కీలక స్థానాన్ని చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు వివిధ రాష్ట్రాలలోని ఎన్నికల్లో ఆ పార్టీ 95 సార్లు ఓడిపోయినట్లు సూచిస్తున్న మ్యాప్‌ను మాలవీయ సోషల్ మీడియాలో షేర్ చేశారు. 2004 నుంచి 2025 వరకు జరిగిన వివిధ ఎన్నికల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ అనేకసార్లు విఫలమైందని, ఇది రాహుల్ గాంధీకి మరో ఎన్నిక, మరో ఓటమని మాలవీయ అన్నారు. బీహార్‌లో తాజాగా ఎదురైన ఓటమితో రాహుల్ 95 సార్లు ఓడిన రికార్డును నెలకొల్పారని పేర్కొన్నారు. ఎన్నికల ఓటముల్లో స్థిరత్వానికి అవార్డులు ఉంటే... అవన్నీ ఆయనకే దక్కేవని, రాహుల్ పరాజయాలను చూసి ఓటమి కూడా ఆశ్చర్యపోక తప్పదని ఎద్దేవా చేశారు.

సిక్కిం ముఖ్యమంత్రికి అస్వస్థత

గ్యాంగ్‌టక్: సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్‌సింగ్ తమాంగ్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సీఆర్‌హెచ్ మెడికల్ సూపరింటెండెంట్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధిక రక్తపోటుతో ముక్కు నుంచి రక్తస్రావం కావడంతో గురువారం ఆస్పత్రిలో చేర్చినట్లు తెలిపింది. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని, త్వరలోనే డిశ్చార్జ్ అవుతారని ప్రకటనలో పేర్కొన్నారు.

ఢిల్లీ బాంబర్ ఉమర్ ఇల్లు కూల్చివేత

శ్రీనగర్: ఢిల్లీ బాంబు పేలుళ్ల ఘటనకు కారకుడైన ఉమర్ మహమ్మద్ అలియాస్ ఉమర్-ఉన్-నబీ ఇంటిని భద్రతా బలగాలు శుక్రవారం నేలమట్టం చేశాయి. దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామాలో అతడి నివాసాన్ని ఈ తెల్లవారుజామున కూల్చివేసినట్టు అధికారులు వెల్లడించారు. దీంతో భారత్‌లో ఉగ్రవాద కార్యకలపాలకు మద్దతిస్తున్న వారికి ఇది ఓ సందేశాత్మక హెచ్చరిక అని తెలిపారు. ఎర్రకోట సమీపంలో గత సోమవారం సాయంత్రం తీవ్ర కలకలం రేపిన ఈ బాంబు పేలుడులో ఇప్పటివరకూ 13 మంది మృతి చెందారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పేలుడు జరిగిన ప్రదేశంలో లభించిన ఉమర్ నమూనాలను అతడి తల్లి నుంచి సేకరించిన డీఎన్ఏ నమూనాలతో పోల్చగా... కారులో ఉన్నది అతడేనని నిర్ధారణ అయింది. నిందితుడు ఉమర్... ఫరీదాబాద్‌లోని అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయంలో వైద్యుడిగా పనిచేసేవాడు. ఈ ఘటనలో అతడి సన్నిహితులైన వైద్యులు ముజామ్మిల్, షాహీన్‌లను అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రజా సంక్షేమమే పాలనకు నిదర్శనం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్ : కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రజా సంక్షేమమే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఈ విజయాన్ని ఇచ్చిందని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో మీడియా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నమ్మకం వల్లనే ఈ గెలుపు సాధ్యమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు బీఆర్ఎస్ నాయకులకు చెంప పెట్టు అన్నారు. రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో మరోసారి ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉంటారన్నారు. బీఆర్ఎస్ నాయకులు బీరాలు పాలకకుండా సంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరించాలన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, బాణాసంచా పేల్చి స్వీట్లు పంచుకుంటూ సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, బాలరాజ్ గౌడ్, చెన్నయ్య, రఘునాయక్, ఇబ్రహీం, శ్రీను నాయక్,ఖదీర్, సత్తయ్య, మహబూబ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రంగాచారీ మృతి మీడియా రంగానికి తీరనిలోటు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సీనియర్ పాత్రికేయులు రంగాచారీ మృతి మీడియా రంగానికి తీరని లోటని, ఆదర్శ పాత్రికేయులుగా నాలుగు దశాబ్దాల తన జర్నలిస్టు జీవితంలో ఆయన ఎంతో మంది ఆత్మీయులను సంపాదించుకున్నారని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ అన్నారు. శుక్రవారం ఆయన సైనిక్ పూరిలో రంగాచారీ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావాన్ని ప్రదర్శిస్తూ, ఎందరికో ఆయన స్ఫూర్తి దాయకంగా నిలిచారాని విరాహత్ కొనియాడారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విజయకుమార్‌రెడ్డి, వి. రమేష్‌లు రంగాచారీ మృతదేహానికి నివాళులర్పించారు.

ఘనంగా ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం

విశాలాంధ్ర, మల్కాజిగిరి : మీర్జల్‌గూడలోని డాక్టర్ కాంబ్లేస్ నిర్మత హెల్త్ కేర్, వైద్యులు డాక్టర్ ప్రజ్ఞ కాంబ్లే ఆధ్వర్యంలో ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం సందర్భంగా డయాబెటిస్, దాని సమస్యలు, నిర్వహణపై అవగాహనను వ్యాప్తి చేసింది. భువనగిరి జిల్లాకు చెందిన మిలింద్ కాంబ్లే ఏ.డి.జే. రన్ ఫర్ 7, రైడ్ ఫర్ 21లను జెండా ఊపి ప్రారంభించారు. హెచ్‌బిఏ1సి 7 వద్ద మరియు బిఎంఐని 21 వద్ద నిర్వహించాలని ఆయన అన్నారు. పిల్లలు, యువకులలో కార్యకలాపాలు మంచి ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రోత్సహించాలని మరియు వారి జీవనశైలిని సవరించాలని ఆయన అన్నారు. హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్‌కు చెందిన రవీందర్ సైక్లిస్టుల బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. సురేష్ పాండే, మను, జ్ఞానేశ్వర్, గణేష్, బాలకృష్ణ తదితరులున్నారు. రన్నర్లు నాగబుష్ణం, బోస్టన్ మారథాన్‌కు ఎంపికయ్యారు. సుందర్, మహేశ్వరి, మస్త్. స్మార్ట్, మస్త్, రిషి, రైడర్ సుచిత్ర, ఫిట్‌నెస్ ఫ్రీక్ ఉదయ్, మిస్టర్ సత్యనార్యణ, రిషి, సోల్మోన్‌రాజ్ తదితరులు మధుమేహాన్ని జయించడానికి అవగాహన కార్యక్రమాన్ని వ్యాప్తి చేయడానికి పాల్గొన్నారు.

సీఎస్‌తో ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధి బృందం భేటీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ , మూసి నది సుందరీకరణ, యంగ్ ఇండియా స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీ, రాష్ట్రంలో రోడ్ల విస్తరణ తదితర ప్రాజెక్టులపై ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ ప్రతినిధి బృందంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు శుక్రవారం డా.బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సమావేశమయ్యారు. తెలంగాణ రైజింగ్ 2047 లో భాగంగా హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పన, రాష్ట్రంలో వివిధ మున్సిపాలిటీలు, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ లో సివరేజ్ ప్లాంట్ ల నిర్మాణం. హామ్ రోడ్ల విస్తరణ, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ ద్వారా వ్యవసాయ పంపు సెట్లకు సోలార్ విద్యుత్ అనుసంధానం, టి.ఎస్.ఆర్.టి.సి ఈ బస్సెస్, యంగ్ ఇండియా స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీ లలో చేపట్టే ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్ట్ వివరాలు, ఆర్థిక పరమైన అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. పరస్పర సహకారంతో నిర్దేశించిన ప్రాజెక్టులను వేగ వంతం చేయాలని నిర్ణయించారు. సిఎస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పెట్టుబ డులకు అనువైనదని దేశంలో ఫాస్ట్ గ్రోయింగ్ స్టేట్ గా ఉన్నదని అన్నారు. ఈ సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రణాళిక కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి టి.కె. శ్రీదేవి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, హైదరాబాద్ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, టిజిఐఐసి డైరెక్టర్ శశాంక, హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎబిమేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, మూసి రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇ.వి.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

17న ప్రజావాణి : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 17 సోమవారం నుండి యధావిధిగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి ఒక ప్రకటనలో తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్, కౌంటింగ్ పూర్తి అవటంతో ఎన్నికల కోడ్ ఆదివారంతో ముగియ నుండడంతో తిరిగి ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి వైపే ప్రజా తీర్పు : మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : అభివృద్ధి వైపే జూబ్లీహిల్స్ ప్రజలు నిలబడారాని అందుకే జూబ్లీహిల్స్‌లో తమకు అనుకూలంగా వారి తీర్పు ఇచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజా పాలన ప్రభుత్వ కార్యక్రమాల ఆలోచన సరళి ,ఆ నియోజకవర్గ అభివృద్ధి కి ఆకాంక్షించి ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారని పేర్కొన్నారు. కంటోన్మెంట్ మాదిరి ఇక్కడ అభివృద్ధి కోసం ప్రజలు ఆలోచించారని, సానుభూతి, బీఆరెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేయడం ద్వారా మహిళలను సెంటిమెంట్ వాడుకోవడానికి అన్ని రకాల ప్రయత్నం చేశారని ఆరోపించారు. అయినా కాంగ్రెస్ పార్టీ సన్న బియ్యం, రేషన్ కార్డులు పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు వడ్డీలేని రుణాలు, ఆర్టీసీ లో ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు ,ఉద్యోగ నియామకాలు గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగానికి తీసుకున్న నిర్ణయాలు ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు ప్రజలు మాకు అండగా ఉన్నారన్నారు. మా ప్రభుత్వం అన్ని అంశాలు క్షేత్ర స్థాయిలో చేరేలా పని చేస్తున్నామని, ఈ పలితం ప్రభుత్వ కార్యక్రమాలకు నిదర్శనమన్నారు. బీఆరెస్ చేసిన దుష్ప్రచారం పరిగణనలోకి తీసుకొని మా ప్రభుత్వం మరింత బలంగా పని చేస్తుందని పేర్కొన్నారు. ఓడిపోతున్నామని అసహనంతో ప్రతిపక్ష పార్టీ రిగ్గింగ్ ఆరోపణలు చేసిందని, వాళ్ళే మా పార్టీ కార్యాలయం పై దాడికి ప్రయత్నం చేశారని విమర్శించారు. మీ సంగతి చూస్తా అనే మాటలు ఆశ్చర్యం కలిగించిందన్నారు. పోలీసులు మా నాయకులు అక్కడ ఉండవద్దు అని కేసులు పెట్టారని, వాళ్ళు అనేక మంది బయట వాళ్ళు ఉన్నారని, సికింద్రాబాద్ కార్పొరేటర్ అక్కడే ఉండి టీవీ లకు బైట్ ఇచ్చారని తెలిపారు. ముందు నుండి చెప్తున్నట్టు బీజేపీకి 10 వేల ఓట్లు కూడా రావు అని చెప్పామని, కిషన్ రెడ్డి ఎంపీ కేంద్ర మంత్రి బీఆరెస్ తో కుమ్మక్కయ్యారని దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడానికి సహకరించినందుకు కిషన్ రెడ్డి గురు దక్షిణ కింద బీఆరెస్ కి సహకరించారు, దీనికి కిషన్ రెడ్డి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ లో దోస్తీ గల్లీలో కుస్తీ ఉండే ఇప్పుడు గల్లీలో కూడా దోస్తీగా మారిందన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఘన విజయం

విశాలాంధ్ర, జూబిలీహిల్స్ : ఉప ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి వల్లల నవీన్ యాదవ్ ఘన విజయం సాధించారు. శుక్రవారం జరిగిన ఓట్ల లెక్కింపులో 10 రౌండ్లో మొత్తం కౌంటింగ్ నిర్వహించగా, ప్రతి రౌండ్ లోను లీడ్ సాధిస్తూ ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వకుండా దూసుకుని వెళ్లి విజయం సాధించారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ నిర్వహించారు. దాదాపు 25 వేల ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ విజయ దుందుభి మోగించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నుంచే ఆధిక్యం కనబరిచిన నవీన్. ఈవీఎం లెక్కింపులోనూ మొదటి రౌండ్ నుంచే దూసుకుపోయి గ్రాండ్ విక్టరీ కొట్టారు. కేవలం ఒక మూడో రౌండ్‌లో మాత్రమే బీఆర్ఎస్ అభ్యర్థి స్వల్ప మెజారిటీ సాధించినప్పటికీ.. ఆ తర్వాత కాంగ్రెస్ మళ్లీ జోరు అందుకోవడంతో కారు పార్టీ వెనుకంజ వేయక తప్పలేదు. మొత్తంగా బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత రెండో స్థానంతో సరిపెట్టుకోగా.. బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. దాంతో కౌంటింగ్ మధ్యలోనే కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వెళ్లిపోయారు దీపక్ రెడ్డి. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీకి పరాభవానికి ఇవే కారణాలు అంటూ జోరుగా చర్చ నడుస్తోంది. కానీ మొత్తానికి కాంగ్రెస్ విజయంతో కేసీఆర్ మాస్టర్ ప్లాన్ సక్సెస్ అయ్యిందని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీకి పరాభవం ఎదురవడానికి కారణాలు ఇవే అని పొలిటికల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అందులో ముఖ్యంగా పార్టీ అధినేత కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకపోవడం ఒక పెద్ద లోపంగా పరిగణిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా వారం రోజుల పాటు ప్రచారం నిర్వహించినప్పటికీ. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ మాత్రం దూరంగా ఉన్నారు. ఏ కారణంగానే కాంగ్రెస్‌కు ఘన విజయం. బీఆర్ఎస్‌కు అనూహ్య పరాజయం ఎదురైందని అంటున్నారు. అంతే కాకుండా కేసీఆర్ ప్రచారంలో పాల్గొని ఉంటే. బీఆర్ఎస్‌కు ప్రజల్లో మరింత ఉత్సాహం నిండేదని చెబుతున్నారు. ఆయన ప్రసంగాలు ఓటర్లను ఆకట్టుకునేవని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో అడపాదడపా పాల్గొంటున్నారు. ఇదే విషయాన్ని కాంగ్రెస్ నేతలు సైతం టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. కేసీఆర్ ఒక నాయకుడిలా కాకుండా, దొరలా పాలిస్తున్నారనే కామెంట్స్ సైతం చేశారు. అందుకే బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయిందని మండిపడ్డారు. జూబ్లీహిల్స్లాం ఉప ఎన్నికల్లో, కాంగ్రెస్ 24,729 ఓట్ల మెజార్టీతో నవీన్ యాదవ్ గెలుపొందారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 24,729 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నవీన్ యాదవ్ కు 98,988 ఓట్లు రాగా... బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 74,259 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డికి 17,061 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇండిపెంటెంట్ అభ్యర్థులుగా పోటీ చేసిన వారిలో బేర బాలకిషన్‌కు 175 ఓట్లు వచ్చాయి. నోటాకు 924 మంది ఓటు వేశారు .

నెహ్రూ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకాలు : మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బేగంపేట సెస్ ఆడిటోరియంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో కలిసి బెలూన్లు ఎగురవేసి వేడుకలను ప్రారంభించిన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పిల్లల మధ్య పూర్తిగా మమేకమై ఆనందాన్ని పంచుకున్నారు. చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లు స్వయంగా అందించి, వారిని ప్రేమగా చేరదీసి సందర్భం అక్కడి వాతావరణాన్ని మరింత ఉల్లాసభరితంగా మార్చింది. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ల శారద, బాలల హక్కుల కమిషన్ చైర్పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి, సభ్యులు కన్నర్ల వందన గౌడ్, మరిపల్లి చందన, బండి అపర్ణ, గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్, బి. వచన్‌కుమార్, శాఖకార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా పాల్గొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా ప్రసంగించిన మంత్రి దేశ నిర్మాణానికి తన జీవితాన్నే అర్పించిన తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ త్యాగాలు, దేశాభిమానం ప్రతి భారతీయునికి ప్రేరణ అని పేర్కొన్నారు. పదేళ్లు జైలు జీవితం గడిపి, తన సంపూర్ణ ఆస్తినే దేశానికి రాసిచ్చిన నెహ్రూ ఆలోచనలు, నైతిక విలువలు నేటి తరానికి మార్గదర్శకాలని ఆమె అన్నారు. ఆయన జన్మదినం మనందరికీ మనుషుల పట్ల ప్రేమ, పరులకు మేలు చేసే మనస్తత్వంతో నడుచుకోవాలని గుర్తు చేస్తుందన్నారు. చిన్నారుల సంరక్షణ, రక్షణ, అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు కీలక కార్యక్రమాలు అమలు చేస్తోందని మంత్రి వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ బోధన నుంచి పిల్లల పోషకాహారం వరకు సంపూర్ణ బాధ్యత ప్రభుత్వం తీసుకుంటోందని తెలియజేశారు. నేటి బాలలే రేపటి పౌరులని, చదువుతో ఎదుగుతూ వినయంతో మెలగాలని చిన్నారులకు సందేశమిచ్చారు. ఏ చిన్న కష్టానికైనా పిల్లలు వెనుకడుగు వేయకుండా, సవాళ్లను అవకాశాల్లా తీసుకుని ముందుకు సాగితేనే విజయాలు సాధ్యమవుతాయన్నారు. మహిళల సంక్షేమం కోసం నూతన విధానాన్ని రూపొందించే క్రమంలో నిపుణులు, మేధావులతో ఈ నెల 18న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి వివరించారు. అనంతరం చిన్నారుల ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆసక్తిగా వీక్షించి వారి ప్రతిభను మెచ్చుకున్నారు. శిశు విహార్ తో పాటు వివిధ అనాథాశ్రమాల్లో ఉంటూ చదువులో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో మాట్లాడిన మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ల శారద, పిల్లలను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వంతో పాటు సమాజానిదని పేర్కొన్నారు. చిన్నారులపై జరిగే వేధింపులను అరికట్టేందుకు ప్రభుత్వం బలమైన చర్యలు తీసుకుంటోందని, ఈ క్రమంలో న్యాయవాదులు, నిపుణులు, స్వచ్ఛంద సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆనందం, ఉత్సాహం నిండిన ఈ వేడుకలో చిన్నారులు, అధికారులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శిశువుల ఆరోగ్య పరిరక్షణ మన బాధ్యత: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్‌నగర్ అభివృద్ధిలో ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మరో మైలురాయిని నమోదు చేశారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని తల్లులు మరియు నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని, తన స్వంత నిధులతో రూపొందించిన ప్రత్యేక 'వైఎస్సార్ హెల్త్ కిట్ (యెన్నం శ్రీనివాస్ రెడ్డి హెల్త్ కిట్)'ను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా ఆవిష్కరించి, నియోజకవర్గానికి చెందిన మహిళలకు ఉచితంగా పంపిణీ చేశారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైద్యులు, ప్రజాప్రతినిధులు, ఆరోగ్యసేవకులు, స్థానిక ప్రజలు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 'నవజాత శిశువుల ఆరోగ్యం కాపాడుకోవడం సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు. పిల్లల ఆరోగ్యం బలోపేతం అవ్వాలంటే మొదటి 30 రోజులు అత్యంత కీలకమని, ఈ అవగాహన ప్రతి కుటుంబానికి చేరాలన్నదే ఈ కార్యక్రమం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశ్యం' అని ఆయన తెలిపారు. మహబూబ్ నగర్ నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగే ప్రతి తల్లికి, రాబోయే మూడు సంవత్సరాల పాటు ఈ వైఎస్సార్ హెల్త్ కిట్ అందించబడుతుందని ఆయన స్పష్టం చేశారు. పసిపిల్లలకు అవసరమైన అత్యవసర ఆరోగ్య సామగ్రిని సమగ్రంగా ఈ కిట్‌లో పొందుపరిచామని, ఈ కిట్ లో బేబీ సబ్బు, దోమతెర (మోస్కిటో నెట్), బేబీ బెడ్, బేబి బాడీ లోషన్, బేబి ఆయిల్ , బేబీ డ్రెస్సులు, బేబీ పౌడర్, ఉన్నత నాణ్యత ప్రమాణాలు గల చిన్నారుల సానిటరీ ప్యాడ్స్ ఉన్నాయన్నారు. భావి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో భద్రతా చర్యలను మరింత పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీసీ కెమెరాలు, గస్తీ సిబ్బంది, ప్రవేశ నియంత్రణ వ్యవస్థలు వంటి అంశాలపై ఆసుపత్రి అధికారులు కూడా సూచనలు ఇవ్వగా, వాటిని త్వరలో అమల్లోకి తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగ అజ్మీర, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యుడు బెజ్జుగం రాఘవేందర్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఇంచార్జి గోనెల శ్రీనివాసులు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, డాక్టర్ సునీల్, డాక్టర్ ప్రసన్న లక్ష్మి, డాక్టర్ ఆశాజ్యోతి, డాక్టర్ స్ఫూర్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకే.....

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు స్పష్టంగా ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకే కొనసాగుతున్నట్లు వెల్లడించాయని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 25 వేల భారీ మెజారిటీతో ఘన విజయాన్ని సాధించడంతో పార్టీ కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డిసిసి కార్యాలయం నుండి న్యూటన్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని విజయోత్సవాలు జరుపుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, "జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల విజయం మా పార్టీపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి ప్రతీక అని, ఈ విజయంతో మాపైన బాధ్యత మరింత పెరిగిందన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, టి పిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, టి పిసిసి అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, వినోద్ కుమార్, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, , డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సిజె బెనహర్, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, నాయకులు సాయిబాబా, ఐఎన్టీయుసి రాములు యాదవ్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలు జయప్రదం చేయండి : ఎం బాలనరసింహ

విశాలాంధ్ర - హైదరాబాద్ : సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నర్సింహా పిలుపునిచ్చారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో గల సీపీఐ పార్టీ ఆఫీసులో ఈరోజు విస్తృత స్థాయి కౌన్సిల్ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేష్ గౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాలనరసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భారత గడ్డపై పుట్టి వంద సంవత్సరాలు అవుతుంది 1925 డిసెంబర్ 26 కాన్పూర్ లో పురుడు పోసుకుందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డపై వందేళ్ళ పోరాట చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ భారతదేశానికి స్వాతంత్రం కావాలని తొలుత గర్జించిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని ఆయన అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరగబోయే శతజయంతి ముగింపు సభ భారీ బహిరంగ సభ వేడుకలకు మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రతి ఇంటి నుండి ఒక ఒక కమ్యూనిస్టు కార్యకర్త వచ్చి ఖమ్మంలో జరిగే శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని అన్నారు. అదేవిధంగా 100 సంవత్సరాలు ఉత్సవాలలో కమ్యూనిస్టు పార్టీ చేసిన త్యాగాలను పోరాటాలను గుర్తు చేస్తూ పాలకులు చేస్తున్న దోపిడీలను ఖండిస్తూ ఈనెల 15న బస్సు యాత్ర గద్వాల జిల్లాలో ప్రారంభమై వనపర్తి, నారాయణపేట, మహబూబ్నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల మీదగా ఖమ్మం వెళుతుందని ఆయన అన్నారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో కల్తీ కల్లు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని తద్వారా ప్రజలను తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని ముఖ్యంగా కల్తీకల్లు వల్ల కిడ్నీలు పాడై అనేకమంది చనిపోతున్నారని చాలామంది ఆ వ్యాధి బారిన పడుతున్నారని దీనిని తక్షణమే ఉన్నత అధికారులు , ఎక్సైజ్ మినిస్టర్ ఈ కల్తీ కల్లుపై చొరవ తీసుకొని దాన్ని నిర్మూలించాలని అన్నారు లేకుంటే దీనిపైన ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి . బాలకిషన్ కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, కే పద్మావతి, ఎం గోవర్ధన్, కౌన్సిల్ సభ్యులు కోట కదిరి నరసింహ, శీను, చాంద్ బాషా, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గాంధీ భవన్లో మహిళా కాంగ్రెస్ సంబరాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప్పఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం పట్ల మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గాంధీభవన్లో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. హైదరాబాదులో జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఘన విజయం సాధించడం హర్షనీయమని చాలా సంతోషంగా ఉంది అని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు అన్నారు. గాంధీభవన్లో ఘనంగా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబరాలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టంకట్టి ఓటు వేసి గెలిపించిన ప్రతి ఓటర్లకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మీద నవీన్ యాదవ్ మీద నమ్మకంతో ఓటు వేసిన జూబ్లీహిల్స్ ప్రజలకు ఎప్పుడు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని జూబ్లీహిల్స్ అభివృద్ధి ధ్యేయంగా నవీన్ యాదవ్ పనిచేస్తాడని నమ్మకంతో తమ్ముడిని ఆశీర్వదించిన జూబ్లీహిల్స్ ప్రజలందరికీ ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ ప్రెసిడెంట్స్. స్టేట్ వైస్ ప్రెసిడెంట్స్. జనరల్ సెక్రెటరీలు.సెక్రెటరీ లు. బ్లాక్ ప్రెసిడెంట్స్. డివిజన్ ప్రెసిడెంట్స్ మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

'మీ డబ్బు, మీ హక్కు'పై అవగాహన

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రజలు తమ క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లు, వాటాలు, డివిడెండ్‌లు, మ్యూచువల్ ఫండ్‌లు, బీమా ఆదాయాలు మొదలైన వాటిని క్లెయిమ్ చేసుకోవడానికి వీలు కల్పించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన మీ డబ్బు, మీ హక్కు' అనే థీమ్‌తో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల పరిష్కారంపై జిల్లా స్థాయి అవగాహన-కమ్-క్యాంపెయిన్ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా, ఈ నెల 1 నుంచి 31 వరకు 'మీ డబ్బు, మీ హక్కు' అనే ట్యాగ్‌లైన్‌తో ఆర్థిక రంగంలో క్లెయిమ్ చేయని ఆస్తుల పరిష్కారం కోసం జాతీయ స్థాయి ప్రచారం. ఈ ప్రచారం యొక్క లక్ష్యం పౌరులు తమ క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లు, వాటాలు, డివిడెండ్‌లు, మ్యూచువల్ ఫండ్‌లు, బీమా ఆదాయాలు మొదలైన వాటిని క్లెయిమ్ చేసుకోవడానికి వీలు కల్పించడం జరిగిందని, క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తుల హక్కుదారులు తమ బ్యాంకులను లేదా ఇతర సంస్థలను సంప్రదించి, నిధులను తిరిగి పొందాలని, ప్రచారాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌బిఐ డిజీఎం ప్రియవ్రత మిశ్రా మాట్లాడుతూ, క్లెయిమ్ చేయని డిపాజిట్లు మరియు పెట్టుబడులు వాటి చట్టబద్ధమైన యజ మానులకు తిరిగి ఇవ్వబడతాయని ఈ ప్రచారం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన పేర్కొన్నారు. ఎస్‌ఎల్‌బిసి, ఏజీఎం పద్మజారాణి మాట్లాడుతూ ఈ ప్రక్రియను సులభతరం చేయడానికి మరియు ఆర్థిక పారదర్శకతను నిర్ధారించడానికి వారి సంబంధిత కమ్యూనిటీలలో అవగాహనను వ్యాప్తి చేయాలని ఆమె పాల్గొన్న వారందరినీ ప్రోత్సహించారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సందర్శించారు. శిబిరం ఏర్పాటు చేయడం ద్వారా వినియోగదారులకు సేవలు అందించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సురేష్ మోహన్, శ్రీలక్ష్మి, రామరావు, ఉష, బ్యాంక్ అధికారులు, ప్రజలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

17న 'మీ డబ్బు - మీ హక్కు'

విశాలాంధ్ర, హైదరాబాద్ : బ్యాంక్‌లలో వివిధ కారణాలతో క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల కోసం ప్రభుత్వం కల్పించిన మూడు నెలల ప్రత్యేక కార్యక్రమం 'మీ డబ్బు- మీ హక్కు'లో భాగంగా నవంబర్ 17న సోమవారం రోజున టిజిఎస్ ఆర్‌టిసి కళ్యాణమండపం నియర్ ఆర్టీసీ క్రాస్ రోడ్ బాగ్ లింగంపల్లిలో జిల్లా స్థాయి శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా 'మీడబ్బు- మీహక్కు' అనే ఇతివృత్తంతో క్లెయిమ్ చేసుకోని ఆర్థిక పరమైన ఆస్తుల సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ఆర్థికమంత్రి 2025 అక్టోబర్ 4న గుజరాత్‌లోని గాంధీనగర్ లో జాతీయస్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. 2025 అక్టోబర్ 01 నుంచి 2025 డిసెంబర్ 31 వరకు మూడు నెలల పాటు కొనసాగుతుందని చెప్పారు.క్లెయిమ్ చేసుకునేందుకు వీలు కల్పించాలన్న లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎల్ డి ఎం నరసింహమూర్తి తెలిపారు. అదేవిధంగా బ్యాంకుల్లో 10 సంవత్సరాలకు పైగా క్లెయిమ్ చేసుకొని డిపాజిట్ల వివరాలు ఆర్‌బిఐ ఉద్గమ్ వెబ్సైట్ (https://udgam.rbi.org. in) ద్వారా పొందొచ్చునని ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా విజనరీ అచీవర్స్ అలయన్స్ అవార్డ్స్ 2025

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: విజనరీ అచీవర్స్ అలయన్స్ (వీఏఏ) సంస్థ, బాలందూర్, మాదాపూర్ ప్రాంతంలో విజనరీ అచీవర్స్ అలయన్స్ అవార్డ్స్ 2025 రెండవ సీజన్‌ను అధికారికంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి స్పాన్సర్లు, మీడియా భాగస్వాములు, వీఏఏ ప్రతినిధులు, విశిష్ట అతిథులు సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ ప్రారంభోత్సవం, ఉత్తేజకరమైన నూతన పురస్కారాల సీజన్‌కు వేదికగా నిలిచింది. ఇది డిసెంబర్ 2025లో జరిగే ఒక ఘనమైన వేడుకతో ముగుస్తుంది. ఈ వేడుకలో వివిధ రంగాలకు చెందిన అత్యుత్తమమైన నాయకులను, నూతన ఆవిష్కర్తలను గౌరవించడం జరుగుతుంది. ఈ ప్రెస్ మీట్‌లో, విజనరీ అచీవర్స్ అలయన్స్ (వీఏఏ) ఈ సీజన్‌కు సంబంధించిన తమ గౌరవనీయమైన స్పాన్సర్ల వివరాలను అధికారికంగా ప్రకటించింది. ఈ పురస్కారాల సీజన్‌కు ముఖ్యమైన స్పాన్సర్ల వివరాలు ఇక్కడ ఉన్నాయి. వాసవి గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ ప్రధాన స్పాన్సర్‌గా ఈ కార్యక్రమంలో భాగం అవుతోంది. లా కేఫైన్ %-% చైన్ ఆఫ్ కాఫీ షాప్స్ వారు 'పవర్డ్ బై లా కేఫైన్' అనే పేరుతో ఈ కార్యక్రమానికి మద్దతు ఇస్తున్నారు. సీల్వెల్ కార్పొరేషన్ సంస్థ కో స్పాన్సర్‌గా భాగస్వామ్యం వహిస్తోంది. మూలా సిల్క్స్ మరియు బాలందూర్ సంస్థలు ఈ కార్యక్రమానికి మద్దతు ఇచ్చే అసోసియేట్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి. వీటితో పాటు, గౌరవనీయమైన ఇతర స్పాన్సర్లను కూడా ప్రకటించారు. ఈ కార్యక్రమం గౌరవ స్పాన్సర్‌ల వివరాలను కూడా వెల్లడించింది. సామ్రాజ్య %-% ది సిల్వర్ కింగ్‌డమ్ 'ప్యూర్ సిల్వర్ సర్టిఫికేట్ పార్ట్‌నర్'గా, గురుస్ ట్రోఫీస్ 'ట్రోఫీ పార్ట్‌నర్' గా వ్యవహరిస్తున్నాయి. వారి సమష్టి మద్దతు, హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేస్తున్న వ్యక్తులను, సంస్థలను గుర్తించాలనే వీఏఏ లక్ష్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

విశాలాంధ్ర -కొత్తూరు: రసవత్తరంగా సాగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 24 వేల పైచిలుకు ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా కొత్తూరు నందిగామ మండల కేంద్రాలతో పాటు గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబరాలు అంబరాన్ని అంటాయి. కొన్నిచోట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంతో ఉత్సాహంతో మిఠాయిలు పంచుకొని బాణాసంచాలు కాల్చి బ్యాండ్, బాజాల మధ్య చిందులు వేశారు. రాష్ట్రంలోని ప్రజాపాలనలో కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న అభివృద్ధి పనులే ఈ గెలుపుకు నాంది అని పలువురు నాయకులు కొనియాడారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతామన్నారు.

కాంగ్రెస్ పార్టీ విజయ సంబరాలు

విశాలాంధ్ర, మల్కాజిగిరి : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీ గెలుపొందిన సందర్భంగా మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... బిఆర్ఎస్ పార్టీని ప్రజలు దూరం కొట్టారని, వచ్చే ఎన్నికలలోపు బిఆర్ఎస్ పార్టీ కనుమరుగవుతుందన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఇన్చార్జి లక్ష్మీకాంతరెడ్డి, వెంకటేష్ యాదవ్, గుండా నిరంజన్, పిట్టల శ్రీనివాస్, జిఎన్‌వి. సతీష్ కుమార్, సంపత్ గౌడ్, మైనాల ప్రవీణ్, సత్యమూర్తి, సంతోష్ రాందాస్ ముదిరాజ్, పిట్టల నాగరాజు, మైనార్టీ నాయకులు సయ్యద్ మబ్బు, ఫరీద్, సానాది శంకర్, బ్రహ్మయ్య, ఇందిరా ప్రియదర్శిని, ఆశా, ప్రభా, శారద, ఆగమయ్య, కొండగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'మీ డబ్బు - మీ హక్కు'

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం మార్గదర్శకాల ప్రకారం ఫేజ్ 4వ విడుత అన్‌క్లెయిమ్డ్ ఫండ్స్ క్యాంప్‌ను లీడ్ బ్యాంక్ ఆఫీస్ ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు రాధిక గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 31లోపు అంతకు ముందు ఉన్న అన్ని క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించాలని అన్ని బ్యాంకులు, బీమా సంస్థలు మరియు అన్ని ఇతర ఆర్థిక సంస్థలను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన క్లెయిమ్ చేయబడని నిధుల వివరాలను అందించాలని ఆమె ఆదేశించారు. అలాగే, క్లెయిమ్ చేసుకోవడానికి కావాల్సిన రుజువులు సమర్పించడానికి సంబంధించిన సమాచారాన్ని అందించాలని సంబంధిత అధికారులను కోరినారు. ఆర్‌బిఐ జిఎం, ఎల్ఎండి కెనరా బ్యాంక్ డిజిఎం, నాబార్డ డిడిఎం కూడా ఇదే విషయాన్ని వ్యక్తం చేశారు, అన్ని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు డిసెంబర్ 31లోపు దీన్ని పూర్తి చేయాలని కోరారు. క్లెయిమ్ సెటిల్మెంట్ అయిన కొంత మంది చట్టబద్ధమైన హక్కుదారులకు ఆయా బ్యాంకుల అధికారుల సమక్షంలో ఆర్‌బిఐ జిఎం ద్వారా శాంక్షన్లు ఇవ్వడం జరిగింది. 10 సంవత్సరాలకుపైగా క్లెయిమ్ చేయకుండా ఉన్నసొమ్ము ఆర్‌బిఐకి బదిలీ అయ్యేలోపు తిరిగి పొందాలని దిశా నిర్దేశం చేయడం జరిగినది. అలాగే, మరచిపోయిన చట్టబద్ధమైన హక్కుదారులకు సహాయం చేయండని మార్గనిర్దేశం చేయాలని అన్ని సంబంధిత ఆర్థిక విభాగాలకు సూచించారు. ఇందులో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జిఎం, హైదరాబాద్ సుబ్రభత్ సర్, కెనరా బ్యాంక్ మేడ్చల్ జిల్లా కోఆర్డినేటర్ డిజిఎం కృష్ణ కాంత్ రాయ్, నాబార్డ్ డిడిఎం అఖిల్ పున్న, సి.శివ ప్రసాద్, ఎల్‌డిఎంలు పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు రాత్రి షిఫ్ట్‌ల నిర్ణయంపై ఖండన

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మహిళలు రాత్రి షిఫ్ట్‌లలో పనిచేయడానికి అనుమతించాలనే నిర్ణయాన్ని జాతీయ భారత మహిళా సమాఖ్య తీవ్రంగా ఖండిస్తోందని భారత మహిళా జాతీయ సమాఖ్య ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధు తెలిపారు. బలమైన భద్రతా యంత్రాంగాలు మరియు జవాబుదారీతన నిర్మాణాలను నిర్ధారించకుండా అటువంటి విధానాన్ని అమలు చేయడం మహిళల భద్రత, గౌరవం, శ్రేయస్సుకు తీవ్రమైన ముప్పును కలిగిస్తుంది. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని "సమాన ఉపాధి అవకాశాల" వైపు ఒక అడుగుగా చిత్రీకరిస్తోంది, కానీ రాష్ట్రంలోని వాస్తవాలు వేరే కథను చెబుతాయి. బహిరంగ ప్రదేశాలు, పని ప్రదేశాలు మరియు రాత్రిపూట రవాణా మహిళలకు చాలావరకు సురక్షితం కాదు. ఈ సందర్భంలో రాత్రి షిఫ్ట్‌లను అనుమతించడం వల్ల మహిళలు సాధికారతకు బదులుగా దోపిడీ మరియు హింసకు గురవుతారు. నిజమైన సమానత్వం అనుమతి గురించి మాత్రమే కాదు, చట్టం ప్రకారం భద్రత, గౌరవం మరియు సమాన రక్షణను నిర్ధారించడం గురించి అని %చీఖీ×ఔ% గట్టిగా నమ్ముతుంది. అన్ని కార్యాలయాల్లో ప్రభావవంతమైన అంతర్గత ఫిర్యాదుల కమిటీలు (ఐసీసీలు), సురక్షితమైన మరియు నమ్మదగిన రవాణా ఏర్పాట్లు మరియు యజమానుల బాధ్యతలను కఠినంగా పర్యవేక్షించకపోతే, ఈ నిర్ణయం బాధ్యతారహితమైనది మరియు మహిళా వ్యతిరేకమైనదని తెలిపారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలి, మహిళా కార్మికులకు తప్పనిసరి భద్రతా ప్రమాణాలు, రవాణా సౌకర్యాలు మరియు పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి, లైంగిక వేధింపులు మరియు సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి అన్ని కార్యాలయాల్లో క్రియాత్మకమైన మరియు జవాబుదారీతనం కలిగిన అంతర్గత ఫిర్యాదుల కమిటీలు (ఐసీసీలు) ఉండాలి, వారి భద్రత మరియు గౌరవానికి హామీ ఇచ్చినప్పుడే శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం అర్థవంతంగా మరియు సాధికారతగా ఉంటుందని తెలిపారు.

చేనేత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర, హైదరాబాద్ : చేనేత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం నాయకులతో కలిసి చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్య ను హైదరాబాదులోని కార్యాలయంలో కలిసి వినతి పత్రం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసికంటి లక్ష్మీనరసయ్యతో కలిసి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ... రాష్ట్రంలో సుమారు లక్ష కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, సంక్షోభంలో కూరుకుపోయిన చేనేత రంగాన్ని గట్టు ఎక్కించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకాలను, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.1 లక్ష లోపు రుణాలను మాఫీ చేస్తున్నట్టు 14 నెలల క్రితం ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రకటించారని, రూ. 33 కోట్లు రుణమాఫీ కోసం విడుదల చేస్తున్నామని ఆయన వెల్లడించారని గుర్తు చేశారు. చేనేత కార్మికుల రుణ బకాయిల వివరాలన్నీ ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉన్నందున సరిపడినన్ని నిధులను విడుదల చేసి రైతన్నల మాదిరిగా నేతన్నలను రుణ విముక్తులను చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 527 చేనేత సహకార సంఘాలు ఏర్పాటు అయ్యాయని తెలిపారు. టెస్కో కొనుగోలు చేసిన వస్త్రాలకు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో వడ్డీల భారం పెరిగి చేనేత సహకార సంఘాలు అప్పుల్లో కూరుకుపోయాయని, వడ్డీల భారం పెరిగి చాలా చేనేత సంఘాలు మూతపడడంతో కార్మికులకు ఉపాధి దొరకని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. సహకార చట్టం ప్రకారం చేనేత సహకార సంఘాలకు 2013లో ఎన్నికల నిర్వహించారని, 2018 తో వాటి కాలపరిమితి ముగిసినా ఇప్పటివరకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదని తెలిపారు. చేనేత సహకార సంఘాల సమాఖ్య "టెస్కో" కు సైతం పాలకవర్గం లేనందున చేనేతల సంక్షేమం పట్టించుకునేవారు లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం "నేతన్నకు భరోసా" పథకంలో జియో టాగ్ మగ్గం వేసే చేనేత కార్మికుడికి ఏడాదికి రూ. 18,000, ఒక అనుబంధ కార్మికుడికి రూ. 6000 చొప్పున మంజూరు చేస్తామని ప్రకటించిందన్నారు. ఆ పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. చేనేత సహకార సంఘాల సమాఖ్య టెస్కో నిర్వహణ బాధ్యతలు, ఉద్యోగుల జీతభత్యాలను ప్రభుత్వమే చెల్లించాలని, సహకార సంఘాల పై భారం వెయ్యకూడదని విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ పథకంలో చేనేత కార్మికులకు వర్క్ షెడ్లు మంజూరు చేయాలని, చేనేత వస్త్రాలపై "0" జీఎస్టిని అమలు చేయించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. తాము చేసిన విజ్ఞప్తికి చేనేత జౌళి, శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ స్పందించారని, వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారని సత్యం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీ నరసయ్య, గౌరవాధ్యక్షుడు వెంకట్ రాములు, అధ్యక్షుడు పెండెం సర్వేశ్వర్, నాయకులు జల్ది రాములు, కస్తూరి బిక్షపతి, కర్నాటి మారయ్య, సురపల్లి జనార్ధన్, దుదుక ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెసోనెన్స్ 'రెసోఫెస్ట్ 2025'

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: రెసోనెన్స్ జూనియర్ కాలేజీలు, రెసోనెన్స్ స్కూల్స్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మక వార్షిక సాంస్కృతిక మహోత్సవం 'రెసోఫెస్ట్ 2025' గచ్చిబౌలి స్టేడియంలో రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఈ ముగింపు వేడుకలలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్. వి. రమణ మాట్లాడుతూ ఎటువంటి నిర్బంధం లేకుండా కలలతో, ఆశలతో ఉండే వయస్సు ఇదన్నారు. వేగంగా మారుతున్న ఇంటర్నెట్ యుగంలో మన జీవితం పూర్తిగా టెక్నాలజీపై ఆధారపడుతోందన్నారు. కోరుకోకపోయినా, ప్రతికూల ప్రభావాలు మీపై పడే అవకాశాలు ఎక్కువ అన్నారు. సోషల్ మీడియా అనవసరమైన విషయాలతో నిండి ఉందని, కాస్త జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎప్పుడూ ఇతరులతో పోల్చుకోవద్దన్నారు. ప్రతి వ్యక్తికి తనదైన వ్యక్తిత్వం, తనదైన మేధస్సు ఉంటుందన్నారు. ఒక స్పష్టమైన లక్ష్యం పెట్టుకోవాలన్నారు. దానిపై దృష్టి పెట్టి కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు, మిత్రులు, సమాజం, ఉపాధ్యాయుల ఒత్తిడి వల్ల కొన్నిసార్లు స్ట్రెస్ అనిపించవచ్చన్నారు. భవిష్యత్తు ఎలా ఉండబోతుందో తెలియక గందరగోళం కలగవచ్చన్నారు. కానీ ఈరోజు అవకాశాలు అపారంగా ఉన్నాయన్నారు. ఇష్టంలేని వృత్తిని ఎంచుకోవాల్సిన అవసరం లేదన్నారు. కలలను సాకారం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో కనిపించేది చూసి ఆకర్షితులు కావొద్దన్నారు. అవి చాలా వరకు నిజం కావన్నారు. ఆన్‌లైన్‌లో అధిక సమయం గడపడం తగ్గించాలన్నారు. విద్యలో నైతిక విలువలు, జీవిత పాఠాలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమాలు యువతపై ప్రభావం చూపుతున్నాయన్నారు. కానీ నిజ జీవితం, సినిమా రెండు పూర్తిగా వేరన్నారు. ఆ కల్పిత ప్రపంచంలో ఇరుక్కోవద్దన్నారు. నగరం, గ్రామం మధ్య పెరుగుతున్న అంతరం ఒక సవాలు అన్నారు. నగరాల్లో చదువుతున్న యువత గ్రామీణ వాస్తవాలు, సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడు మాత్రమే నేలను తాకినట్లు నిలబడగలుగుతారన్నారు. క్రీడల్లో పాల్గొనాలన్నారు. అవి జట్టు భావన, క్రమశిక్షణ, నాయకత్వం, ఓటమిని అంగీకరించే గుణాన్ని నేర్పుతాయన్నారు. స్ట్రెస్ తగ్గించుకునేందుకు అభిరుచులు పెంపొందించుకోవాలన్నారు. టెక్నాలజీ ఒక సాధనం మాత్రమేనని, దానికి బానిసలుగా మారొద్దని చెప్పారు. విద్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా సిద్ధం చేయాలన్నారు. జీవితం గొప్ప గురువని, అది నేర్పే పాఠాలకు ప్రత్యామ్నాయం లేదన్నారు. భారత్ ప్రపంచ నాయకత్వం వైపు దూసుకుపోతుందన్నారు.

నవీన్ యాదవ్‌కి అభినందనలు : ఈటీ నరసింహ

విశాలాంధ్ర, హైదరాబాద్ : భారత కమ్యూనిస్టు పార్టీ హైదరాబాద్ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం శుక్రవారం హిమాయత్ నగర్‌లో మహమ్మద్ సలీం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈటి నరసింహ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో హోరాహోరీగా రాజకీయ పార్టీలు ప్రచారం నిర్వహించడం జరిగింది. బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కెటిఆర్ అహంకార పూరితంగా వ్యక్తిగత దూషణలు దిగాడమే కాకుండా పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా ప్రయత్నం చేశారు. బిజెపి అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడకుండా మతోన్మాద రాజకీయాలను ప్రేరేపించి ఓట్లు రాబట్టుకోవాలని అనేక కుట్రలకు దిగారు. వీటన్నిటిని పక్కన పెట్టి వారికి గుణపాఠం చెప్పే విధంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి ప్రజలు తమ ఓటు ద్వారా పట్టం కట్టడాన్ని స్వాగతిస్తున్నామని, జూబ్లీహిల్స్ ప్రజల పోరాటాన్ని అభినందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను నెరవేరుస్తూ పచ్చి అవకాశవాద రాజకీయాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే వారికి అవకాశం ఇవ్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉన్నదని తెలిపారు. ఈ ఉప ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించడం కోసం సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ చేసిన కృషిని అభినందించారు. జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, ఎం.నరసింహ, చంద్ర మోహన్ గౌడ్, కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, సలీం ఖాన్, శంషుద్దీన్, ఉమర్ ఖాన్, కౌన్సిల్ సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్, మహమూద్, వెంకటయ్య, గ్యార నరేష్, చైతన్య లు హాజరయ్యారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

విశాలాంధ్ర, హనుమకొండ : వరంగల్ జిల్లా ఏఐటీయూసీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు ఆధ్వర్యంలో వరంగల్ డి.ఎం.అండ్ హెచ్.ఓ. కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఎన్‌హెచ్‌ఎం పథకంలో పని చేస్తున్న ఉద్యోగులందరిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని అలాగే పెండింగులో ఉన్న 2 నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని లేనిపక్షంలో ఈ నెల 17న హైదరాబాద్ మహాధర్నా చేస్తామని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం వరంగల్ డి.ఎం. అండ్ హెచ్. ఓ. డాక్టర్.బి.సాంబశివరావుకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి వరంగల్ జిల్లా కందిక చెన్నకేశవులు మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ పేద బడుగు ప్రజలకు సేవ అందించడంలో ముందువరస లో ఉండడం, ఎన్ హెచ్ ఎంలో పని చేస్తున్న ఉద్యోగులు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారని, వీరు శ్రమ దోపిడికి గురవుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న 7 నెల ఏరియర్స్ బకాయిలు వెంటనే ఇవ్వాలని, ప్రతి నెల ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా 1న వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి వరంగల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ యాకూబ్ పాషా, విక్టోరియా డిస్టిక్ అకౌంట్స్ ఆఫీసర్ సునీత, వరంగల్ జిల్లా అర్బన్ హెల్త్ సెంటర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జన్ను కొర్నేల్, జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆచంట అభిషేక్, వరంగల్ జిల్లా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఉద్యోగులు నర్సింగ్ ఆఫీసర్ స్వప్న, భాగ్యలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్లు రజియా, లావణ్య, ప్రవీణ్, ఏఎన్ఎంలు శారద , విజయలక్ష్మి, ఫెనీన, జయమని ,భాగ్యలక్ష్మి, ఉప్పలమ్మ, ఫార్మసిస్టు జోష్న, సతీష్, అకౌంటెంట్లు ప్రేమలత శ్రీనివాస్, స్వర్ణలత, ఎం.ఎన్.ఓ విజయ నాయక్, సపోర్టింగ్ స్టాఫ్ జాన్సన్, గౌస్ పాషా, రమేష్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి : కృష్ణ

విశాలాంధ్ర, హనుమకొండ : తమ సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు రజకులంతా రాజకీయాలు పక్కనపెట్టి ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ రజక వృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపెల్లి కృష్ణ పేర్కొన్నారు. మామిడాల నర్సయ్య అధ్యక్షతన శుక్రవారం నర్సంపేట మేరు భవన్ లో జరిగిన నియోజకవర్గ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఇల్లందుల సాంబయ్య బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న బొడ్డుపెల్లి కృష్ణ మాట్లాడుతూ... రజక వృత్తి దెబ్బతీసే విధంగా అగ్రకులాల వారే డ్రై క్లీన్ షాపులు పెడుతూ అదే షాపుల్లో కూలీలుగా చేర్చుకొని రజకుల బతుకుల్లో మట్టిగొడుతున్నారనీ అన్నారు. బీసీలైన రజకులు బీసీలతో పాటు కలిసి అగ్రకులాలకు ఓటు వేసిన ఫలితంగా అగ్రకులాల నేతలు అధికారంలో ఉండి చేతివృత్తులను నాశనం చేస్తూ కార్పొరేటీకరణను ప్రోత్సహిస్తున్నారన్నారు. పేదలకు విద్య, వైద్యం, ఉద్యోగాలు అందకుండా మొత్తం ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో రజకులంతా నియోజకవర్గంలో ఏకతాటిపై వచ్చి అగ్రకుల ఆధిపత్యాన్ని ఓడించాలన్నారు. రజకులకు ఉన్న సమస్యలను పరిష్కరించడానికి నియోజకవర్గం ఎమ్మెల్యేకి వినతి పత్రాలు ఇవ్వాలన్నారు. అనంతరం కుమారస్వామి మాట్లాడుతూ... కామారెడ్డి బీసి డిక్లరేషన్ బీసీలకు, చేతివృత్తిదారులకు, 42 శాతం రిజర్వేషన్లతో పాటు, వృత్తి బజార్లు ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. ఈ హామీను నిలబెట్టుకోవడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమవుతుందన్నారు, బీసీ రిజర్వేషన్లను అమలు చేయడానికి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రధానమంత్రి మోదీపై ఒత్తిడి పెంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యా ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్లు సాధించకుండా సమస్యను పక్కదారి పట్టించే విధంగా కోర్టుల చుట్టూ తిరగడం బీసీలను రిజర్వేషన్లు అనుభవించకుండా చేసే కుట్రలో భాగమేనన్నారు. రిజర్వేషన్ల కోసం బీసీల హక్కుల కోసం బీసీ హక్కుల సాధన సమితి సమగ్రమైన విధానంతో వ్యవహరిస్తుందన్నారు. బీసీల సమస్యలపై రిజర్వేషన్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వాలని నవంబర్ 28న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు నిరసన దీక్షను చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో రజకులు విరివిగా పాల్గొనే లాగా ఈ సమావేశానికి హాజరైన ప్రతి ఒక్క నాయకుడు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఇల్లందుల సాంబయ్య రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య, ఆరెల్లి ప్రభాకర్, బొడ్డుపల్లి సాయిలు, కొల్లూరి లక్ష్మి నారాయణ, రాయరాకుల శ్రీనివాస్, గుడికందుల సదయ్య, పైళ్ల యాదగిరి, మునుకుంట్ల రమేష్, బర్ల యాకయ్య, కొల్లూరు శ్రీహరి, భోగి సాంబయ్య, ఉప్పుల వీరస్వామి పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మీ, షాధీ ముబారక్ చెక్కుల పంపిణీ



విశాలాంధ్ర - మొయినాబాద్ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడపడుచు తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. లబ్దిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించి 40 మంది లబ్దిదారులకు రూ.40లక్షల4వేల 640 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దీన్, తహసిల్దార్ గౌతం కుమార్, టీపీసీసీ సభ్యులు షాబాద్ దర్శన్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నెహ్రూ జయంతి

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: భారతదేశానికి తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారనీ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ పట్టణంలో ఎల్ఎన్ కాలనీలో జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య ఆధ్వర్యంలో జరిగిన జయంతి సందర్భంగా చిన్నారులతో కలిసి జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.... భారత తొలి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన జవహర్ లాల్ నెహ్రూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి ఎంతో జాగ్రత్తతో వేసిన అడుగులే ఇప్పుడు దేశానికి బాటలుగా మారాయన్నారు. దూరదృష్టితో ఆర్థికంగా, సామాజికంగా ఆయన తీసుకొచ్చిన సంస్కరణలకు చెందిన ఫలితాలను ఇప్పుడు దేశ ప్రజలు అనుభవిస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, అగ్గనూర్ విశ్వం, గ్రంథాలయ కమిటీ చైర్మన్ మదన్మోహన్‌రెడ్డి బస్వం, చెంది తిరుపతిరెడ్డి, ఇంజమూరి గోపాల్, మురళీ కృష్ణ, రఘుమా రెడ్డి, ఇబ్రహీం, శ్రీశైలం గౌడ్, శేఖరాప్ప, పెంటయ్య, గంగమోని సత్తయ్య, జగదీశ్, కరుణాకర్, వీరశం,ఇసాక్, మంగ అశోక్, నల్లమోని శ్రీధర్ పాల్గొన్నారు.

నేటి నుంచి జాడు చాలావ్ యాత్ర

విశాలాంధ్ర, బషీర్ బాగ్: ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ శాఖ ఈనెల 15 నుంచి జాడు చలావ్ యాత్రని మొదలు పెడుతున్నట్లు పార్టీ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు.శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పార్టీ బలోపేతమే ధ్యేయంగా, ముఖ్యంగా రానున్న ఎంపీటీసీ, జడ్పిటిసి పురపాలక సంఘ కార్పొరేషన్ ఎలక్షన్‌లో పార్టీ బలోపేతం చేయడానికి, మెంబర్షిప్ డ్రైవ్ పాదయాత్రలు చేయాలని, పార్టీ నాయకులకి దశ నిర్దేశ చేశారు. బై ఎలక్షన్స్ రిజల్ట్‌లో అన్నింటిలో డబ్బు పలుకుబడే గెలిచిందన్నారు. దీనివల్ల ప్రజలకి ఎటువంటి న్యాయం జరగదని తెలి పారు.మరో సారి పహల్గవ్, ఢిల్లీ పేలుళ్ళు అడ్డు పెట్టుకొని బీజేపీ బీహార్ లో గెలిచిందని అన్నారు.రాష్ట్ర వ్యాపితంగా జరిగే జాడు చాలావ్ యాత్రలు, అవినీతిని శుభ్రం చేద్దాం, ప్రజాస్వా మ్యాన్ని బలపర్చుదాం అనే నినాదం తో సాగుతాయని అన్నారు. ఈనెల 26 ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున పెద్దఎత్తున కార్యక్రమామాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు బుర్ర రాముగౌడ్, డాక్టర్ అన్సర్ పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

విశాలాంధ్ర , కాప్రా : నేటి బాలలే రేపటి పౌరులని...బాల్యం నుంచి విద్యార్థులను ఉన్నత విలువలతో తీర్చి దిద్దాలని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ నవనీతరావు సూచించారు. శుక్రవారం నాచారం పరిధిలోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో బాలల దినోత్సవాన్ని గణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో సంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు, ఫుడ్ స్టాల్ వంటి వాటిని నిర్వహించి విద్యార్థులను ఉత్తేజపరిచారు. 4వ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులను ఏఎంఆర్ మాల్ కి తీసుకెళ్ళి సినిమా ప్రదర్శన కల్పించారు. ఈ సందర్భంగా నవనీత రావు మాట్లాడుతూ... బాల్యం నుండే పిల్లలకు విలువలతో కూడిన క్రమశిక్షణ నేర్పించాలన్నారు. నేటి బలాలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుల భుజ స్కందాలపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, డైరెక్టర్ డాక్టర్ కమల మనోహర్ రావు, కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ స్వర్ణ అక్కినేని పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యంతోనే కార్మికుడు మృతి

విశాలాంధ్ర- కొత్తూరు: గురువారం తెల్లవారు జామున విద్యుదా ఘాతానికి గుర్రై ఒ కార్మికుడు మృతి చెందడం జరిగింది, ఈ విషయాన్ని యాజమాన్యం గోప్యంగా ఉంచిన విషయం పాఠకులకు విధితమే. ఈ సంఘటనపై శుక్రవారం పోలీసులు తెలిపిన ప్రకారం. బీహార్ రాష్ట్రం, మహు వారి పోస్ట్, కేమూర్ జిల్లా, నిమి గ్రామానికి చెందిన బిర్జు రామ్(30), అతని చిననాన్న కుమారుడు కుష్ కుమార్ (20)లు కలిసి జీవనోపాధి కోసం మూడేళ్ల క్రితం కొత్తూరు మండలాల కేంద్రానికి వచ్చి సమీపంలోని కొత్తూరు తాండ శివారులో గల సాయి రాఘవ పాలిమర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో కూలీలుగా పనులు చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో రోజు లాగానే ఈనెల 12న రాత్రి విధులకని వెళ్లి 13న తెల్లవారుజామున 4 గంటల సమయంలో కుష్ కుమార్ మోటర్ వేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కి గురయ్యాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే చికిత్స నిమిత్తం అతనిని 108 సహాయంతో హైదరాబాద్ లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై మృతుని వరుసకు అన్న బిర్జురామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంధువులకు అప్పజెప్పి దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ నర్సయ్య తెలిపారు. పరిశ్రమ నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే కార్మికుడు మృతి చెందినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

విశాలాంధ్ర -మొయినాబాద్ : రెడ్డిపల్లి గ్రామాభివృద్ధియే నా లక్ష్యమని రెడ్డిపల్లి గ్రామ యువ నాయకులు రాజు(మాణిక్యం) పేర్కొన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలోని రెండు కాలనీల్లో సొంత నిధులు వెచ్చించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ పనులను గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి తనవంతు కృషిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లవేళల అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నార్ను

కనకదుర్గమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠ

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి కోస్ట విగ్రహాలు దెబ్బతిన్న కారణంగా శుక్రవారం కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో ఉన్నటువంటి కోస్ట విగ్రహాలకు ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్‌రెడ్డి (గురు స్వామి),గ్రామ పెద్దలు,నాయకులు కొలన్ నరసింహారెడ్డి వారి ధర్మపత్ని పద్మమ్మ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాలకు కళావాహన కార్యక్రమం నిర్వహించి పాత విగ్రహాలను తొలగించి నూతన విగ్రహాలు ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో బొర్రా అశోక్,బొర్రా చందు,గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

ఎర్రజెండాల ఐక్యత అవశ్యం

- కమ్యూనిస్టులే నూతన ప్రత్యామ్నాయం
- కూటమి పాలన విద్యారంగానికి మరణశాసనం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఎర్రజెండాల ఐక్యత అత్యవసరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య నొక్కిచెప్పారు. కమ్యూనిస్టులే నూతన ప్రత్యామ్నాయం కావాలని పిలుపునిచ్చారు. మావోయిస్టులు జన జీవన స్రవంతిలోకి రావాలని, ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. కూటమి పాలనలో విద్యా రంగానికి మరణశాసనం సిద్ధమవుతోందని విమర్శించారు. ఈశ్వరయ్య శుక్రవారం సీపీఐ కర్నూలు జిల్లా సమితి సమావేశం సీఆర్ భవన్‌లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప అధ్యక్షతన జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.రామాంజనేయులు, సీనియర్ నాయకుడు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు, జిల్లా మాజీ కార్యదర్శి పి.భీమలింగప్ప పాల్గొన్నారు. తొలుత లెనిన్ బాబు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు స్టాలిన్ బాబుతోపాటు రామానాయులు, హనుమంతు, తిమ్మప్ప, పార్వతమ్మకు, కర్నూలు, తెలంగాణ బస్సు ప్రమాదాల మృతులకు, దిల్లీ పేలుళ్ల మృతులకు నివాళులర్పించారు. అనంతరం ఈశరయ్య ప్రసంగిస్తూ నేపాల్‌లో కమ్యూనిస్టు పార్టీలు ఏకతాటిపైకి వచ్చి ఐక్య కార్యాచరణను ప్రకటించడాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలోనూ ఎర్ర జెండాలు ఐక్యం కావాలని, నూతన ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టులు నిలవాలని కోరారు. ఆపరేషన్ కగార్‌ను ప్రస్తావిస్తూ మావోయిస్టుల ప్రాణాలు అమూల్యమైనవన్నారు. జనజీవన స్రవంతికి రావడమే కాకుండా ప్రజా ఉద్యమాలకు సారథ్యం వహించాలంటూ మావోయిస్టులకు ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 4,111 పాఠశాలలు మూసివేశారని, యూనివర్సిటీలో వేలాది పోస్టులు భర్తీ చేయలేదంటూ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటుకు అప్పగించి పేదలకు వైద్యవిద్యను దూరం చేస్తున్నారన్నారు. ఫీజు బకాయిలు చెల్లించకుండా లక్షల మంది విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని దుయ్యబట్టారు. ఇంటర్ చదువుతున్న 11 లక్షల మందిలో సుమారు 9 లక్షల మంది శ్రీచైతన్య, నారాయణ, బాష్యం వంటి కార్పొరేట్ సంస్థల విద్యార్థులుగా ఉన్నారన్నారు. జాబ్ కార్డుల ఊసే లేదని, నిరుద్యోగ భృతికి విధివిధానాలు ప్రకటించలేదని, మహిళలకు ప్రతినెల 1,500 ఇస్తామని చెప్పారు కానీ రూపాయి ఇవ్వలేదని ఈశ్వరయ్య విమర్శించారు. పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడుసెంట్లు, పట్టణ ప్రాంతాలో రెండుసెంట్ల ఇస్తామన్న హామీ అమలునకు పోరాటం అవసరమని అన్నారు. పోలవరం - అమరావతి జపంతోనే పాలకులు సరిపెడుతున్నారన్నారు. జాతీయ ప్రాజెక్టు పోలవరం ఎత్తు తగ్గిస్తే ఎందుకు నిలదీయలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈశ్వరయ్య ప్రశ్నించారు. రాజధాని కోసం రూ.30 వేల కోట్లు అప్పు చేశారన్నారు. లక్ష ఎకరాలు సమీకరిస్తున్నారని, మూడు పంటలు పండే భూములు పోతే భవిష్యత్‌లో ఆహార కొరత తప్పదన్నారు. దిల్లీ నుంచి రాష్ట్రానికి పెట్టుబడులు రాలేదన్నారు. 8 గంటల పని విధానం రద్దు చేస్తే కార్మికుల ఆగ్రహాన్ని ఎదుర్కొవల్సి ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈశ్వరయ్య హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు ఆద్యుడు సీఎం చంద్రబాబు అని దుయ్యబట్టారు. రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి డిమాండ్ చేశారు. లక్షలాది టీఎంసీల నీటి వృథాపై నిర్లక్ష్యాన్ని ఆక్షేపించారు. ప్రజాఉద్యమాలు బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికలలో అత్యధిక స్థానాల్లో విజయమే లక్ష్యంగా ప్రతి అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని పార్టీ శ్రేణులకు ఈశ్వరయ్య సూచించారు. జన గణనతో పాటు కుల గణన నిర్వహణ, 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం డిమాండ్‌తో మంగళవారం అంటే 18వతేదీన సామాజిక న్యాయం పేరుతో ఆందోళనలకు పిలుపునిచ్చారు. డిసెంబరు 26న ఖమ్మంలో సీపీఐ 100 ఏళ్ల వేడుక జరగనున్నదని, వేలాది మంది పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఈశ్వరయ్య కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలలో అత్యధిక స్థానాల్లో పోటీ చేయడమే కాకుండా గెలవడం కోసం కృషి చేయాలని రామాంజనేయులు పిలుపునిచ్చారు. అనంతరం కార్యదర్శి నివేదికను గిడ్డయ్య సమర్పించారు. సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, కౌన్సిల్ సభ్యులు, ఆహ్వానితులు హాజరయ్యారు.

గవర్నర్‌కు రామకృష్ణ కుమార్తె వివాహ రిసెప్షన్ ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ఏకైక కుమార్తె సాయి లీల వివాహ రిసెప్షన్ ఆహ్వాన పత్రికను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అందజేశారు. విజయవాడ రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను రామకృష్ణతో పాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మనోహర్ నాయుడు శుక్రవారం కలిశారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు వివాహ రిసెప్షన్ విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో జరగనుంది. ఈ మేరకు గవర్నర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు.

రేపు సీపీఐ రాష్ట్ర సమితి సమావేశం

జి.ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి సర్వసభ్య సమావేశం ఈనెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు విజయవాడ దాసరి భవన్‌లో జరుగుతుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య తెలిపారు. సమావేశానికి సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు కె.రామకృష్ణ, పల్లా వెంకటరెడ్డి హాజరవుతారని, పార్టీ సభ్యులు, సానుభూతిపరులు సకాలంలో హాజరు కావాలని ఈశ్వరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ప్రజల పక్షాన కలం... గళం ఎక్కుపెట్టిన అందెశ్రీ

సంతాప సభలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ: అరుదైన గౌరవం అందెశ్రీ స్వంతమని, ప్రజల పక్షాన కలం... గళం ఎక్కుపెట్టారని వక్తలు కొనియాడారు. అనేక సాహితీ సాంస్కృతిక ప్రజాసంఘాల అధ్వర్యంలో శుక్రవారం విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో అందెశ్రీ సంతాప సభ జరిగింది. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, జనసాహితి వ్యవస్థాపకులు దివి కుమార్, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్ర నాయక్, కార్యదర్శి అనిల్, జాషువా సాంస్కృతిక సంస్థ నాయకులు గుండు నారాయణ, గోళ్ల నారాయణ, విజయవాడ బుక్ ఫెస్టివల్ అధ్యక్షులు మనోహర్ నాయుడు తదితరులు పాల్గొని అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సమాజంలో అనేక మంది రచయితలు ఉన్నప్పటికీ... అందెశ్రీ అరుదైన గౌరవం పొందారని అన్నారు. సమాజంలో అనేక రకాల రుగ్మతలు, సమస్యలపై తన కలాన్ని, గళాన్ని ఎక్కుపెట్టి చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. దివి కుమార్ మాట్లాడుతూ రచయితలు పాలకుల పక్షమా, ప్రజల పక్షమా అన్నది తేల్చుకోవాలన్నారు. అందెశ్రీ ప్రజల పక్షాన అనేక రచనలు చేశారని తెలిపారు. చంద్ర నాయక్, అనిల్ మాట్లాడుతూ అట్టడుగు స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగిన రచయితగా అందెశ్రీ పేరు సంపాదించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఎంబీవీకే సభ్యులు రామరాజు, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి నాయకులు జగన్, పిచ్చయ్య, నజీర్, శర్మ, దోనేపూడి సూరిబాబు, అరుణోదయ శ్రీనివాస్, అభ్యుదయ రచయితల సంఘం నాయకులు పరుచూరి అజయ్ పాల్గొన్నారు.

3 లక్షల ఓటర్లు ఎలా పెరిగారు?

దీపాంకర్ భట్టాచార్య నిలదీత

కుర్తా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వేళ ఓటర్ల జాబితాల ప్రక్షాళనపై వివాదం తలెత్తింది. రాష్ట్రంలో మూడు లక్షలకుపైగా ఓటర్లు ఎలా పెరిగాయి అంటూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని సీపీఐ(ఎంఎల్) ప్రశ్నించింది. అకారణంగా ఓటర్ల పెంపుదలపై ఈసీ వివరణ ఇవ్వాలని పార్టీ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య డిమాండ్ చేశారు. 'బీహార్ ఓటర్లు 7.42 కోట్లు. ఎన్నికల సంఘం పోలింగ్ అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రకటించించిన సంఖ్య 7,45,26,858. అదనంగా 3 లక్షల మంది ఎలా పెరిగారు. దీనికి ఎన్నికల సంఘం ఏం సమాధానం ఇస్తుంది' అంటూ ఎక్స్ మాధ్యమంగా దీపాంకర్ భట్టాచార్య దుయ్యబట్టారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పటికే పెద్ద వివాదంగా మారింది. ఈ ప్రక్రియలో లోపాలను అనేక రాజకీయ పార్టీలు ఎత్తి చూపాయి. ఓటర్ల డేటాలో అక్రమాలు, తొలగింపులు జరుగుతున్నట్లు ఆరోపించాయి. ఎన్నికల ఫలితాల వేళ బీహార్‌లో ఈ ఆరోపణలు దుమారం రేపాయి.

సీమాంచల్‌లో ఎగిరిన 'పతంగి'

మరోసారి 5 సీట్లు గెల్చిన మజ్లిస్

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, ఆర్జేడీ చతికిలపడగా... చిన్న పార్టీలతో జట్టు కట్టిన మజ్లిస్ పార్టీ సత్తా చాటింది. 2020 ఎన్నికల్లో గెలిచిన 5 స్థానాల్లో ఈసారి కూడా అసదుద్దీన్ ఒవైసీ 'పతంగి' రివ్వున ఎగిరింది. ముస్లిం ఓటుబ్యాంకు రేసులో ఆర్జేడీ, కాంగ్రెస్‌లను మజ్లిస్ దాటేసింది. జాతీయ పార్టీ కాంగ్రెస్‌కు సరిసమాన స్థాయిలో 5 సీట్లను గెల్చుకొని అందరినీ ఆశ్చర్యపర్చింది. 47 శాతం ముస్లిం జనాభా ఉన్న సీమాంచల్ ప్రాంతంలో మజ్లిస్ హవా కొనసాగింది. అమౌర్, బహదూర్‌గంజ్, బైసి, జోకిహాట్, కొచధమాన్ సీట్లను వరుసగా రెండోసారి ఆ పార్టీ కైవసం చేసుకుంది. అమౌర్ స్థానంలో 38,928 ఓట్ల తేడాతో అఖ్తరుల్ ఇమాన్ గెలిచారు. కొచధమాన్ స్థానంలో 23,021 ఓట్ల తేడాతో మహ్మద్ సర్వర్ ఆలం విజయం సాధించారు. జోకిహాట్ స్థానంలో మహ్మద్ ముర్షిద్ ఆలం, బహదూర్‌గంజ్ స్థానంలో మహ్మద్ తౌసిఫ్ ఆలం, బైసి స్థానంలో గులాం సర్వర్ గెలుపొందారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ ఐదు స్థానాల్లో మజ్లిస్ పార్టీయే గెలిచింది. అయితే ఎన్నికల ఫలితాల తర్వాత నలుగురు మజ్లిస్ ఎమ్మెల్యేలు ఆర్జేడీలోకి ఫిరాయించారు. అయినప్పటికీ వరుసగా రెండోసారి ఆ స్థానాలను మజ్లిస్ పార్టీ నిలుపుకోవడం విశేషం. ఈ సీట్లలో పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీకి పెరుగుతున్న పట్టుకు తాజా ఫలితం నిదర్శనం. ఈ వరుస విజయాలను పునాదిగా చేసుకొని రాబోయే రోజుల్లో సీమాంచల్‌లోని అరారియా, కిషన్‌గంజ్, కతిహార్, పూర్ణియా జిల్లాలపై పట్టు బిగించేందుకు మజ్లిస్ వ్యూహ రచన చేసే అవకాశాలు ఉన్నాయి.ఈసారి అసెంబ్లీ ఎన్నికల కోసం చంద్రశేఖర్ ఆజాద్‌కు చెందిన ఆజాద్ సమాజ్ పార్టీ, స్వామి ప్రసాద్ మౌర్యకు చెందిన అప్నీ జనతా పార్టీలతో మజ్లిస్ జట్టు కట్టింది. ఈ మూడు పార్టీలతో కూడిన కూటమి తరఫున రాష్ట్రంలోని 35 సీట్లలో మజ్లిస్ పార్టీ పోటీచేసింది. ఇందులోని 24 స్థానాలు సీమాంచల్‌లోనివే. ముస్లిం ప్రాబల్యం కలిగిన ఆ ప్రాంతంపై అసదుద్దీన్ ఒవైసీ నిశిత దృష్టికి ఈ రాజకీయ సమీకరణాలే సాక్ష్యాలు. ముస్లింలకు ఎన్నికల్లో పోటీచేసే అవకాశాలను కల్పించడం, ముస్లింల వాణిని అసెంబ్లీలో వినిపించే నేతలను తీర్చిదిద్దడం, ముస్లింల సంక్షేమానికి పాటుపడే నాయకత్వాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలతో సీమాంచల్‌లో ఒవైసీ ప్రచారం చేశారు. నిజానికి ఈసారి మహాఘట్బంధన్‌తో కలిసి పోటీచేయాలని మజ్లిస్ పార్టీ భావించింది. ఈమేరకు ఆసక్తిని వ్యక్తం చేస్తూ ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌తో పాటు కూటమిలోని అన్ని మిత్రపక్షాల అగ్ర నేతలకు మజ్లిస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్ లేఖలు రాశారు. తమ పార్టీకి 6 సీట్లు ఇస్తే చాలని, మహా కూటమితో కలిసి పనిచేస్తామని ఆయన కోరారు. అయితే 'బీజేపీ బీ టీమ్' అనే ముద్రవేసి, మజ్లిస్‌ను కూటమిలోకి తీసుకునేందుకు నిరాకరించారు. దీంతో అఖ్తరుల్ ఇమాన్ నేతృత్వంలో మజ్లిస్ కార్యకర్తలు, నాయకులు లాలూ ప్రసాద్ నివాసం వెలుపల నిరసన తెలిపారు కూడా. చివరకు సీమాంచల్ సహా బీహార్‌లోని అనేక ముస్లిం ప్రాబల్య అసెంబ్లీ నియోజకవర్గాలలో అభ్యర్థులను మజ్లిస్ బరిలోకి దింపింది.

రైతాంగానికి మోదీ మోసం

- విత్తన స్వావలంబన తాకట్టుకు సిద్ధం
- అంతర్జాతీయ ఒప్పందంతో నష్టం
- 26 నుంచి దేశవ్యాప్త ఆందోళనలు: ఏఐకేఎస్

న్యూదిల్లీ: మోదీ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలను అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ఆక్షేపించింది. అంతర్జాతీయ వేదికపై దేశ రైతులకు ప్రధాని మోదీ వెన్నుపోటుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టింది. విత్తన స్వావలంబన తాకట్టు పెట్టే దిశగా అడుగులు పడుతున్నాయని వ్యాఖ్యానించింది. ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు పెరూ రాజధాని లిమాలో జరగబోయే సదస్సులో భాగంగా ఆహారం, వ్యవసాయానికి సంబంధించిన వృక్షజన్యు వనరులపై అంతర్జాతీయ ఒప్పందం (ఐటీపీజీఆర్ఎఫ్ఏ)పై సంతకాలు జరగనుండటాన్ని వ్యతిరేకించింది. ఈ ఒప్పందం జరిగితే భారతదేశం విత్తన స్వాలంబనను కోల్పోతుందని శుక్రవారం ఓ ప్రకటనలో ఏఐకేఎస్ అధ్యక్ష-ప్రధాన కార్యదర్శులు రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ మోసపూరిత వైఖరిని దుయ్యబట్టారు. దేశీయంగా రైతులను చాంపియన్స్ అంటూ విదేశాల్లో వారి వెన్ను విరిచేలా మోదీ ప్రభుత్వ చర్యలు ఉన్నాయని విమర్శించారు. వృక్ష జన్యు వనరులన్నింటిని సమ్మిళితం చేసేలా బహుపాక్షిక వ్యవస్థ కోసం జరగబోయే ఒప్పందంతో రైతాంగానికి ముప్పు పొంచివున్నట్లు తెలిపారు. దీనిని తక్షణమే బహిరంగంగా తిరస్కరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. భారత్‌కు చెందిన జన్యు వనరుల నుంచి వాణిజ్య ప్రయోజనాల కోసం కార్పొరేట్లకు చెల్లింపునకు హామీనిచ్చే తప్పనిసరి, పారదర్శక, సమాన వ్యవస్థ కోసం పోరాటానికి ఏఐకేఎస్ పిలుపునిచ్చింది. డిజిటల్ బయోపైరసీ నుంచి వనరుల రక్షణ కోసం కఠినమైన ఒప్పంద నిబంధనల కింద డీఎస్ఐ తేవాలని కోరింది. ప్రయోజనాలు పంచుకోవడంపైనా కట్టుదిట్టమైన విధానాన్ని అనుసరించాలని కేంద్రాన్ని సూచించింది. దేశం-రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం కట్టుబడిన వ్యక్తులతో ప్రస్తుతం చర్చలు జరుపుతున్న డాక్టర్ సునీల్ అర్చక్ సహా ప్రతినిధుల బృందాన్ని భర్తీ చేయాలని ఏఐకేఎస్ డిమాండ్ చేసింది. విత్తన స్వావలంబన తాకట్టు పెట్టడం అన్నది కొత్త రైతాంగ వ్యతిరేక విధానాల్లో ఒకటిగా వ్యాఖ్యానించింది. ఎంఎస్‌పీకి చట్టబద్ధత కోసం దీర్ఘకాలంగా ఉన్న డిమాండ్‌ను నేటికీ పరిష్కరించలేదని, రుణ మాఫీ కల్పించలేదని కేంద్రాన్ని దుయ్యబట్టింది. తమ డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్త ఆందోళనలు చేస్తామని హెచ్చరించింది. ఇందుకోసం అన్ని రైతు సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా భాగస్వాములు, పౌరులు సమాయత్తం కావాలని కోరింది. ఈనెల 26వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా ఆందోళనలపర్వం మొదలు కాబోతోందని ఏఐకేఎస్ ప్రకటించింది.

రాజధాని రైతుల సమస్యలపై

సీఆర్‌డీఏ బాధ్యతారాహిత్యం: ముప్పాళ్ల

విశాలాంధ్ర-తుళ్లూరు: రాజధాని రైతుల సమస్యల పరిష్కారంలో సీఆర్‌డీఏ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. సీపీఐ శతవార్షికోత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేసే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాజధాని ప్రాంతం తుళ్లూరులో కార్యకర్తల సన్నాహక సమావేశం జరిగింది. ముప్పాళ్ల మాట్లాడుతూ రాజధానిలో మూడు వేల మంది రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు వీధిపోట్లు సమస్య ఉందని, సీఆర్‌డీఏ అధికారుల వద్దకు ఎన్నిసార్లు వెళ్లినా ప్రయోజనం లేదన్నారు. ప్లాట్లను ల్యాండ్ పూలింగ్‌కు ఇవ్వని భూముల్లో ఇచ్చారని, సరిజేయమని రైతులు మొత్తుకుంటున్నా, మంత్రులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదన్నారు. బోరుపాలెం, అబ్బరాజుపాలెం, రాయపూడిలో నిమ్మ, అరటి తదితర పంటలకు జరీబు ప్యాకేజి ఇచ్చి అర్ధాంతరంగా నిలిపివేశారని, తరువాత వాటిని మెట్ట భూములుగా చెబుతున్నారని విమర్శించారు. సీఆర్‌డీఏ అధికారుల వైఖరిపై రాజధాని రైతుల్లో అసంతృప్తి ఉందని అన్నారు. సీఆర్‌డీఏ కార్యాలయం అవినీతిమయమైందని, డబ్బులిస్తే నచ్చినచోట ప్లాట్లు కేటాయిస్తున్నారన్న ఆరోపణలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని ముప్పాళ్ల నాగేశ్వరారవు డిమాండ్ చేశారు.' రైతులను కలిసేందుకు మంత్రి నారాయణకు 14 నెలలుగా సమయం దొరకలేదా? ఆగస్టు 5న 14 అంశాలతో వినతిపత్రం ఇస్తే చేసిన పనికి సంబంధించిన వివరాలను ప్రతినెలా తెలుపుతామని చెప్పి మూడు నెలలు గడిచినా అతీగతీలేదు. సూటు, బూటు వేసుకున్న వాళ్లకు తప్ప పంచె కట్టే రైతులను సీఆర్‌డీఏ అధికారులు పట్టించుకోరా?ఏటా రైతులకు కౌలు పెంచి ఇచ్చినట్లుగానే భూమిలేని వారికి అమరావతి సామాజిక ఫించన్ పెంచాలి. రాజధాని 29 గ్రామాల్లో అవసరమైన ప్రతి ఇంటికి ఉపాధి, రుణ సౌకర్యం కల్పించాలి విట్, ఎస్ఆర్ఎం, అమృత సంస్థలు చట్టానికి అతీతంగా వ్యవహరిస్తుండటం గర్హనీయం. ఎస్ఆర్ఎంలో భోజనం సరిగ్గాలేని విషయం వాకబు చేసేందుకు మీడియాకు అనుమతి ఇవ్వలేదు' అని ముప్పాళ్ల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ సీపీఐ శత వార్షికోత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలన్నారు. ఈనెల 18న గుంటూరు కలెక్టరేట్ ఎదుట సామాజిక న్యాయం సమానత్వం ఆత్మగౌరవం అనే నినాదంతో నిర్వహించే సభకు అన్ని వర్గాల వారు రావాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి కంభంపాటి దేవుని దయ, మహిళా సమాఖ్య నాయకురాలు తోకల అనురాదా, ఏఐటీయూసీ నాయకులు బెజవాడ యాకోబు, పుట్ట నాగేశ్వరరావు, మోహన్ రావు, గుర్రంకొండ సత్యానందం, అమరావతి మండల కార్యదర్శి చెన్నకేశవులు, జీవీ రాజు పాల్గొన్నారు.

సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలి...

దిల్లీలో ఎస్టీయూ, ఏఐఎఫ్‌పీటీవో ధర్నా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి/దిల్లీ: సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయిస్తూ సుప్రీంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేస్తూ న్యూదిల్లీ జంతర్ మంతర్ వద్ద స్టేట్ టీచర్స్ యూనియన్-ఆంధ్రప్రదేశ్ (ఎస్టీయూ-ఏపీ), దాని జాతీయ స్థాయి అనుబంధ సంఘమైన ఆల్ ఇండియా ఫెడరేషన్ ఫర్ ప్రైమరీ టీచర్ ఆర్గనైజేషన్ (ఏఐఎఫ్‌పీటీవో) శుక్రవారం ధర్నా నిర్వహించాయి. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులు 50సంవత్సరాలు నిండినప్పటికీ ఇప్పుడు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో ఉత్తీర్ణులవ్వాలన్న నిబంధన సరికాదన్నారు. ఆ వయసులో తమ సబ్జెక్టుతోపాటు ఇతర సబ్జెక్టుల పరీక్షలకు సన్నద్ధులు కావడం వారికి భారంగా మారుతుందని, అది సరైన విధానం కాదన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ ఇతర ఏ ప్రభుత్వ ఉద్యోగి...ఇన్‌సర్వీసులో ఉండి ఎంపిక కావడానికి కావలసిన ఏ పరీక్షను రాయలేదని తెలిపారు. ఉపాధ్యాయులను ఈ పరీక్ష నుంచి మినహాయించాలని, ఉపాధ్యాయ సంఘాలు సుప్రీంలో రివ్యూ పిటిషన్ దాఖలు చేశాయని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. ధర్నా కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎన్.శివప్రసాద్, పి.రమణారెడ్డి, పి.దొరబాబు, ఎస్ఎస్ పల్లంరాజు, మోర్త శ్రీనివాస్, కె.కాశీ విశ్వనాథం, ఎన్.వెంకటేశ్వరరావు, కె.ఎర్రయ్య, వివిధ రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్షణ ఉత్పత్తుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం

రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: దేశ రక్షణ, ఏరోస్పేస్ తయారీకి ఆంధ్ర ప్రదేశ్‌ను అత్యంత ప్రాధాన్యత కలిగిన గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. విశాఖలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా రక్షణ, ఏరోస్పేస్ మొదలయిన రంగాలలో ఆంధ్ర ప్రదేశ్ ఎలా కీలక కేంద్రంగా మారుతుందనే అంశంపై శుక్రవారం జరిగిన ప్లీనరీలో ఆయన మాట్లాడారు. కేవలం వ్యాపార అంశాలకే తాము పరిమితం కాకుండా, రక్షణ, ఏరోస్పేస్ రంగాలు దేశ భద్రతకు దోహదపడే ప్రభావ కార్యకలాపాలలో తాము భాగస్వాములు కావడం, ఆత్మ నిర్భర భారత్ సాకారానికి తమ వంతు సహాయం కూడా అందించడం ఎంతో గొప్ప అవకాశమని తెలిపారు. రాష్ట్రంలో నైపుణ్యాల పూల్‌ను సృష్టించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న అంతరిక్ష, రక్షణ రంగ ప్రముఖులు... ఆంధ్ర ప్రదేశ్‌లో పెట్టుబడులు, అభివృద్ధికి గల అనుకూలతను ప్రశంసించారు. ఇస్రో సలహాదారు డా. ఎస్.సోమనాథ్ మాట్లాడుతూ ప్రైవేట్ రంగానికి చిన్నపాటి నుంచి పెద్ద రాకెట్లను ప్రయోగించడానికి వీలుగా వికాస్ లాంచ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా రాకెట్లు, ఉపగ్రహాల తయారీ కేంద్రాన్ని స్థాపించడానికి సత్యసాయి జిల్లా, తిరుపతి కారిడార్లలో ప్రాంతాలను గుర్తించామని, ఇక్కడ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను సృష్టిస్తామని చెప్పారు. దీనిపై స్పందించిన డా.చంద్రిక కౌశిక్ (డీఆర్డీఓ), ఏపీ ప్రతిపాదించిన స్పేస్ సిటీ అనేది ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

హెచ్ఎఫ్‌సీఎల్ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంపత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యాపార వేగం అద్భుతంగా ఉందని ప్రశంసించారు. రూ.1,400 కోట్ల పెట్టుబడితో రక్షణ తయారీ కేంద్రాన్ని స్థాపించడానికి అవసరమైన అన్ని అనుమతులు 'ఓవర్ ఏ ఫోన్' ద్వారానే లభించాయని తెలిపారు. రానున్న నాలుగేళ్లలో ఈ కేంద్రం 3,05,000 సెల్స్ ఉత్పత్తి చేస్తుందని, తద్వారా 3,500 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని ఆయన ప్రకటించారు. అలాగే కళ్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సీఈఓ జయరామ్ ముమ్మిడి మాట్లాడుతూ రక్షణ రంగంలో ఆంధ్ర ప్రదేశ్‌కు 1 లక్ష ఉద్యోగాలు కల్పించే సామర్థ్యం ఉందని చెప్పారు. యువ పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న మద్దతు... ఉపగ్రహాలు వంటి అధునాతన సాంకేతికత అభివృద్ధికి కీలకమని డిగంతర సీఈఓ అనిరుధ్ శర్మ తెలిపారు.

సతీశ్ కుమార్ మృతి అనుమానాస్పదం: శైలజానాథ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీటీడీ మాజీ అసిస్టెంట్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఏవీఎస్ఓ) అనుమానాస్పద మృతిపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సతీశ్‌కుమార్ నాడు పరకామణిలో డాలర్ల చోరీ కేసులో నిందితుడు రవికుమార్‌ను పట్టుకుని స్వయంగా పోలీసులకు అప్పగించాడని, ఇప్పుడు అదే కేసులో అదే సతీశ్ కుమార్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిందితుడిగా చేర్చి... వేధించిందని అన్నారు. నాలుగు రోజుల తర్వాత సతీశ్ కుమార్ తాడిపత్రి వద్ద రైల్వే ట్రాక్‌పై మృతి చెంది ఉండటం అనేక అనుమానాలకు తావునిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం తన స్వార్థ ప్రయోజనాల కోసం టీటీడీని రాజకీయాలకు కేంద్రంగా చేసిందని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అరాచక పాలన సాగుతోందని, అందులో భాగంగానే సతీశ్ కుమార్ ప్రాణాలతో లేకుండా పోయాడని తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.